www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'ఆవకాయ'.. అమరావతి ఉత్సవం

పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో

జనవరి 8 నుంచి 10 వరకూ నిర్వహణ

ప్రవేశం పూర్తి ఉచితం 12

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుర్గేశ్



'ఆవకాయ' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుర్గేశ్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, టీమ్ వర్క్ ఆర్ట్స్ ఎండీ సంజయ్

మంగళవారం | 23-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 287 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ.12:13 తదపరి చవితి, నక్షత్రం: శ్రవణం పూర్తి, వర్జ్యం: ఉ.9:48-11:30, దుర్ముహూర్తం: ఉ.8:56-9:40, రా.10:00-10:50, అమృతఘడియలు: రా.8:02-9:44, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:45, సూర్యాస్తమయం: 5:43 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బెదిరింపులు మానండి!

లేదంటే ఏం చేయాలో తెలుసు

వైసీపీ నేతలకు పవన్ హెచ్చరిక



'పదవి-బాధ్యత' సమావేశంలో నేతలకు జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివాదం

రౌడీలకు సపోర్టు చేసేది పార్టీయే కాదు

చంపేస్తాం.. మేమేంటో చూపిస్తామని ఒక మాజీ సీఎం బెదిరిస్తున్నారు

ఇది తప్పుడు సంకేతాలు ఇవ్వడమే

క్రిమినాలిటీ పెరిగిపోతే రాష్ట్రాన్ని ఎవరూ బాగుచేయలేరు

జనసేన నేతలు ప్రైవేటు సెటిల్‌మెంట్స్ చేయొద్దు

మన కోసం చొక్కాలు చించుకున్నారు

ఆడపిల్లలు కూడా రోడ్డు మీదకు వచ్చి ఓట్లేశారు

అందుకు కృతజ్ఞతగా మనం ప్రజల వైపు నిలబడాలి

లేదంటే అందరం తలదించుకోవలసి వస్తుంది

పార్టీ, పదవుల కంటే జనమే నాకు ముఖ్యం

వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు

అధికారులు గమనించాలి: డిప్యూటీ సీఎం

పదవులు పొందిన జనసేన నేతలతో 'పదవి-బాధ్యత' పేరిట సమావేశం

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'ఒక మాజీ సీఎం వచ్చి.. మిమ్మల్ని చంపేస్తాం.. మేమంటే ఏమిటో చూపిస్తామని అధికారులను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారంటే తప్పుడు సంకేతాలు ఇస్తున్నామని అర్థం. శాశ్వతంగా ఇలాంటి మాటలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలో నాకు బాగా తెలుసు. వైసీపీ నాయకులు బెదిరించడం మానాలి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నేతలతో సోమవారం మంగళగిరిలో నిర్వహించిన 'పదవి-బాధ్యత' కార్యక్రమంలో ఆయన వారితో ప్రమాణం చేయించారు. సుదీర్ఘంగా

మిగతా 12వ పేజీలో...

తప్పు చేసినవాడిని దెబ్బ కూడా కొట్టకూడదంటే క్రిమినాలిటీ ఎక్కడ ఆగుతుంది.. నేరాలు ఎక్కడ ఆగుతాయి..? జనసేన నాయకులు పదవీ బాధ్యతలో భాగంగా.. పనిచేసే పోలీసులకు మద్దతుగా నిలబడాల్సిందే. - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



సోమవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో కేక్ కట్ చేస్తున్న సీఎం చంద్రబాబు 13

అమరావతిలో సాంస్కృతిక కేంద్రం 13

గడువులోగా క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్

రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

పర్యాటకులను ఆకట్టుకునేలా గ్రీనరీ, పార్కులు

సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో సీఎం ఆదేశాలు

103 కోట్లతో క్వాంటమ్ వ్యాలీ ప్రత్యేక భవనం

443 కోట్లతో వరద పంపింగ్ స్టేషన్లు

లేఅవుట్లలో 1,358 కోట్లతో సదుపాయాలు

పలు అంశాలకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం

తాట తీస్తున్నారు

నేరస్థులపై పోలీసుల ఉక్కుపాదం

శాంతిభద్రతల విషయంలో కఠిన వైఖరి

రేపిస్టులకు తమ మార్క్ ట్రీట్‌మెంట్

ఫిర్యాదు అందిన వెంటనే కటకటాల్లోకి

రౌడీలు, డాన్లపై పీడీ యాక్ట్

నిందితులను రోడ్లపై నడిపిస్తూ జైలుకు

గంజాయి బ్యాచ్‌పై కొరడా

ఎవరు చట్టాలు ఉల్లంఘించినా కేసులు

చంద్రబాబు, పవన్ హెచ్చరికలతో చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలో రౌడీయిజానికి చోటు ఉండకూడదు. పోలీసులంటే నేరగాళ్లకు భయం ఉండాలి. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు'.. మూడు రోజుల క్రితం సీఎం చంద్రబాబు జిల్లాల ఎస్పీలకు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలివి. 'రౌడీయిజం చేస్తే సహించబోం.. యోగి ఆదిత్యనాథ్(యూపీ సీఎం) ట్రీట్‌మెంట్ ఇస్తాం..' అంటూ తాజాగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వార్నింగ్. వాస్తవానికి ఇంతకు ముందు కూడా శాంతిభద్రతలపై చంద్రబాబు, పవన్ కఠిన వైఖరి స్పష్టం చేశారు. వారి హెచ్చరికలు ఫలిస్తున్నాయి. నేరస్థుల పట్ల పోలీసులు

మిగతా 11వ పేజీలో...

నాడు

వైసీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు సమీపంలోనే ఘోరం జరిగింది. కృష్ణా నది ఒడ్డున కాబోయే భర్తతో కలిసి కూర్చున్న యువతిపై గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ దారుణానికి పాల్పడిన నిందితుల్ని ఏళ్ల తరబడి అరెస్టు చేయలేకపోయారు.

నేడు

నవంబరులో చిత్తూరు జిల్లాలో ఓ యువతిపై గ్యాంగ్ రేప్ చేసిన నిందితులను ఒక్క రోజులోనే పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మంగళగిరిలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నలుగురు యువకులను ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే కటకటాల్లోకి పంపారు. అక్కడా, ఇక్కడా పోలీసులు నిందితులకు తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చి నడిరోడ్డుపై నడిపిస్తూ లాక్కెళ్లారు.

శాంతిభద్రతల విషయంలో జగన్ సర్కారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుకు ఈ ఘటనలు ఓ ఉదాహరణ. నాడు రౌడీలు, అసాంఘిక శక్తులకు ప్రభుత్వ పెద్దలే వత్తాసు పలకగా.. ఇప్పుడు తేడా చేస్తే తాట తీస్తామంటున్నారు.

గర్భిణి గొంతు నొక్కి.. కడుపుపై తన్ని..

జగన్ పుట్టిన రోజు వేడుకల పేరిట అరాచకం

శ్రీ సత్యసాయి జిల్లాలో అమానవీయ ఘటన

ఏలూరు జిల్లాలోనూ రెచ్చిపోయిన శ్రేణులు

పోలీసుల కాలర్ పట్టుకున్న నలుగురు

రక్తాభిషేకాలు, రప్పా.. రప్పా.. కార్యకర్తలపై చర్యలు

చిత్తూరు, ఉమ్మడి అనంతలో 34 మందిపై కేసులు

టపాసుల మోతతో ఇబ్బంది అన్నందుకు వైసీపీ మూకల దాష్టీకం



గర్భిణి సంధ్యారాణిని పరామర్శిస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

తనకల్లు, ద్వారకాతిరుమల, రామకుప్పం, అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'రప్పా.. రప్పా..', 'గంగమ్మ జాతర..' అంటూ రెచ్చిపోతున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు.. తమ అధినేత జగన్ పుట్టిన రోజు సందర్భంగా శాడిజాన్ని ప్రదర్శించారు. 'టపాసులు పేల్చొద్దు.. నాకు ఇబ్బందిగా ఉంది..' అని అడిగిన ఏడు నెలల గర్భిణిపై దౌర్జన్యానికి దిగారు. ఆమె గొంతు పట్టుకుని.. కడుపుపై కాలితో తన్నారు. దీంతో ఆమె ఆస్పత్రి పాలైంది. ఈ అమానవీయ ఘటన శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ముత్యాలవారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు... మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా గ్రామంలో

మిగతా 14వ పేజీలో...



ఇంటర్నేషనల్ జోష్

సింగపూర్, షార్జా..

సీట్లన్నీ ఫుల్!

విజయవాడలో అంతర్జాతీయ విమానాల దూకుడు

సింగపూర్, షార్జాలకు నేరుగా సర్వీసులు

100 శాతం ఆక్యుపెన్సీతో నిండుగా రాకపోకలు

దుబాయ్ వెళ్లేవారు షార్జాకు.. అక్కడి నుంచి సులువుగా గమ్యానికి

దుబాయ్, శ్రీలంకలకు సర్వీసులు నడపాలంటున్న ప్రయాణికులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

విజయవాడ నుంచి అంతర్జాతీయ విమానయానం జోరందుకుంది. నిండుగా నడుస్తున్న విమానాల్లో టికెట్లు దొరకడం కూడా కష్టమవుతోంది. ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి షార్జా, సింగపూర్‌లకు రెండు అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. మంగళ, శనివారాల్లో షార్జాకు ఎయిరిండియా విమాన సర్వీసులు నడుస్తున్నాయి. మంగళ, గురు, శనివారాల్లో సింగపూర్‌కు

మిగతా 12వ పేజీలో...

ఎవరి ఒత్తిడితో చేశారు?



దైవ భక్తి ఉందంటూనే కల్తీ నెయ్యికి ఆమోదమా?

చెవిరెడ్డిని ప్రశ్నించిన సీబీఐ సిట్

కొనుగోలు కమిటీలో ఉన్నప్పటికీ అన్నీ అధికారులే చూసుకున్నారు 13

నాకా విషయమే తెలీదు..: మాజీ ఎమ్మెల్యే

మంత్రి పార్థసారథి, వేమిరెడ్డి ప్రశాంతినీ త్వరలో ప్రశ్నించే అవకాశం

గల్ఫ్ దేశాల్లో కాలనాగులు!

భర్త శవం కదలాలంటే కోరిక తీర్చాలంటూ వేధింపులు

సాయం పేరిట మృతుల భార్యలపై ఒత్తిడి

దుబాయ్‌లో ఓ ప్రబుద్ధుడి బాగోతం వెలుగులోకి


టీడీపీ నాయకుడినంటూ ప్రచారం 14

ఖర్చు 25.. దోపిడీ 75

ఒక్కో మద్యం క్వార్టర్ బాటిల్ తయారీకి అవసరమయ్యే బ్లెండ్ ఖర్చు రూ.15 లోపు ఉంటుంది. కానీ బెంగళూరుకు చెందిన బాలాజీ రూ.45కు అద్దేపల్లి సోదరులకు విక్రయించాడు. నకిలీ మద్యం నింపడానికి ప్లాస్టిక్ ఖాళీ సీసాకు ఒక రూపాయి, మూతకు మరో రూపాయి, బాటిల్‌పై అంటించే లేబుల్‌కు 20 పైసలు ఖర్చు చేశారు. బ్లెండ్, ఇతర ఖర్చు మొత్తం కలిపినా క్వార్టర్ బాటిల్‌కు రూ.48 మాత్రమే ఖర్చు అయ్యింది.

నకిలీ లిక్కర్ గ్యాంగ్ తమ మద్యం షాపుల్లో ఒక్కో బాటిల్‌ను రూ.100కు విక్రయించారు. ఒక్కో సీసాపై రూ.50కు పైగా లాభం అద్దేపల్లి సోదరులతో పాటు లిక్కర్ గ్యాంగ్‌కు వచ్చింది. బ్లెండ్ పంపిన బాలాజీకి రూ.20 చేరింది. ఇలా 2023లో వైసీపీ హయాంలో మొదలైన నకిలీ మద్యం దందాలో.. అప్పట్నుంచి మొన్నటి ఎక్సైజ్ దాడుల వరకు కోట్లలో సొమ్ము చేసుకున్నారు.

నకిలీ మద్యం ముఠాకు కాసుల వర్షం



ఒక్కో సీసాపై అద్దేపల్లి గ్యాంగ్‌కు 50%

బ్లెండ్ సరఫరా చేసిన బాలాజీకి 20%

ఎక్సైజ్ దాడుల్లో తేలింది రూ.1.68 కోట్లు

2023 నుంచే నకిలీ మద్యం దందా 14

అప్పట్నుంచి ఎన్ని కోట్లు సంపాదించారో?

ప్రభుత్వానికి వచ్చే పన్నులన్నీ వారి జేబుల్లోకి

మన 'తాగుడు' తక్కువే!

ఏపీలో తలసరి మద్యం వినియోగం 2.71 లీటర్లు

తెలంగాణ, కర్ణాటకల్లో సగటున 4 లీటర్లపైనే

మద్యంపై తలసరి ఖర్చూ తక్కువే

ఎక్సైజ్ శాఖ అంచనాల్లో ఆసక్తికర అంశాలు వెల్లడి 13

ప్రతి సీసాకూ ఓ నంబర్

బ్రాండ్, బ్యాచ్, తయారీ తేదీతో కూడిన 18 అంకెల గుర్తింపు సంఖ్య

నకిలీ మద్యం కట్టడికి వినూత్న విధానం

ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనకు సీఎం ఓకే

బెల్టు షాపుల నియంత్రణకు హరియాణా మోడల్ 14

ఎక్సైజ్ సమీక్షలో సూచనలు

స్టార్‌లింక్ ఉపగ్రహాలకు రష్యా గండం?



వాటిని లక్ష్యంగా చేసుకొని కొత్త ఆయుధాల తయారీ

ఉపగ్రహాలు ఉన్న కక్ష్యలోకి మిల్లీమీటర్ సైజు పెల్లెట్లను ప్రయోగించడం ద్వారా ధ్వంసం చేసే ప్రణాళిక?

17న ఓ శాటిలైట్‌తో సంబంధాలు తెగాయన్న స్టార్‌లింక్

నియంత్రణ కోల్పోయి భూమి వైపు వస్తున్న ఉపగ్రహం

దీని వెనుక రష్యానే ఉన్నట్లు అనుమానాలు

వాషింగ్టన్, డిసెంబరు 22: బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేని మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్‌నెట్ సేవలు అందించే లక్ష్యంతో తాము దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టిన ఉపగ్రహాల్లో ఒకదాంతో (శాటిలైట్ 35956) ఈ నెల 17 నుంచి సంబంధాలు తెగిపోయాయంటూ 18న మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' సంస్థ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టింది! కక్ష్యలో 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నప్పుడు అనూహ్య సాంకేతిక లోపం కారణంగా ఆ శాటిలైట్ ప్రొపల్షన్ ట్యాంకు నుంచి వాయువు విడుదలయ్యిందని.. దాంతో ఉపగ్రహం తన స్థిరత్వాన్ని

మిగతా 2వ పేజీలో...

ఇచ్చంపల్లి నుంచి తరలిస్తే మహారాష్ట్రకు ముంపు!

200 టీఎంసీల గోదావరి నీటిని తెలంగాణ వాడేసుకుంటుంది 3

గోదావరి-కావేరి అనుసంధానంపై ఏపీ స్పష్టీకరణ.. నేడు ఎన్‌డబ్ల్యూడీఏ భేటీ



మే 12 నుంచి ఈఏపీసెట్

7 రోజుల్లో 14 సెషన్ల నిర్వహణ

మే 4న లాసెట్, ఎడ్‌సెట్ 11

ప్రవేశ పరీక్షల షెడ్యూలు విడుదల

గగనతలంలో మొరాయించిన ఇంజన్

» ఎయిరిండియా విమానానికి తప్పిన పెను ప్రమాదం

న్యూఢిల్లీ, డిసెంబరు 22: ఎయిరిండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఆ సంస్థకు చెందిన బోయింగ్ 777-300ఈఆర్ విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే ఇంజన్ మొరాయించింది. ఆయిల్ ప్రెజర్ ఒక్కసారిగా తగ్గిపోవడంతో విమానాన్ని వెంటనే వెనక్కు మళ్లించి టేకాఫ్ అయిన చోటే అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విమానం సోమవారం ఉదయం 6:30 గంటలకు సుమారు 335 మందితో ఢిల్లీ విమానాశ్రయం నుంచి ముంబైకి బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుడివైపు ఇంజన్‌లో ఆయిల్ ప్రెజర్ ఉన్నట్టుండి జీరోకి పడిపోవడాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే విమానాన్ని వెనక్కు మళ్లించి ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై డీజీసీఏ దర్యాప్తు చేపట్టనుంది. పౌర విమానయాన శాఖ మంత్రిత్వ శాఖ కూడా ఈ ఘటనకు సంబంధించిన వివరాలు అందించాలని ఎయిరిండియాను కోరింది.


కారు బాంబు దాడిలో రష్యా జనరల్ మృతి

మాస్కో, డిసెంబరు 22: రష్యాలో కారు బాంబు దాడిలో కీలక సైనిక ఉన్నతాధికారి ప్రాణాలు కోల్పోయారు. సోమవారం దక్షిణ మాస్కోలో కారు కింద అమర్చిన బాంబు పేలి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ మరణించారని రష్యా దర్యాప్తు కమిటీ తెలిపింది. 56 ఏళ్ల సర్వరోవ్ సాయుధ దళాల కార్యాచరణ శిక్షణ విభాగానికి అధిపతిగా ఉన్నారని వెల్లడించింది. అపార్ట్‌మెంట్ బ్లాక్ సమీపంలోని కారు పార్కింగ్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ బాంబు దాడి వెనక ఉక్రెయిన్ ప్రత్యేక దళాల హస్తముందని రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు జరుపుతున్నారు. అయితే దీనిపై ఉక్రెయిన్ ఇప్పటివరకు స్పందించలేదు.

చెత్తకుప్పలో దొరికిన చైనా రైఫిల్ టెలిస్కోప్

జమ్మూ, డిసెంబరు 22: సరిహద్దుల్లో ఉగ్రవాదులు పొంచి ఉన్నారన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, జమ్మూలోని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ప్రధాన కార్యాలయం సమీపంలో చైనా తయారీ 'రైఫిల్ టెలిస్కోప్' లభించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. జమ్మూలోని అస్రారాబాద్ ప్రాంతంలో ఓ ఆరేళ్ల బాలుడు వింతగా ఉన్న వస్తువును బొమ్మ అనుకుని ఆడుకుంటుండగా గమనించిన అధికారులు, అనుమానంతో వెళ్లి పరిశీలించారు. ఆ వస్తువు అసాల్ట్ రైఫిళ్లకు, స్నైపర్లకు అమర్చే చైనా తయారీ టెలిస్కోప్ అని తేలింది. ఇంటి సమీపంలోని చెత్తకుప్పలో ఆ టెలిస్కోప్ దొరికినట్లు బాలుడి తల్లిదండ్రులు వెల్లడించారు.

స్టార్‌బక్స్ సీటీవోగా ఆనంద్ వరదరాజన్



హ్యూస్టన్, డిసెంబరు 22 : అమెరికాలో భారత సంతతికి చెందిన టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ ఆనంద్ వరదరాజన్ స్టార్‌బక్స్ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్(సీటీవో), ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఆయన దాదాపు రెండు దశాబ్దాలుగా అమెజాన్ గ్లోబల్ టెక్నాలజీ ఆపరేషన్లను నిర్వహిస్తూ ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 19న ఆయన స్టార్‌బక్స్‌లో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. తమ సంస్థ కార్యనిర్వాహక బృందంలో చేరనున్న ఆయన సీఈవో బ్రయన్ నికోల్‌కు నేరుగా రిపోర్ట్ చేస్తారని పేర్కొంది.

అన్ని దేశాలవారి ఆన్‌లైన్ ఖాతాల పరిశీలన

» హెచ్-1బీ, హెచ్-4 వీసాలపై అమెరికా ఎంబసీ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 22: అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి ఉద్దేశించిన హెచ్-1బీ, హెచ్-4 వీసాల విషయమై ఆ దేశ రాయబార కార్యాలయం సోమవారం తాజా సమాచారాన్ని విడుదల చేసింది. ఈ వీసాలు కోరుకుంటున్న ప్రపంచంలోని అన్ని దేశాల వారి దరఖాస్తులను కూడా అమెరికా ప్రభుత్వం పరిశీలించనుందని తెలిపింది. వారి ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల ఖాతాలను తనిఖీ చేస్తుందని పేర్కొంది. ప్రామాణిక తనిఖీల్లో భాగంగా ఆన్‌లైన్ ప్రెజెన్స్ రివ్యూలను చేపట్టనుందని వివరించింది. ఈ కారణంతోనే డిసెంబరు 15న జరగాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఇవి మార్చిలో జరిగే అవకాశం ఉంది.

ఈవోలు ఎఫ్ఆర్ఎస్ వేయాల్సిందే!

» దేవదాయశాఖ కమిషనర్ ఆదేశం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు(ఈవో), ఆలయ ఉద్యోగులు, సిబ్బంది కచ్చితంగా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోవాల్సిందేనని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. 'దేవుడికీ దొరకరు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. అన్ని ఆలయాల్లో కచ్చితంగా ఎఫ్ఆర్ఎస్‌ను ప్రతి రోజు అమలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల ఈవోలకు అత్యవసర మెమోను జారీ చేశారు. ఆలయాల్లో విధులు నిర్వహించే ఈవోలతో పాటు ప్రతి ఒక్కరూ ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోవాలని, ఏదైనా కారణాలతో నమోదు చేసుకోలేని పక్షంలో వెంటనే పై అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని నిర్దేశించారు. అలానే జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, జిల్లా ఎండోమెంట్ అధికారులు వారి పరిధిలో ఉన్న ఈవోలు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేస్తున్నారో లేదో అన్న అంశాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.

7 డీఎస్‌హెచ్ ఆస్పత్రుల్లో 'టిఫా' స్కానింగ్

» 1 నుంచి అందుబాటులోకి: మంత్రి సత్యకుమార్

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తొలిసారిగా ఏడు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) ఆస్పత్రుల్లో 'టిఫా' స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఒక్కో యంత్రం రూ.30.48 లక్షల చొప్పున ఏడు స్కానింగ్ యంత్రాలకు రూ.2.13 కోట్లు వ్యయం చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం, తుని, నందిగామ, ఒంగోలులోని ఎంసీహెచ్ బ్లాక్‌లో, పార్వతీపురం, తెనాలి, అనకాపల్లి జిల్లా ఆస్పత్రుల్లో టిఫా స్కానింగులను సిద్ధం చేసినట్లు తెలిపారు. జనవరి 1 నుంచి ఆ సేవలు పూర్తిస్థాయిలో గర్భిణులకు అందుబాటులో వస్తాయని చెప్పారు. ఉత్తరాంధ్రలోని మూడు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయడం వల్ల గిరిజన మహిళలకు ఆధునిక వైద్య సేవలు మరింత అందుబాటులోనికి వచ్చినట్లు అవుతుందన్నారు. శిశువు గర్భంలో ఏ స్థితిలో ఉంది? ఉమ్మనీరు స్థితి తదితరాలను టిఫాతో గుర్తిస్తారని తెలిపారు. అంతర్జాతీయ నివేదికలు, వైద్య నిపుణుల గణాంకాల ప్రకారం ప్రతి వంద మంది శిశువుల్లో ఏడుగురికి ఏదో ఒక లోపం ఉంటోందన్నారు. ఆ లోపాలను టిఫా స్కాన్ల ద్వారా ముందుగానే గుర్తించేందుకు, అవసరమైన ఉన్నత వైద్యాన్ని తక్షణమే పొందేందుకు వెసులుబాటు ఏర్పడుతుందని వివరించారు.

ఉపాధి హామీపై బుల్డోజర్

పథకం మొత్తం ధ్వంసం

» ఇకపై నిర్ణయాలు తీసుకునేది పల్లెల్లో కాదు...ఢిల్లీలో

» పని హక్కు పరిరక్షణకు ఏకం కావాలి

» సోనియా గాంధీ పిలుపు



న్యూఢిల్లీ, డిసెంబరు 22: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 'విధ్వంసం చేయడం' వల్ల దేశంలోకి కోట్లాది మంది గ్రామీణులు దారుణమైన విపత్తును ఎదుర్కోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ ఉపాధి కల్పించే హక్కును కాపాడుకోవడానికి ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వీబీ- జీ రాం జీ' పథకాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో ఆమె ఓ ఆంగ్ల దినపత్రికలో వ్యాసం రాశారు. మహాత్మాగాంధీ ఆశయమైన సర్వోదయ స్ఫూర్తితో, రాజ్యాంగంలోని 41వ అధికరణంలో పొందుపరిచిన 'పని హక్కు'కు అనుగుణంగా ఉపాధి హామీ పథకాన్ని రూపొందించారని తెలిపారు. దానిని నరేంద్ర మోదీ ప్రభుత్వం బుల్డోజర్‌తో విధ్వంసం చేసిందని ఆరోపించారు. "ఎలాంటి చర్చలు లేవు. సంప్రదింపులు లేవు. పార్లమెంటరీ సంప్రదాయాలనుగానీ, కేంద్ర-రాష్ట్ర సంబంధాలనుగానీ గౌరవించినదీ లేదు. ఈ ప్రక్రియలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం చాలా చిన్న అంశం. జీవితాలపై ప్రభావం చూపే మొమత్తం పథకాన్నే నాశనం చేయడం గమనించదగ్గది" అని పేర్కొన్నారు. నూతన వీబీ- జీ రాం జీ పథకం చాలా ఆంక్షలతో కూడుకున్నదని సోనియా అభిప్రాయపడ్డారు. దీంట్లోని నిబంధనలు అధికారుల ఆదేశాల్లాంటివి తప్ప ప్రజల ప్రమేయంతో కూడుకున్నవి కావని తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ విచక్షణ అధికారంతో ఇది అమలవుతుంది. నిధుల కేటాయింపుపై బడ్జెట్‌లో పరిమితి విధిస్తారు. దీనివల్ల పని దినాలపైనా ఆంక్షలు ఉంటాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకుండా కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనులు ఉంటాయి. ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తామన్న హామీకి చెల్లుచీటి పలికారు" అని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో భూమి లేని పేదల బేరమాడే శక్తి పెరిగిందని, అందువల్ల వ్యవసాయ కూలీ పెరిగిందని సోనియా తెలిపారు. ఈ పథకం కనబరిచిన పెద్ద ప్రభావం ఇదేనని పేర్కొన్నారు. కొత్త చట్టం ద్వారా ఈ బేరమాడే శక్తిని ఇప్పుడు కోల్పోతారని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంపై ఆధారపడ్డవారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వేతనాల పెరుగుదలను అడ్డుకోవడం సరికాదని తెలిపారు. కొత్త పథకం అమలుకు భారీ స్థాయిలో నిధులు సమకూర్చాల్సిన బాధ్యతను మోదీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఉంచిందని సోనియా తెలిపారు. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలపై మరింత భారం మోపినట్టయిందని పేర్కొన్నారు. గతంలో కేంద్ర నిధులు 90శాతం మేర, రాష్ట్ర నిధులు 10 శాతం మేర ఉండగా; ఇప్పుడు కేంద్ర వాటా 60 శాతం, రాష్ట్ర వాటా 40 శాతంగా ఉందని తెలిపారు. అందువల్ల ఈ పథకాన్ని అమలు చేయవద్దన్నట్టుగా కేంద్రం ధోరణి ఉందని ఆరోపించారు. ఉపాధి కల్పన కాలాన్ని 100 నుంచి 125 రోజులకు పెంచినట్టు మోదీ ప్రభుత్వం చెబుతున్నా నిజానికి గత పదేళ్ల కాలంలో నిర్ణీత లక్ష్యాన్ని చేరుకున్న సందర్భం లేదని తెలిపారు. నిధులు కేటాయించకపోవడం, సకాలంలో కూలీ సొమ్ము విడుదల చేయకపోవడం, సాంకేతిక పరిజ్ఞానం పేరుతో జాబితాల నుంచి కూలీల పేర్లు తొలగించడం వంటి తిరోగమన చర్యలను చేపట్టిందని వివరించారు. ఉపాధి, పనుల కోసం ప్రజలు డిమాండు చేసే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. దీనిని కేవలం ఒక పథకం రద్దుగా చూడకూడదని, పని హక్కును తొలగించి, రాజ్యాంగంపై దాడి చేయడానికి అధికార పార్టీ చేస్తున్న ప్రయత్నంగా భావించాలని అన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ హైకోర్టు నోటీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈడీ పిటిషన్‌పై స్పందనను కోరుతూ సోమవారం సోనియా, రాహుల్‌లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రధాన పిటిషన్‌తోపాటు ఈనెల 16న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే కోరుతూ ఈడీ దరఖాస్తు చేయడంతో సోనియా, రాహుల్, ఇతరులకు జస్టిస్ రవీందర్ నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేశారు. ఎఫ్ఐఆర్ లేనందున మనీలాండరింగ్ నేరానికి సంబంధించిన దర్యాప్తు, తదనంతర ప్రాసిక్యూషన్ ఫిర్యాదు చెల్లదని ట్రయల్ కోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన మాజీ ఐపీఎస్ ఆత్మహత్య

» రూ.8 కోట్ల మేర నష్టం.. తుపాకీతో కాల్చుకొని మృతి



అమర్ సింగ్

పటియాలా, డిసెంబరు 22: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఓ మాజీ ఐపీఎస్ అధికారి సోమవారం ప్రాణాలు తీసుకున్నారు. పంజాబ్ ఐజీగా పనిచేసిన అమర్ సింగ్ చహల్ తన సెక్యూరిటీ గార్డు చేతిలోని రైఫిల్ లాక్కొని ఆత్మహత్య చేసుకున్నారు. వెల్త్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు ఆయనను రూ.8.10 కోట్ల మేర మోసగించారు. ఆత్మహత్యకు ముందు ఆయన మోసం జరిగిన తీరును వివరిస్తూ డీజీపీ గౌరవ్ యాదవ్‌కు 12 పేజీల లేఖ రాశారు. ఎఫ్-777 డీబీఎస్ వెల్త్ ఈక్విటీ రీసెర్చ్ గ్రూపు పేరుతో డీబీఎస్ బ్యాంకు, ఆ బ్యాంకు సీఈఓ పేరుతో మోసగించారని ఆ లేఖలో తెలిపారు. తన కుటుంబాన్ని నాశనం చేయడంతో పాటు, పంజాబ్ పోలీసులకు కూడా మచ్చతెచ్చానని ఆ లేఖలో బాధపడ్డారు. తన దగ్గర ఎలాంటి ఆయుధం లేనందునే గన్‌మ్యాన్ చేతిలోని రైఫిల్‌ను లాక్కొన్నట్టు ఆయన లేఖలో పేర్కొన్నారు.

సౌదీలో నగదు చెల్లింపులకు చెల్లు

గృహ కార్మికులకు ఈ-శాలరీ పద్ధతి..1 నుంచి అమలు

రియాద్, డిసెంబరు 22: సౌదీ అరేబియాలో గృహ కార్మికులకు డిజిటల్ చెల్లింపుల విధానం ప్రవేశపెట్టారు. వేతనాలను చేతికి ఇచ్చే పద్ధతికి జనవరి ఒకటో తేదీ నుంచి స్వస్తి పలకనున్నారు. వేతన భద్రత, పారదర్శకత, ఉపాధి ప్రక్రియను సరళతరం చేయడంలో భాగంగా ఈ- శాలరీ విధానం తెచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త విధానంలో అధికారిక డిజిటల్ వ్యవస్థ అయిన ముసానెద్ ప్లాట్‌ఫామ్ ద్వారా మాత్రమే వేతన చెల్లింపులు జరుగుతాయి. ఇందులోభాగంగా గుర్తింపు పొందిన బ్యాంకుల ఖాతాలు, డిజిటల్ వ్యాలెట్‌ల నుంచి వీటిని గృహ కార్మికులు డ్రా చేసుకుంటారు. ఈ చెల్లింపులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా ఆ సమయంలో అందిస్తారు. ఇది జనవరి 1 నుంచి సౌదీ అరేబియా దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది.

'సిందూర్' వేళ పాక్‌ను దేవుడే కాపాడాడు: మునీర్



ఇస్లామాబాద్, డిసెంబరు 22: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌ను దేవుడే కాపాడాడని పాక్ త్రివిధ దళాల అధిపతి(సీడీఎఫ్) అసీం మునీర్ వ్యాఖ్యానించారు. ఈనెల మొదట్లో ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఉలేమాల జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో ఖురాన్ శ్లోకాలను మునీర్ పఠించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం ఈ ఏడాది మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాకిస్థాన్, పీవోకే(పాక్ ఆక్రమిత కశ్మీర్)లలో 9 ఉగ్రవాద స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఆ సందర్భంగా నాలుగు రోజుల పాటు ఇరుదేశాల మధ్య దాడులు కొనసాగాయి. అనంతరం దాడులు ఆపేయాలని ఇరుదేశాలు ఒక అవగాహనకు రావడంతో మే 10న దాడులు ఆగిపోయాయి. ఆ సందర్భాన్ని మునీర్ ప్రస్తావిస్తూ పాక్ సాయుధ దళాలకు దేవుడు సాయం చేశాడన్నారు. 'మేం అదే అనుకుంటున్నాం' అని చెప్పారు. అలాగే, ప్రపంచంలో 57 ఇస్లామిక్ దేశాలు ఉండగా, వాటిలో హరమైన్ షరీఫైన్(మక్కా, మదీనా)కు సంరక్షకులు ఉండే గౌరవాన్ని దేవుడు పాకిస్థాన్‌కు కల్పించాడని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందంటూ అఫ్ఘానిస్థాన్‌పై మండిపడ్డారు. పాకిస్థాన్ పిల్లల రక్తాన్ని అఫ్ఘానిస్థాన్ కళ్లజూస్తోందన్నారు. పాకిస్థాన్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఐ-తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) ఉగ్రవాద సంస్థలో 70 శాతం మంది అఫ్ఘాన్ పౌరులే ఉన్నారని ఆరోపించారు. టీటీపీ తరఫున ఉంటారో, లేక పాకిస్థాన్ తరఫున ఉంటారో అఫ్ఘాన్ ప్రభుత్వం తేల్చుకోవాలన్నారు. ఇస్లామిక్ దేశంలో ప్రభుత్వం తప్ప ఇతరులెవ్వరూ జిహాద్ కోసం ఫత్వా జారీ చేయలేరని పేర్కొన్నారు.

సహచరులే కుట్రదారులు

» బంగ్లాదేశీ హిందువు దీపుదాస్ మూకహత్యలో సంచలన విషయాలు

» ఉద్యోగానికి బలవంతంగా రాజీనామా చేయించిన తోటి ఉద్యోగులు

» ఆపై అల్లరిమూకకు అప్పగింత

» బంగ్లాదేశ్ పోలీసుల వెల్లడి

» దైవదూషణపై ఆధారాలు లేవని స్పష్టీకరణ



దీపుదాస్‌ను చంపి, చెట్టుకు కట్టేసి, నిప్పు పెట్టిన బంగ్లాదేశ్ అల్లరి మూక

న్యూఢిల్లీ, డిసెంబరు 22: బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ అతివాదుల చేతిలో మూక హత్యకు గురైన హిందూ యువకుడు దీపుచంద్రదాస్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడు అసలు దైవ దూషణకు పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని ఆ దేశ అధికారులు తెలిపారు. అంతేకాదు దీపుదాస్ పనిచేసే బట్టల కంపెనీలోని తోటి ఉద్యోగులే అతడి చేత బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించి, అల్లరిమూకకు అతడిని అప్పగించినట్లు బంగ్లాదేశ్ రాపిడ్ యాక్షన్ బెటాలియన్(రాబ్) పోలీసులు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అల్లరి మూకతో కలిసిపోయి దీపుదాస్‌పై వారు కూడా దాడి చేసి కొట్టిచంపారని తెలిపారు. ఈ నెల 16న మైమెన్‌సింగ్ ప్రాంతంలోని భలుకాలో ఇస్లామిక్ అల్లరి మూకలు దీపుదాస్‌ను కొట్టిచంపి, అతడి మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి తగులబెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనుకోకుండా జరిగింది కాదని.. పథకం ప్రకారం చేసినట్లు కనిపిస్తోందని రాబ్-14 కమాండర్ నైముల్ హసన్ పేర్కొన్నారు. '16న సాయంత్రం 4 గంటల సమయంలో ఈ దాడి మొదలైంది. కంపెనీలో పనిచేసే ఫ్లోర్ ఇన్‌చార్జి మొహ్మద్ అలంఘీర్ హొస్సైన్, క్వాలిటీ ఇన్‌చార్జి మొహ్మద్ మిరాజ్ హొస్సైన్ అలోక్, మరికొంత మంది ఉద్యోగులు కలిసి.. దైవదూషణకు పాల్పడ్డారన్న నెపంతో దీపుదాస్ చేత బలవంతంగా రాజీనామా చేయించారు. పోలీసులకు సమాచారం కూడా ఇవ్వకుండా నేరుగా అల్లరిమూకకు అప్పగించారు. అప్పటికే కంపెనీ ముందు వందలమంది గుమికూడారు. ఆగ్రహంతో ఉన్న వారంతా కంపెనీ గేటును ధ్వంసం చేసి లోపలికి వచ్చి దీపును బయటకు లాక్కెళ్లారు. దీపును దారుణంగా కొట్టిచంపి రాత్రి 8.45 గంటల సమయంలో మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి నిప్పు పెట్టారు' అని ఆయన వివరించారు. దీపూ హత్యకు నిరసనగా బంగ్లాదేశ్‌లో సోమవారం మైనారిటీ వర్గాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. కలకత్తాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వద్ద బీజేపీ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మరోవైపు, భారత్‌లోని తన వీసా సర్వీసులను బంగ్లాదేశ్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది.

మరో విద్యార్థి నాయకుడిపై కాల్పులు


విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఆందోళనలు జరుగుతున్న వేళ.. మరో విద్యార్థి, కార్మిక నాయకుడిపై కాల్పులు చోటుచేసుకోవడం మరింత ఉద్రిక్తతలు రాజేసింది. బంగ్లాదేశ్‌కు చెందిన నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ) సీనియర్ నేత మోతాలెబ్ సికదర్ (42)పై సాయుధ దుండగులు కాల్పులు జరిపారు. సోమవారం మధ్యాహ్నం ఖులానా పట్టణంలోని ఆయన ఇంటి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో బుల్లెట్ సికదర్ తల ఎడమ భాగాన్ని తాకగా.. అతనికి తీవ్ర గాయాలయ్యాయి.

బంగ్లాదేశీవా అంటూ మూకదాడి

» కేరళలో యువకుడి మృతి

బంగ్లాదేశీయుడు అన్న అనుమానంతో కొందరు దుండగులు జరిపిన మూకదాడిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దళిత యువకుడు రామ్ నారాయణ్ బఘేల్ ప్రాణాలు కోల్పోయాడు. కేరళలోని పాలక్కాడ్ జిల్లా అట్టప్పల్లంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. 'నువ్వు బంగ్లాదేశీవా' అని భఘేల్‌ను కొందరు తీవ్రంగా కొట్టటం ఆ వీడియోలో కనిపించింది. దెబ్బలకు తాళలేక అతడు కుప్పకూలగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బఘేల్ ప్రాణాలు కోల్పోయాడు.

లోకం తీరు



ఆ అయిదు దేశాలవైపే భారతీయ విద్యార్థుల చూపు

» 13 లక్షల మంది విదేశీ చదువులకు

» అత్యధికులు ఆంధ్రప్రదేశ్ నుంచే

» నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 22: ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు ప్రధానంగా అయిదు దేశాలపై దృష్టి సారించారు. కెనడా, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాలంటే ఇష్టపడుతున్నారు. ఇవి టాప్-5లో ఉన్నాయి. ఉన్నత విద్య అంతర్జాతీయకరణ పేరుతో సోమవారం నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడయింది. 2024లో కెనడాకు 4.27లక్షల మంది, అమెరికాకు 3.37 లక్షల మంది, బ్రిటన్‌కు 1.85 లక్షల మంది, ఆస్ట్రేలియాకు 1.22 లక్షల మంది, జర్మనీకి 42,997 వేల మంది విద్యార్థులు వెళ్లారు. మొత్తంగా 13.35 లక్షల మంది ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లారు. దేశం మొత్తం మీద ఉన్నత విద్య చదివే వారి సంఖ్య 15.5 కోట్లుగా ఉండడం గమనార్హం. భారతీయులు విదేశాలకు వెళ్లడమే కాదు... విదేశాల నుంచి ఇక్కడికి కూడా చదువుల నిమిత్తం వస్తున్నారు. విదేశాల నుంచి ఒక విద్యార్థి వస్తుంటే ఇక్కడ నుంచి 28 మంది విదేశాలకు వెళ్తున్నారు. నేపాల్, అఫ్ఘానిస్థాన్, అమెరికా, బంగ్లాదేశ్, యూఏఈ నుంచి ఇక్కడికి చదువుల నిమిత్తం వస్తున్నారు. ఆయా దేశాల్లోని విదేశీ విద్యార్థుల శాతాలను పరిశీలిస్తే లాత్వియాలో అత్యధికంగా 17.4% మంది, ఐర్లాండ్‌లో 15.3% మంది, జర్మనీలో 10.1% మంది భారతీయులు ఉన్నారు. రాష్ట్రాల వారీ వివరాలను విశ్లేషిస్తే 2020 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఆ ఏడాది ఏపీ నుంచి 35,614 మంది వెళ్లారు. తరువాతి స్థానంలో పంజాబ్ (33,412 మంది) ఉంది. చదువుల కోసం భారతీయ విద్యార్థులు వెచ్చిస్తున్న సొమ్ము కూడా గణనీయంగానే ఉంది.

స్టార్‌లింక్ ఉపగ్రహాలకు రష్యా గండం?

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయి, కక్ష్య నుంచి అకస్మాత్తుగా కిందికి జారిందని వెల్లడించింది. ఆ సమయంలో శాటిలైట్ నుంచి కొన్ని చిన్నచిన్న శకలాలు బయటకు వచ్చాయని.. తక్కువ వేగంతో కదిలే ఆవస్తువులను ట్రాక్ చేయొచ్చని వివరించింది. నియంత్రణ కోల్పోయి గిరగిరా తిరుగుతూ కిందికి జారుతున్న ఆ శాటిలైట్ త్వరలో భూవాతావరణంలోకి దూసుకురానుంది. (అలా వచ్చినప్పుడు.. అవి కింద పడకుండా, భూవాతావరణంలోకి ప్రవేశించగానే కాలిపోయేలా రూపొందించారు). కట్ చేస్తే.. స్టార్‌లింక్ శాటిలైట్లను లక్ష్యంగా చేసుకుని రష్యా ఒక కొత్త ఉపగ్రహ నిరోధక ఆయుధాన్ని తయారుచేస్తోందంటూ నాటో దేశాలకు చెందిన నిఘా వర్గాల నివేదికను ఉటంకిస్తూ 'అసోసియేటెడ్ ప్రెస్' వార్తా సంస్థ తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. నాలుగేళ్లుగా యుద్ధంతో కుదేలవుతున్న ఉక్రెయిన్ ఇంకా ఇంటర్నెట్‌ను, ఇతర కమ్యూనికేషన్ వ్యవస్థలను ఉపయోగించగలుగుతోందంటే దానికి కారణం.. స్టార్‌లింక్ శాటిలైట్లేనని భావిస్తున్నందునే రష్యా ఆ ఉపగ్రహాలను ధ్వంసం చేయడానికి 'జోన్-ఎఫెక్ట్' అనే ఆయుధాన్ని అభివృద్ధి చేస్తోందని అందులో పేర్కొంది. డిసెంబరు 17న స్టార్‌లింక్ శాటిలైట్‌తో సంబంధాలు తెగిపోవడం.. నాలుగైదు రోజుల వ్యవధిలోనే అసోసియేటెడ్ ప్రెస్ వార్త కథనం రావడంతో.. ఆ శాటిలైట్ కక్ష్య నుంచి జారిపోవడం వెనుక రష్యా హస్తం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎలా పనిచేస్తుందంటే..

స్టార్‌లింక్ శాటిలైట్లు పరిభ్రమించే కక్ష్యలోకి.. ఉపగ్రహం/రాకెట్ ద్వారా అత్యధిక సాంద్రత కలిగిన వందలు, వేల పెల్లెట్లను జారవిడవడం ద్వారా దాన్ని 'కిల్ జోన్'గా మారుస్తారు. మిల్లీమీటర్ పరిమాణంలో ఉండే ఈ పెల్లెట్లతో ఒకేసారి వేలాది ఉపగ్రహాలను లక్ష్యంగా చేసుకోవచ్చు (అందుకే దీన్ని 'జోన్ ఎఫెక్ట్'గా వ్యవహరిస్తున్నారు). స్టార్‌లింక్ శాటిలైట్లు కక్ష్యలో గంటకు 27 వేల కిలోమీటర్ల వేగంతో తిరుగుతాయి. అంత వేగంతో తిరిగే శాటిలైట్లను.. ఆ కక్ష్యలో రష్యా వదిలిన వేలాది చిన్న పెల్లెట్ తాకినా ఆ తాకిడికి ఉపగ్రహం ధ్వంసమవుతుంది. అప్పుడు దాని శకలాలు కూడా అదే కక్ష్యలో తిరుగుతూ మిగతా ఉపగ్రహాల ఉనికికి ప్రమాదకరంగా మారుతాయి. వేల సంఖ్యలో పెల్లెట్లను వదలడం వల్ల పెద్ద సంఖ్యలో ఉపగ్రహాలను ఒకేసారి లక్ష్యంగా చేసుకునే వీలుంటుంది. అత్యంత చిన్నగా ఉండే ఆ పెల్లెట్లను గుర్తించడం, వాటిని రష్యానే అక్కడ జారవిడిచిందని నిరూపించడమూ కష్టమేనని కొందరు నిపుణులు పేర్కొంటున్నారు. కాగా.. నాటో దేశాలకు చెందిన నిఘావర్గాల నివేదిక రాకముందు.. సాంకేతిక లోపం కారణంగా తమ ఉపగ్రహాల్లో ఒకదాంతో సంబంధాలు తెగిపోయినట్టు ప్రకటించిన స్టార్ లింక్ సంస్థ.. ఆ నివేదిక వచ్చాక మాత్రం దానిపై ఇంకా స్పందించలేదు.



రష్యా అలా చేయకపోవచ్చు..

రోదసిలో ఆయుధాల మోహరింపును నిలిపివేయడానికి కృషి చేయాలంటూ ఐక్యరాజ్యసమితికి రష్యా గతంలో పిలుపునిచ్చిందని.. అలా రోదసిలో అణ్వాయుధాలను మోహరించే ఉద్దేశమేదీ మాస్కోకి లేదంటూ గతంలోనే పుతిన్ స్పష్టం చేశారని అంతరిక్ష భద్రత నిపుణులు కొందరు గుర్తు చేస్తున్నారు. ఒకవేళ రష్యా స్టార్‌లింక్‌ను లక్ష్యంగా చేసుకున్న మాట నిజమే అనుకున్నా.. జోన్-ఎఫెక్ట్ ఆయుధంతో ఒక్క స్టార్‌లింక్, పశ్చిమ దేశాల శాటిలైట్లకే కాక రష్యన్ ఉపగ్రహాలకూ, దాని మిత్రపక్షమైన చైనా శాటిలైట్లకూ ముప్పేనని వారు గుర్తుచేస్తున్నారు. ఒక్క శాటిలైట్ ధ్వంసమైనా దాన్నుంచి వెలువడే శకలాలు ఆ కక్ష్య మొత్తాన్నీ ప్రమాదకరమైన కిల్‌జోన్‌గా మార్చేసి, మిగతా ఉపగ్రహాలను ధ్వంసం చేసి.. ఆ కక్ష్యను నిరుపయోగంగా మార్చేస్తాయని.. కాబట్టి రష్యా అలాంటి ప్రయత్నం చేయకపోవచ్చని విశ్లేషిస్తున్నారు. స్టార్‌లింక్ ఉపగ్రహాలు భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తుంటాయి. పెల్లెట్ల కారణంగా అవి పెద్ద సంఖ్యలో నియంత్రణ కోల్పోయి కిందకి జారడం మొదలుపెడితే... 400 కిలోమీటర్ల ఎత్తులో ఉండే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్), చైనాకు చెందిన టియాంగోంగ్ స్పేస్ స్టేషన్ వంటివాటి ఉనికి కూడా ప్రమాదంలో పడుతుంది.

ప్రభుత్వ పనులకు తక్కువ ధరకే సిమెంట్!

» జీఎస్టీ తగ్గిన మేరకు ధరల సవరణ

» ఎర్ర సంచుల్లో సరఫరాకు నిర్ణయం

» నిర్మాణ్ పోర్టల్ ద్వారా సేకరణకు మార్గదర్శకాలు జారీ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన పనులకు తక్కువ ధరకే సిమెంట్‌ను సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జీఎస్టీ కౌన్సిల్ సిమెంట్‌పై పన్ను రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో ఆ మేరకు ధరలను సవరించింది. ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆన్‌లైన్ సిమెంట్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్(ఏపీ నిర్మాణ్) ద్వారా సిమెంట్ సేకరణ మార్గదర్శకాలు జారీ చేసింది. 28 శాతం జీఎస్టీతో రూ.260 గా ఉన్న పీపీసీ రకం సిమెంట్ బస్తా ధర రూ.240కు తగ్గింది. ఓపీసీ రకం సిమెంట్ రూ.270 నుంచి రూ.249కు, పీఎస్‌సీ రకం సిమెంట్ రూ.250 నుంచి రూ.231కు తగ్గింది. ఉత్తర తీరప్రాంత జిల్లాల్లో బస్తాకు రూ.10 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పీపీసీ రకం సిమెంట్ బస్తా రూ.250, ఓపీసీ రకం రూ.259, పీఎస్‌సీ రకానికి రూ.241 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ విభాగాలకు తక్కువ ధరకు సరఫరా చేసే సిమెంట్‌ను ఎరుపు రంగు సంచులలో సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైకుంఠ ద్వార దర్శనాల్లో
90 శాతం సామాన్యులకే!

» ఏ ఒక్కరూ అసంతృప్తి చెందకుండా ప్రణాళికలు

» దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

» వైకుంఠ ద్వార దర్శనాలపై తిరుమలలో ముగ్గురు మంత్రుల సబ్ కమిటీ సమీక్ష



టీటీడీ చైర్మన్, అధికారులతో సమావేశమైన మంత్రులు రామనారాయణ రెడ్డి, అనిత, సత్యప్రసాద్

తిరుమల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచనల ప్రకారం తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి మొదలుకానున్న వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై తిరుమలలో సోమవారం ముగ్గురు మంత్రుల సబ్ కమిటీ అధికారులతో సమావేశమైంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ, టీటీడీ సీవీఎస్వో, ఇతర అధికారులు ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 30న ఏకాదశి, 31న ద్వాదశి, జనవరి1 త్రయోదశితో పాటు మిగిలిన ఏడురోజుల్లో ప్రతి ఒక్కరికీ దర్శనం కల్పించేలా ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గతంలో వైకుంఠ ఏకాదశికి కేవలం 16 గంటల దర్శన సమయం మాత్రమే కేటాయిస్తే రానున్న ఏకాదశి దాదాపు 20 గంటలు దర్శనాలకు కేటాయించనున్నారు. అలాగే 31న కూడా 19 గంటల పాటు దర్శనాలు కొనసాగనున్నాయన్నారు. జనవరి 1న కూడా అదే స్థాయిలో దర్శన సమయం ఉంటుందని చెప్పారు. 90 శాతం సమయాన్ని సామాన్య భక్తులకే కేటాయిస్తామని మంత్రి స్పష్టంచేశారు. దర్శనం, అన్నప్రసాదాలు, రవాణా, బస, ప్రసాదాలపై పలు సూచనలు చేశామని తెలిపారు. భక్తులు తిరుపతిలోని సౌకర్యాలను వినియోగించుకుంటూ కేటాయించిన దర్శన సమయానికే తిరుమలకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఏ ఒక్కరూ అసహనంతో అసంతృప్తితో తిరిగి వెళ్లకూడదని యంత్రాంగాన్ని ఆదేశించినట్టు రామనారాయణరెడ్డి వెల్లడించారు.

టెక్నాలజీతో రద్దీ పర్యవేక్షణ

క్యూలైన్‌లోకి ఎంత మంది వచ్చారు, దర్శనానికి పట్టే సమయం, ఎక్కడ రద్దీ అధికంగా ఉంది వంటి వివరాలను పర్యవేక్షించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగిస్తామని మంత్రి తెలిపారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ టెక్నాలజీని కూడా వినియోగిస్తామని చెప్పారు. అనుకోకుండా రద్దీ అధికమైతే అందుకు అనుగుణంగా దర్శనాలు చేయించాలని అధికారులకు సూచించామన్నారు. వీఐపీలు, వీవీఐపీలకు ఎప్పటిలానే ఆంక్షలుంటాయని చెప్పారు. ఈ పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయాన్ని సామాన్యులకు కేటాయించి, మిగిలిన సమయాన్ని మాత్రమే వీఐపీలు, దాతలు, స్థానికులు, ఉద్యోగులకు దర్శన అవకాశం కల్పించామని వివరించారు.

నేటి నుంచి విశాఖలో పెసా మహోత్సవ్

» 10 రాష్ట్రాల నుంచి 1,500 మంది క్రీడాకారులు రాక

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ది పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ (పెసా)-1996 చట్టం వార్షికోత్సవం సందర్భంగా మంగళ, బుధవారాల్లో విశాఖలో 'పెసా మహోత్సవ్' నిర్వహిస్తున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ తెలిపారు. సోమవారం విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజతో కలిసి ఆమె మాట్లాడుతూ పెసా ఉత్సవాలకు పది రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు వస్తున్నారన్నారు. కబడ్డీ, విలువిద్య పోటీలు, గిరిజన సంప్రదాయాలు, సంస్కృతులను ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉత్సవ్‌లో భాగంగా మంగళవారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్‌రోడ్డులో 10కె రన్ జరుగుతుందని, పోర్టు స్టేడియంలో కబడ్డీ ఫైనల్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం పది గంటలకు క్రికెట్ స్టేడియంలో పురుషులు, మహిళలకు విలువిద్య పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పెసా రన్ టీ షర్టులు, టోపీలు ఆవిష్కరించారు.

26న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 26న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభం కానుంది. సీఎం చంద్రబాబు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, పలువురు మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

తెల్లబర్లీ పొగాకుకు కొనుగోలు అగ్రిమెంట్లు తప్పనిసరి

» నల్ల బర్లీ సాగు కట్టడికి చర్యలు: వ్యవసాయ శాఖ

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెల్ల బర్లీ పొగాకు సాగుకు కంపెనీలతో కొనుగోలు అగ్రిమెంట్లు తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ స్పష్టం చేశారు. దీని కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఎలాంటి బాధ్యత వహించదని, జోక్యం చేసుకోదని తెలిపారు. సోమవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో పొగాకు సాగుపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లబర్లీ పొగాకు సాగును నిరోధించాలని, రైతులు తెల్లబర్లీ సాగు చేస్తే.. కంపెనీల నుంచి 100% కొనుగోలు అగ్రిమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై నల్లబర్లీ సాగు చేయబోమని గత సీజన్‌లోనే రైతులు చెప్పినందున అనధికార నల్లబర్లీ సాగును టాస్క్‌ఫోర్స్ బృందాలు కట్టడి చేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ తెల్లబర్లీ పొగాకు సాగు చేసే రైతుల జాబితాను కంపెనీల కొనుగోలు అగ్రిమెంట్లతో జిల్లా వ్యవసాయ అధికారులకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

ఈశాన్య రుతుపవనాలు
బలహీనం

» కొనసాగుతున్న చలి

విశాఖపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు పూర్తిగా బలహీనపడ్డాయి. బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతోంది. వచ్చే ఐదారు రోజుల వరకు రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. కాగా కోస్తా, రాయలసీమల్లో చలి కొనసాగుతోంది. సోమవారం ఉదయం పొగమంచు కురిసింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

అధికారిక జనాభా లెక్కల ఆధారంగానే
ఆర్‌ఈటీ విధించాలి

» అంచనా వేసిన జనాభా ప్రకారం ట్యాక్స్ విధించడానికి వీల్లేదు

» హైకోర్టు కీలక ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్ అండ్ బార్లపై విధించే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఆర్‌ఈటీ) విషయంలో హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అధికారిక జనాభా లెక్కలను పక్కనపెట్టి అంచనా వేసిన జనాభా లెక్క ప్రకారం ఆర్‌ఈటీ విధించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఏపీ ఎక్సైజ్ రూల్స్-2025లోని రూల్ 3(టి) ప్రకారం జనాభా అంటే 'అధికారికంగా ప్రచురించిన జనాభా లెక్క' అని నిర్వచించారని పేర్కొంది. 2011 తరువాత అధికారికంగా జనాభా లెక్కలు జరగలేదని, ఆనాటికి మైదుకూరు మున్సిపాలిటీ జనాభా 45,790 మాత్రమేనని గుర్తు చేసింది. 50 వేలు కంటే తక్కువ జనాభా ఉన్న మున్సిపాలిటీలలో ఆర్‌టీఈ కింద రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేయాలని తేల్చి చెప్పింది. 2011 నుండి మున్సిపాలిటీ పరిధిలో జనాభా 1.9 శాతంగా పెరిగి ప్రస్తుతం 56,310కు చేరిందని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ అంచనా వేశారని, ఆ లెక్కకు ఎలాంటి శాస్త్రీయత లేదని తెలిపింది. కమిషనర్ అంచనా వేసిన జనాభా లెక్క ఆధారంగా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఓ బార్‌కు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఆర్‌ఈటీ)ని రూ.55 లక్షలుగా నిర్ణయిస్తూ కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. తీర్పు అందిన ఆరు వారాల్లోపు పిటిషనర్ అభ్యర్థనను తిరిగి పరిశీలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. నిర్ణీత గడువులోపు అభ్యర్థనను పునఃపరిశీలన చేయకుంటే మున్సిపాలిటీ జనాభా 50 వేలు లోపు ఉన్నట్లు పరిగణించి పిటిషనర్ నుండి రూ.35 లక్షల ఆర్‌ఈటీ వసూలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్ అంచనా వేసిన జనాభా లెక్కల ప్రకారం ఆర్‌ఈటీని రూ.55 లక్షలుగా నిర్ణయిస్తూ కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ లక్ష్మి వెంకటేశ్వర రెస్టారెంట్ అండ్ బార్ యజమాని చిన్నమాదన్నగారి వెంకట సుబ్బయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2011 అధికారిక జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని మాత్రమే ఆర్‌ఈటీని నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తన వ్యాజ్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాజ్యంపై తుది విచారణ జరిపిన న్యాయమూర్తి ఇటీవల నిర్ణయాన్ని వెల్లడించారు.

ఇచ్చంపల్లి నుంచి తరలిస్తే
మహారాష్ట్రకు ముంపు!

» 200 టీఎంసీల గోదావరి నీటిని తెలంగాణ వాడేసుకుంటుంది

» గోదావరి-కావేరి అనుసంధానంపై ఏపీ స్పష్టీకరణ

» ఢిల్లీలో నేడు ఎన్‌డబ్ల్యూడీఏ భేటీ

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను తీసుకెళ్లి కావేరి నదితో అనుసంధానం చేస్తామంటే అంగీకరించేది లేదని కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేయనుంది. దీనివల్ల మహారాష్ట్రకు ముంపు సమస్య ఏర్పడుతుందని.. అలాగే ఈ పథకం ఆధారంగా 200 టీఎంసీల గోదావరి జలాల ను వాడుకోవాలని తెలంగాణ భావిస్తోందని మంగళవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే జాతీయ జలాల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశానికి తెలియజేయనుంది. ఈ భేటీకి కార్యదర్శుల స్థాయి అధికారులు హాజరు కావాలని కేంద్రం స్పష్టం చేయగా.. రాష్ట్రం నుంచి సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర నదీ జలాల విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు తదితరులు హాజరు కానున్నారు. మహానది-కావేరి అనుసంధానంలో భాగంగా తెలంగాణలోని ఇచ్చంపల్లి (తుపాకుల గూడెం) నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనికి తెలంగాణ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. గోదావరి- కావేరి అనుసంధానంలో భాగంగా 200 టీఎంసీలను వాడుకునేలా కార్యాచరణ సిద్ధం చేసింది కూడా. గోదావరి జలాలను నాగార్జున సాగర్ దాకా తీసుకొచ్చి అక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్ భూభాగం నుంచి కావేరికి తరలించాలని తెలంగాణ సూచిస్తోంది. ఇందుకోసం ఛత్తీస్‌గఢ్ ఇప్పటిదాకా వాడుకోని 147 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి-కావేరి అనుసంధానానికి వినియోగించుకోవచ్చని కేంద్ర జలశక్తి శాఖ చెబుతోంది. అయితే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. తమకు కేటాయించిన 147 టీఎంసీలు వాడుకునేందుకు కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని కేంద్రానికి ఇటీవల సమాచారం ఇచ్చింది. కానీ ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేనాటికి పదేళ్లు పడుతుందని.. ఆలోగా అనుసంధాన పథకానికి ఆ 147 టీఎంసీలను వినియోగిస్తామని కేంద్రం అంటోంది. గోదావరిలో తమ వాటాను ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ తిరస్కరిస్తుంటే.. అదే ప్రణాళికను అమలు చేయాల్సిన అవసరం ఏముందని కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రశ్నిస్తోంది. గతలో ధవళేశ్వరం-కావేరి అనుసంధాన పథకానికి కేంద్రమే రూపకల్పన చేయడాన్ని గుర్తుచేస్తోంది. తాము ఇప్పటికే పోలవరం-బనకచర్ల పథకానికి ప్రణాళిక రచించినందున.. దీని ద్వారా గోదావరి-కావేరి అనుసంధానం అమలు చేయాలని మంగళవారం నాటి సమావేశంలో పట్టుబట్టనుంది. ఇచ్చంపల్లి-కావేరి పథకం అమలుకు నీటి నిల్వ చేయాల్సి ఉంటుందని.. అదే జరిగితే మహారాష్ట్రకు బ్యాక్‌వాటర్ సమస్య ఎదురవుతుందని చెబుతోంది.

టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు కుమారుడు, కుమార్తె అరెస్టు

» ఆరేళ్ల క్రితం నాటి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పద మృతి కేసులో సీబీఐ చర్యలు

బెంగళూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి రఘునాథ్ అనుమానాస్పద మృతి కేసులో టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు కుమారుడు శ్రీనివాస్, కుమార్తె కల్పజ, డీఎస్పీ మోహన్‌ను సీబీఐ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. రఘునాథ్.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా భూముల క్రయవిక్రయాలు చేసేవారు. బెంగళూరు వైట్ ఫీల్డ్‌లోని నిందితుల గెస్ట్‌హౌస్‌లో ఆయన 2019 మేలో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించారు. తన భర్తను కిడ్నాప్ చేసి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని రఘునాథ్ భార్య మంజుల బెంగళూరు హెచ్ఏఎల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్‌తో పాటు దామోదర్, రామచంద్రయ్య, ప్రతాప్ అనే వ్యక్తులపై ఆరోపణలు చేశారు. అప్పట్లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. రఘునాథ్‌ది ఆత్మహత్య అన్నట్లు కోర్టుకు బీ-రిపోర్ట్ సమర్పించారు. మంజుల హైకోర్టు విస్తృత ధర్మాసనాన్ని ఆశ్రయించగా రఘునాథ్ మృతిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ప్రస్తుతం డీఎస్పీగా ఉన్న మోహన్‌తోపాటు ఆదికేశవులు నాయుడు కుమారుడు, కుమార్తెను అరెస్టు చేసింది. నిందితులు నకిలీ స్టాంప్ పేపర్లను ఉపయోగించి రఘునాథ్ ఆస్తి రాయించుకున్నారనే ఆరోపణలున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చర్చ-రచ్చ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు దిగ్విజయంగా జరిగాయని. లోక్‌సభ 111శాతం, రాజ్యసభ 121శాతం ఉత్పాదకతతో అద్భుతంగా పనిచేశాయని ఆయా సభల అధిపతులు ప్రకటించారు. డిసెంబరు 1న సమావేశాలు ఆరంభమైనప్పుడు, ఎప్పటిలాగానే ఇవి కూడా విమర్శలు, ప్రతివిమర్శలతో ముగియకూడదని, రాద్ధాంతాలకు దూరంగా, చక్కని చర్చలతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ప్రజాస్వామ్య ప్రియులు ఆశించారు, మీడియా ఉద్బోధించింది. ఈ పందొమ్మిది రోజుల్లో పదిహేను సెషన్స్ జరిగాయని, విపక్షనేతలు సహకరించడంతో ప్రజాస్వామ్యం బలోపేతమైందని సభాధిపతులు అంటున్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత సభకు అధ్యక్షత వహించడం ఇదే తొలిసారి కనుక ఆయన మరింత సంతోషంగా ఉన్నారు. ఉభయ సభలూ అత్యధిక మార్కులు దాటినందుకు మెచ్చవలసిందే కానీ, ఆ చర్చలు అర్థవంతమైనవీ, ఫలప్రదమైనవీ అని ప్రజలు కూడా అనుకోవాలి. రాహుల్ అవమానంతో ప్రారంభించి, గాంధీతో ముగించారని కాంగ్రెస్ ఈ సమావేశాలను నిర్వచించింది.

ఉభయసభలూ ఆఖరులో గంటలతరబడి కూర్చోవడంతో ఇంతటి స్కోరు సాధ్యమైనమాట నిజం. తొలివారంలో అధికార, విపక్షాల మధ్య ఉన్న వ్యతిరేకతలు అనంతరకాలంలో తగ్గి, ఉభయులూ ఇచ్చి పుచ్చుకోవడానికి అంగీకరించినట్టుగా అర్థమవుతుంది. సభాధి పతుల్లోనూ కాఠిన్యం తగ్గింది. గత సమావేశంలో విపక్షం ఎంత పట్టు బట్టినా, బిహార్ 'సర్' మీద చర్చను కాదన్న అధికారపక్షం ఈమారు 'ఎన్నికల సంస్కరణ'ల పేరిట దానిని అనుమతించింది, విపక్షం కూడా సరేనని తాను చెప్పదల్చుకున్నది చెప్పుకుంది. దీనికి ముందే నూట యాభైయేళ్ళ వందేమాతరం చర్చ జరగాలని అధికారపక్షం పట్టుబడితే విపక్షం ఒప్పుకుంది. అధిక సభాసమయాన్ని వెచ్చించిన ఈ రెండు చర్చలూ కూడా ఆయా పార్టీల రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా సాగి, ఎదుటివారిపై నిందలు వేయడానికి మరొకమారు ఉపకరించాయన్నది నిర్వివాదాంశం. వందేమాతరం మీద లోక్‌సభలో 11గంటలు, రాజ్యసభలో 13గంటలు చర్చజరిపి, గతాన్ని తవ్విపోసు కొనే బదులు, ఏకమాటగా ఒక తీర్మానాన్ని చేసివుంటే నూటయాభై యేళ్ళ ఈ ఘట్టం చరిత్రలో చక్కగా నిలిచిపోయేది. ఎన్నికల సంస్కరణల చర్చ కూడా ఆత్మస్తుతి, పరనిందకు పరిమితమై ప్రజాస్వామ్య పటిష్ఠతకు ఉపకరించకుండాపోయింది.

ఈ సమావేశాల్లో ఉభయసభలు ఎనిమిది బిల్లులను ఆమోదించాయి. రెండుదశాబ్దాలుగా గ్రామీణపేదలకు ఉపాధిని ఒక హక్కుగా అందిస్తున్న ఒక చట్టాన్ని తిరగదోడి, దాని స్థానంలో ఏ గ్యారంటీలూ ఇవ్వని ఒక కొత్తచట్టాన్ని తెస్తున్నప్పుడు విస్తృత చర్చకు తావులేక పోవడం ఆశ్చర్యం. కొత్త మార్పుచేర్పులతో రాష్ట్రాల మీద అదనపు ఆర్థిక భారాన్ని రుద్దుతున్న కేంద్రప్రభుత్వం బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపేందుకు కూడా సిద్ధపడలేదు. కోట్లాది గ్రామీణ కుటుంబాల బతుకుతెరువును నిర్దేశించే ఒక కీలకమైన పథకం విషయంలో అంత అమితవేగం ఎందుకో అర్థంకాదు. మరో రెండు బిల్లులను స్టాండింగ్ కమిటీకి పంపిన ప్రభుత్వం జీరామ్‌జీ విషయంలో పట్టుదలగా ఉండటానికి అది కాంగ్రెస్ పథకం కావడం, దానికి గాంధీ పేరు ఉండటం ప్రధాన కారణాలన్న విమర్శలను కాదనలేం. సమావేశాలు ముగుస్తున్న తరుణంలో, లోక్‌సభ ఆమోదించిన కొద్దిగంటల్లోనే రాజ్య సభ దానిని స్వీకరించి అక్కడకూడా చర్చకు అవకాశం ఇవ్వకుండా చేయడం కనిపిస్తూనే ఉంది. అలాగే, అత్యంత కీలకమైన పౌర అణు రంగంలోకి ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే విషయంలోనూ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత కాలపు చట్టాలను తిరగరాసి, ప్రాణనష్టాలు, పరిహారాల విషయంలో సరఫరాదారులకు పలు మినహాయింపులు ప్రసాదిస్తున్న అంశంమీద లోతైన చర్చ లేకపోవడం పెను ప్రమాదం. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని నూరుశాతానికి పెంచే బీమా సవరణ బిల్లు కూడా చర్చలేకుండానే గట్టెక్కేసింది. గత శీతాకాల సమావేశాలు రాష్ట్రాల ఎన్నికలవల్లనో, ఇతరత్రా కారణాల వల్లనో పూర్తిగా కొట్టుకుపోయిన నేపథ్యంలో, ఈ సమావేశాలు కొద్దిగా, కాస్తంత బుద్ధిగా జరిగినందుకు సంతోషించాల్సిందే. గతంతో పోల్చితే ఈ మారు ఘర్షణ తగ్గినందున, సమావేశాల ఆఖరున సభాధి పతుల తేనీటివిందుకు కాంగ్రెస్ ప్రతినిధులు హాజరుకావడం చూడ ముచ్చటగా కూడా ఉంది.

ఆధ్యాత్మికతపై అధర్మ దాడి

శేషాచల కొండలపై ఆసీనుడైన శ్రీనివాసుడు కేవలం ఆధ్యాత్మికతకు మాత్రమే కాక, భారతీయ చరిత్రకూ, సంస్కృతికీ ప్రతీక. తిరుమల ఆలయ చరిత్ర దాదాపు 9వ శతాబ్దం నుంచి లిఖిత రూపం దాల్చింది. పల్లవులు, చోళులు, పాండ్యులు, విజయనగర సామ్రాజ్యం ఈ క్షేత్ర ప్రతిష్ఠను కాపాడారు, వైభవాన్ని విస్తరించారు. తాళ్లపాక అన్నమాచార్యులు వంటి మహాకవులు తమ అమర కీర్తనలు, కావ్యాల ద్వారా స్వామి మహిమను లోకమంతటా ప్రచారం చేశారు. 14వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానులు దండయాత్రల్లో దక్షిణ భారత దేవాలయాలను ధ్వంసం చేస్తున్న సమయంలో కూడా తిరుమలను ఎవరూ తాకలేదు. ఆ కాలంలో శ్రీరంగం శ్రీరంగనాథస్వామి విగ్రహాలను సైతం ఇక్కడే భద్రపరిచారంటే ఆ దివ్య క్షేత్రం ఎంత గొప్పదో అర్థమవుతుంది. బ్రిటిష్ వారి పాలనా కాలంలోనూ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, అభివృద్ధికి సహకరించింది. వేలాది సంవత్సరాలుగా రాజులు, మతాలు, శాసనాలు మారినా తిరుమల మాత్రం దివ్యత్వంతో అజరామరంగా నిలిచింది.

తిరుమల కొండపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదం- లడ్డు. 1715 ఆగస్టు 2న (శ్రావణ శుద్ధ ఏకాదశి శనివారం) మొదలైన ఈ దివ్య ప్రసాద పంపిణీ 310 సంవత్సరాలను పూర్తి చేసుకుంది. పప్పు, నెయ్యి, చక్కెర, ఏలకులు, జీడిపప్పు, కిస్మిస్‌తో శాస్త్రోక్తంగా తయారయ్యే ఈ లడ్డూ, రుచిలో అపూర్వం, సుగంధంలో అమోఘం, పవిత్రతలో అనుపమానం. ఆ అమృత ప్రసాదానికి 2009లో భారతదేశంలోనే తొలి ఆలయ ప్రసాదంగా జియో గ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్, 2014లో ట్రేడ్‌మార్క్, 2017లో ఇండియా పోస్ట్ ప్రత్యేక తపాలా బిళ్ల... ఇలా అరుదైన గౌరవాలు దక్కాయి.



సహస్రాబ్దాల చరిత్ర గల తిరుమల పవిత్రతను వేలాది ఏళ్లుగా అందరూ కాపాడుకున్నారు. కానీ హిందూమత విశ్వాసాలపై నమ్మకం లేని గత ప్రభుత్వం నిర్లక్ష్యం, అవినీతి వల్ల కల్తీ నెయ్యితో ప్రసాదం కలుషితం, పరకామణి కుంభకోణం, స్వామివారి ఆస్తుల దోపిడీ, ఆలయ నిర్వహణలో పలు అక్రమాలు, అవకతవకలు వంటి దారుణ సంఘటనలు టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చాయి. కోటానుకోట్ల హిందూ భక్తులకు తీరని బాధను కలిగించాయి. ఇది కలియుగ వైకుంఠం పవిత్రతపై, భక్తి భావంపై జరిగిన దారుణమైన దాడి, క్షమించలేని నేరం.

కలియుగ బ్రహ్మాండ నాయకుడి దర్శనం తర్వాత భక్తి భావంతో స్వీకరించే పవిత్ర ప్రసాదమే 'తిరుమల లడ్డూ'. అటువంటి లడ్డూలో రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి ఉపయోగించారన్న చేదు సత్యాలు బయటపడ్డాయి. అలాగే ప్రతి ఒక్కరూ తమ కోరిక నెరవేరాలని శ్రీ వేంకటేశ్వరస్వామి హుండీలో కానుకలు, ముడుపులు సమర్పిస్తారు. భక్తుల కోరికలు తీర్చే ఆపద మొక్కుల వాడికి ముడుపులు చెల్లించే భక్తులను పరకామణి దోపిడీ కేసు తీవ్రంగా కలచివేసింది. అలాగే తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి భక్తులు తలనీలాలు సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. వీటి వేలం ద్వారా టీటీడీకి రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. దీనిని కూడా గత ప్రభుత్వ దోపిడీదారులు వదల్లేదు. తలనీలాలను మయన్మార్, థాయ్‌లాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా, అస్సాం రైఫిల్స్ బృందం పట్టుకున్నది.

ఇవేకాక తిరుమలలో అన్యమతస్థుల నియామకాలు, బస్సు టికెట్లపై అన్య మత ప్రచారం, కొండపై అన్యమత గుర్తులు, టీటీడీ వెబ్‌సైట్‌లో అన్యమత బోధనలు, భక్తులకు అశ్లీల వెబ్ లింకులు పంపడం వంటి చర్యలతో స్వామివారి ప్రతిష్ఠను మరింతగా దిగజార్చారు. దర్శనం, వసతి అద్దె, టోల్‌గేట్, ప్రసాదాల ధరలు భారీగా పెంచి సామాన్య భక్తుడికి వెంకన్న దర్శనం దూరం చేశారు. టీటీడీని ఆదాయ మూలంగా మార్చి రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల ప్రచారానికి దుర్వినియోగం చేశారు. ఒకే సామాజికవర్గానికి పాలకమండలిలో ఎక్కువ పదవులు కట్టబెట్టారు. అన్నదానంలో నాణ్యతలేని బియ్యం, కల్తీ పదార్థాలు వాడారు; తరిగొండ వెంగమాంబ సత్రంలో భక్తుల తిరుగుబాటు దేశవ్యాప్త చర్చనీయాంశమైంది. స్వామి నిధులను తిరుపతి మున్సిపాలిటీ పేరుతో దారి మళ్లించి దోచుకున్నారు. వీఐపీ బ్రేక్, సేవా టిక్కెట్ల అమ్మకాలు, దర్శన టిక్కెట్లు, ప్రసాదాల్లో బ్లాక్ మార్కెట్ నడిపి కోట్లు దండుకున్నారు. విశాఖ శారదా పీఠానికి నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు, అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.



భక్తుల కోరిక ఒక్కటే- ఆలయ నిర్వహణలో రాజకీయ ప్రభావం, ధన ప్రాధాన్యం లేకుండా ఉండాలి. ఆలయ చరిత్ర- సంప్రదాయాలకు కట్టుబడి, శాస్త్రోక్త విధానాలను తప్పక పాటించాలి. ఏ వ్యవస్థ నైనా దాని సంప్రదాయాలను గౌరవిస్తూ, సంస్కార వంతంగా నిర్వహించే పాలకులు ఉండాలి.

● అనగాని సత్యప్రసాద్
రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'నరేగా' నడ్డి విరిగినట్టేనా?!

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA)ను రద్దు చేసి, దాని స్థానంలో 'వికసిత్ భారత్–రోజ్‌గార్ & అజీవిక మిషన్ (గ్రామీణ్)' (VB–G RAM G)ను తీసుకురావడంపై దేశవ్యాప్త చర్చ జరుగుతోంది. ఈ మార్పు వల్ల తెలుగు రాష్ట్రాలు ఏమి కోల్పోతాయన్న మూల ప్రశ్నను ఇంకా ఎవరూ తగినంతగా పట్టించుకున్నట్టు లేదు. అసలు విషయానికి వెళ్లే ముందు, నరేగాలోను, కొత్త చట్టంలోను ప్రాథమిక అంశాలను పరిశీలిద్దాం.

నరేగా చట్టం 'పని హక్కు' అనే విప్లవాత్మక సూత్రంపై నిర్మితమైంది. దీన్ని అనుసరించి– ఏ గ్రామీణ కుటుంబమైనా పనిని డిమాండ్ చేయగలదు; నిర్ణీత గడువులోపు పని కల్పించాల్సిన చట్టబద్ధ బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి, సకాలంలో వేతన చెల్లింపులు, బాధ్యతలు ఉల్లంఘించినప్పుడు చట్టపరమైన పరిష్కారాలు... ఇవన్నీ నరేగా మూల ఆధారాలు.

అయితే, 2005 నుంచి అమల్లో ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు 'VB–G RAM G'ని తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టంలోని కీలకాంశాలను పరిశీలిస్తే– 1) కేంద్రం ఉపాధిని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతామని చెబుతోంది. చట్టంలో 'హామీ' అనే పదం 92సార్లు ఉన్నా, నరేగా మాదిరి చట్టపరమైన హక్కుగా ఉపాధి లభించే హామీ మాత్రం లేదు. ఉపాధి ప్రాప్తి కార్మికుల డిమాండ్‌పై కాకుండా పరిపాలనా నిర్ణయాలపై ఆధారపడుతుంది. హామీ హక్కుగా లేకపోతే, పని కల్పించడమో నిలిపివేయడమో అధికార యంత్రాంగ విచక్షణపై ఆధారపడే ప్రమాదం పెరుగుతుంది. 2) నరేగా లాగా దేశమంతటా సార్వత్రిక అమలు అనే హామీ ఈ కొత్త చట్టంలో లేదు. కార్యక్రమం ఎక్కడ అమలవుతుందో కేంద్రం నోటిఫై చేస్తుంది. అంటే తెలుగు రాష్ట్రాల్లో ఇది కొన్ని జిల్లాలు/ మండలాలు/ ప్రాంతాలకు పరిమితం అయ్యే అవకాశం ఉంది. 3) ఈ కొత్త చట్టం ప్రకారం క్షేత్రస్థాయిలో డిమాండ్ ఎంత ఉన్నా, కేటాయించిన బడ్జెట్ అయిపోతే అదనపు డిమాండ్‌కు స్పందించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉండదు. 4) సాంకేతికత పరిపాలనకు సహాయక సాధనంగా కాకుండా, పని–వేతనాలకు ముందస్తు షరతుగా చట్టంలోనే నిక్షిప్తమవుతుంది. 5) 'వ్యవసాయ పీక్ సీజన్' పేరుతో ఉపాధిని నిలిపివేయడం/తాత్కాలిక విరామం అనే భావనను చట్టం తెస్తోంది (అమలులో ఇది 60 రోజుల విరామంగా మారే అవకాశం ఉందన్న ఆందోళన ఉంది). 6) నిధుల భాగస్వామ్యంలో రాష్ట్రాలపై భారం పెరుగుతుంది. నరేగాలోని 90:10 నిష్పత్తి నుంచి 60:40కి మారడం రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని గణనీయంగా పెంచుతుంది.

ఈ మార్పులన్నీ కలిపి చూస్తే, పనిని హక్కుగా డిమాండ్ చేసే ఉపాధి హామీ వ్యవస్థ ఇక మీదట ఒక పాలనాపరమైన కేటాయింపుల వ్యవస్థగా మారుతుంది. వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై దీని ప్రభావం మరింత తీవ్రంగా పడనున్నది.

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సుమారు ప్రతి పది మందిలో ఆరుగురు వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై జీవనోపాధి కోసం ఆధారపడుతున్నారు. అందువల్ల గ్రామీణ ఉపాధి హామీ ఈ రాష్ట్రాల్లో ఆర్థికంగా చాలా ముఖ్యమైన వ్యవస్థ. వ్యవసాయ ఆఫ్–సీజన్‌లో వ్యవసాయ కార్మికులే ఉపాధి హామీ కార్మికులుగా మారడం ఇక్కడ సాధారణం.

వాతావరణ వైవిధ్యం, యాంత్రీకరణ, అసమాన నీటి పారుదల వంటి కారణాలతో వ్యవసాయ ఉపాధి మరింత అనిశ్చితంగా మారుతోంది. మరోవైపు వ్యవసాయేతర ఉపాధి ఇంకా బలంగా నిలబడలేదు. ఈ పరిస్థితుల్లో నరేగా కేవలం సంక్షేమ పథకం కాదు; ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపే మూలస్తంభం.

2024–25 లెక్కల ప్రకారం, నరేగా కింద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు 1.1 కోట్ల మంది కార్మికులు నమోదు కాగా, తెలంగాణలో కోటి మందికి పైగా నమోదయ్యారు. ఈ రెండు రాష్ట్రాల్లో మొత్తం పని–దినాల్లో 60శాతం కంటే ఎక్కువ మహిళలవే. ఇంటి బాధ్యతలు చూసుకుంటూనే స్థానికంగా ఆదాయం పొందేందుకు మహిళలకు నరేగా కీలక అవకాశం ఇచ్చింది. అలాగే తెలుగు రాష్ట్రాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనాభా వాటాతో పోలిస్తే ఉపాధి హామీలో అధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. 2024–25లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1.23 లక్షల మంది వికలాంగులు నరేగా ద్వారా ఉపాధి పొందారు. గత ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో వేతనాల రూపంలో సుమారు రూ.41,000 కోట్లు కార్మికులకు చేరాయి. మెటీరియల్ పనులు సుమారు రూ.25,000 కోట్లు విలువైనవిగా కొనసాగాయి. రోడ్లు, సచివాలయ భవనాలు వంటి నిర్మాణాలకు దోహదపడ్డాయి.

ఇప్పుడు ప్రభుత్వం వైపు నుంచి హామీ లేని, కేటాయింపు మీద ఆధారపడిన కొత్త చట్టం రావడం వల్ల స్పష్టమైన పరిణామాలు ఉంటాయి: 1) కార్మికుల ఆదాయ నిశ్చయత తగ్గుతుంది. మహిళలకు స్థానికంగా అనువైన ఉపాధి తగ్గుతుంది; ఆదివాసీలకు వేసవిలో ప్రధాన జీవనోపాధి బలహీనమవుతుంది; ఎస్సీ/ఎస్టీ కార్మికుల కొనుగోలు శక్తి తగ్గుతుంది; వృద్ధులు, వికలాంగులకు అందుబాటులో ఉన్న పని అవకాశాలు మరింత తగ్గే ప్రమాదం ఉంది. చట్టపరమైన హామీ లేకపోతే, ఉపాధి 'హక్కు' నుంచి ప్రభుత్వం యొక్క 'విచక్షణ'గా మారుతుంది. 2) గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోతుంది. నరేగా వేతనాలు నేరుగా గ్రామీణ మార్కెట్లలోకి ప్రవహించి వినియోగాన్ని నిలబెట్టాయి. కోవిడ్ వంటి షాక్‌ల సమయంలో అవే పెద్ద మద్దతయ్యాయి. ఇదిలేకపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పెళుసుగా మారుతుంది. 3) రెండు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 30,000 మంది సిబ్బంది (ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్, టెక్నికల్ సిబ్బంది, MIS సిబ్బంది) నరేగాతో అనుసంధానమై ఉన్నారు. కార్మికులకు పనులు/వేతనాలు సక్రమంగా అందేందుకు వీరే సంస్థాగత వెన్నెముక. కొత్త చట్టం వీరి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతుంది.

> జాతీయ నరేగా బడ్జెట్‌లో దాదాపు 15 శాతం తెలుగు రాష్ట్రాల్లోనే ఖర్చవుతోంది. 2024–25లో తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి హామీ కోసం సుమారు రూ.12,500 కోట్లు ఖర్చయ్యాయి; ఇందులో రాష్ట్రాల వాటా రూ.1,200 కోట్లు మాత్రమే. కొత్త చట్టం ప్రకారం ఉపాధి 2024–25 స్థాయిలోనే కొనసాగితే, రాష్ట్రాల వాటా సుమారు రూ.3,750 కోట్లకు పెరుగుతుంది.



కొత్త చట్టం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని దిగజారుతున్న ఆర్థిక పరిస్థితిపై అదనపు ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉంది. రెండు రాష్ట్రాలు ఇప్పటికే రుణ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 60:40 వ్యయ–భాగస్వామ్య నియమం రాష్ట్రాలపై భారీ భారం పెడుతుంది.

జాతీయ నరేగా బడ్జెట్‌లో దాదాపు 15 శాతం తెలుగు రాష్ట్రాల్లోనే ఖర్చవుతోంది. 2024–25లో తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి హామీ కోసం సుమారు రూ.12,500 కోట్లు ఖర్చయ్యాయి; ఇందులో రాష్ట్రాల వాటా కేవలం రూ.1,200 కోట్లు మాత్రమే. కొత్త చట్టం ప్రకారం ఉపాధి 2024–25 స్థాయిలోనే కొనసాగితే, రాష్ట్రాల వాటా సుమారు రూ.3,750 కోట్లకు పెరుగుతుంది.

అలానే కవరేజ్, స్కేల్, ఉపాధి వ్యవధి వంటి కీలక అంశాలపై రాష్ట్రాలకు ఎలాంటి స్వాతంత్ర్యం లేదు. కానీ వాటిపై అదనపు భారం మోపడం అన్యాయం. నరేగా లాగా గ్రామీణ డిమాండ్‌ను బలోపేతం చేసే ప్రత్యక్ష వేతన ప్రవాహం ఈ చట్రంలో సమానంగా ఉంటుందన్న హామీ లేదు. కాబట్టి, 60:40 వ్యయ–భాగస్వామ్యంతో 'హామీ'ని బలహీనపరచడం ఆర్థిక ఒత్తిడిని తగ్గించదు, మరింత తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది.

ఈ ప్రమాదకర పరిస్థితుల్లో మౌనానికి అవకాశం లేదు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ రాజకీయాలకు అతీతంగా చేయి చేయి కలిపి కార్మిక సంఘాలు, పౌర సమాజ సంస్థలు, అలాగే నరేగా తొలి దశలో ముసాయిదా/ అమలులో కీలక పాత్ర పోషించిన మాజీ అధికారులు, నిర్వాహకులను భాగస్వాములుగా నిర్మాణాత్మక సంప్రదింపులను ఏర్పాటు చేయాలి. వారి సలహాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలి. కొత్త చట్టంలో పని హక్కుకు వ్యతిరేకంగా ఉన్న అంశాల తొలగింపునకు ఒత్తిడి తేవడం కొనసాగిస్తూనే, తెలుగు రాష్ట్రాల అనుభవాన్ని నమోదు చేయడం, రాష్ట్ర–నిర్దిష్ట నష్టాలను అంచనా వేయడం, కేంద్రం ముందు ఆధారాలతో కూడిన సిఫార్సులను ఉంచడం ఈ ప్రక్రియ లక్ష్యం కావాలి.

'వికసిత్ భారత్–రోజ్‌గార్ మరియు అజీవిక మిషన్ (గ్రామీణ్)' చట్టం ఎలాంటి మినహాయింపులు లేకుండా రెండు రాష్ట్రాలలో పూర్తిగా అమలు జరిగేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలి.


వ్యవసాయంపై ఆధారపడిన తెలుగు రాష్ట్రాలకు ఇది కేవలం విధానపరమైన ప్రాధాన్యం కాదు. ఇది జీవనోపాధిని, కార్మిక మార్కెట్లను, అలాగే కష్టపడి నిర్మించిన పాలనా నిర్మాణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత. ఎందుకంటే ఉపాధి హామీ ఒక సంక్షేమ పథకం కాదు. గ్రామీణ భారతదేశంలో సామాజిక న్యాయాన్ని చట్టబద్ధంగా అమలు చేసిన అరుదైన హామీ అది.

■ చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు
లిబ్‌టెక్ ఇండియా

భారత రైతు బాంధవుడు

వ్యవసాయ రంగంలో సంస్కరణలు తీసుకువచ్చిన భారత రైతు బాంధవుడు చౌదరి చరణ్‌సింగ్. ఆయన పుట్టినరోజు డిసెంబర్ 23ని 'జాతీయ రైతు దినోత్సవం'గా జరుపుకుంటారు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయనకు అన్నదాత కష్టాలు తెలుసు. దేశ స్వాతంత్ర్య పోరాటమైనా, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమమైనా రెండింటిలోనూ ముఖ్యపాత్ర పోషించారు చరణ్‌సింగ్. 1902 డిసెంబరు 23న హాపూర్‌లో జన్మించిన చౌదరి చరణ్‌సింగ్, ఆగ్రా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి, 1928లో ఘజియాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.

చౌదరి చరణ్‌సింగ్‌ను 'రైతుల ఆత్మబంధువు' అని పిలుస్తారు. ఆయన 1937లో యూపీలోని ఛప్రౌలీ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1946, 1952, 1962, 1967లలో కూడా ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. గోవింద్‌వల్లభ్ పంత్ ప్రభుత్వంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. రెవెన్యూ, న్యాయ, ఆరోగ్య మంత్రిత్వ శాఖలను కూడా నిర్వహించారు. డాక్టర్ సంపూర్ణానంద్, చంద్రభాను గుప్తాల ప్రభుత్వాల్లోనూ ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను నిర్వహించారు.



1952– ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ మంత్రిగా చరణ్‌సింగ్ రైతులకు నిజమైన నేస్తంగా అవతరించిన సంవత్సరం. మంత్రి పదవితో పాటు ఆ ఏడాది అసెంబ్లీలో జమీందారీ నిర్మూలన చట్టాన్ని ఆమోదించారు. ఈ చట్టం వచ్చిన తర్వాత భూస్వాముల నుంచి ఎక్కువ భూమిని తీసుకుని వాటిలో పనిచేస్తున్న నిజమైన రైతులకు ఇచ్చారు. అప్పటి వరకు భూస్వాముల వద్ద కూలి పనులు చేసిన రైతులే అనంతరం ఆ భూమికి యజమానులయ్యారు. ఆయన చేపట్టిన భూసంస్కరణలతో చిన్న రైతులు ఎంతగానో లబ్ధి పొందారు. రైతుల సామాజిక, ఆర్థిక ప్రగతికి ఈ సంస్కరణలు దోహదపడ్డాయి. 1966, 1967లో ఉత్తరప్రదేశ్‌లో కరువు తాండవించినప్పుడు రైతుల నుంచి అధిక ధరలకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి, వారికి లబ్ధి చేకూర్చారు. చరణ్‌సింగ్ ప్రారంభించిన చర్యల వల్లనే పంటలకు కనీస మద్దతు ధర విధానం ప్రారంభమైంది.

జవహర్‌లాల్ నెహ్రూతో విభేదాల కారణంగా చౌదరి చరణ్‌సింగ్ కాంగ్రెస్‌ను వీడారు. ఆ తర్వాత భారతీయ క్రాంతిదళ్‌ని స్థాపించి రాజ్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా సహాయంతో ఏప్రిల్ 3, 1967న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. మరుసటి సంవత్సరం ఏప్రిల్ 17న రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలలో 1970 ఫిబ్రవరి 17న మళ్లీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. 1977లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వంలో చౌదరి చరణ్‌సింగ్ ఉపప్రధాని, హోంమంత్రిగా పనిచేశారు. జనతా పార్టీలో విభేదాల కారణంగా మొరార్జీ ప్రభుత్వం పడిపోయింది. తర్వాత చౌదరి చరణ్‌సింగ్ కాంగ్రెస్ (యు) మద్దతుతో ప్రధానమంత్రి అయ్యారు. కేవలం 23 రోజులు మాత్రమే కొనసాగిన ఆయన 1979 ఆగస్టు 21న రాజీనామా చేశారు. రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి, ప్రవేశపెట్టిన వ్యవసాయ సంస్కరణలకు గుర్తింపుగా చరణ్‌సింగ్ పుట్టిన రోజును 2001 నుంచి జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించారు.

– జటావత్ హనుము

(నేడు జాతీయ రైతు దినోత్సవం)

ఊహాజనిత భయాలు! ద్వంద్వ ప్రమాణాలు!!

విశాఖపట్నంలో గూగుల్ నిర్మించతలపెట్టిన డేటా హబ్ గురించి అక్టోబర్ 30న ప్రచురితమైన నా వ్యాసంపై నవంబర్ 19 సంచికలో గుత్తా రోహిత్ విమర్శ రాశారు. తదనంతరం డిసెంబరు 2, 16వ తేదీ సంచికల్లోనూ చర్చ కొనసాగింది. 'చైనాలో వేల సంఖ్యలో డేటా సెంటర్లు ఏమీ లేవు. అక్కడ సాధారణ డేటా సెంటర్లు 449, ఏఐ డేటా సెంటర్లు వంద దాకా ఉన్నాయి. అమెరికాలో ఏఐ డేటా సెంటర్లు పదుల సంఖ్యలోనే (20–30మధ్యలో) ఉన్నాయి' అంటున్నారు గుత్తారోహిత్ తన వ్యాసంలో. ఇంతకంటే అవాస్తవాలు ఏమైనా ఉంటాయా?

55 వేల మెగావాట్ల డేటా సామర్థ్యంతో అమెరికాలో డేటా సెంటర్లున్నాయి. చైనా తమ దేశంలోని ప్రైవేటు కంపెనీలకు లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు, రాయితీలు ఇచ్చి మరీ 35 వేల మెగావాట్ల డేటా సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. ఏఐ ఆధారిత డేటా సెంటర్ల సాంకేతికతలో, విస్తృతిలో ప్రపంచంలో అగ్రస్థానం కోసం నువ్వా, నేనా అన్నట్టుగా ఈ దేశాలు పోటీ పడుతున్నాయి. అయినా వీటిని తక్కువగా చూపించి విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏదో ఉపద్రవం సంభవిస్తుందనే భావన కలుగజేయటానికి ఎందుకు ప్రయత్నం చేస్తున్నారో తెలియదు.

ఏఐ ఆధారిత డేటా సెంటర్లతో సహా, డేటా సెంటర్లన్నీ ఒక దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగమే. ఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పునాదిపైనే ఆధునిక ప్రపంచం అనుసంధానమవుతుంది. అది హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, నెట్‌వర్క్ సేవల కలయిక. ఈ కలయిక డేటా ప్రవాహం కొనసాగేలా, ఆర్థిక కార్యకలాపాలు బలోపేతమయ్యేలా, డిజిటల్ సేవలు వేగంగా అందేలా చూస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ భద్రత కూడా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగమే. ఈ సమాహారంలోని ప్రతి విభాగంపై స్వావలంబన ఉంటేనే ఏ దేశమైనా ప్రగతిపథంలో పురోగమిస్తుంది. ఈ ప్రాథమిక విషయం తెలియకపోతే చర్చ 'ఒక ఏనుగును ఆరుగురు అంధులు వర్ణించిన తీరు'గా సాగుతుంది.

ప్రపంచంలో పది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో నాలుగో స్థానంలో ఉన్న భారతదేశం... అమెరికా, చైనాల తర్వాత మూడో అతిపెద్ద డిజిటలైజ్డ్ దేశంగా ఉంది. అంతేకాకుండా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీలో భారతదేశం కూడా ఉందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ తాజా నివేదిక తెలిపింది. ప్రపంచస్థాయి ఏఐ దేశంగా ఆవిర్భవించటానికి కావలసిన పెట్టుబడుల అవసరాన్ని గుర్తు చేస్తూ, ఏఐ పరిశోధనలో భారతదేశం 11వ స్థానంలో, మౌలిక సదుపాయాలలో 16వ స్థానంలో ఉందని 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ డిజిటల్ ఎకానమీ–2025' అనే విషయంపైన ప్రాసెస్ సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ డిజిటల్ ఎకానమీ తయారు చేసిన నివేదిక వెల్లడించింది.

డేటా సెంటర్ల సామర్థ్యం విషయానికే పరిమితమై చూసినప్పుడు– ప్రపంచ డేటాలో 20శాతం ఉత్పత్తి చేస్తున్న భారతదేశం ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో కేవలం 3శాతం వాటాను మాత్రమే కలిగివుంది. ఒక అంచనా ప్రకారం భారతదేశంలో డేటా సెంటర్ల సంఖ్య 277, సామర్థ్యం 1500 మెగావాట్లకు అటుఇటుగా ఉంది. భారతదేశ డేటా సెంటర్ మార్కెట్‌లో ముంబై తిరుగులేని ఆధిపత్యాన్ని కలిగివుంది. దేశంలోని మొత్తం డేటా సెంటర్ సామర్థ్యంలో 52 శాతం ముంబైలో ఉంది. ఆ తరువాత 21 శాతంతో చెన్నై రెండవ స్థానంలో ఉంది. భారత దేశ సిలికాన్ వ్యాలీ అని పిలిచే బెంగళూరు, హైదరాబాద్ వంటి టెక్ హబ్‌లు ఒక్కొక్కటీ 7 శాతం వాటాను కలిగివున్నాయి. ఢిల్లీ కేవలం తొమ్మిది శాతం మాత్రమే కలిగివుండగా, పూణే, కోల్‌కతా వరుసగా ఏడు శాతం, ఆరు శాతం వాటాను కలిగివున్నాయి.

> ఏఐ ఆధారిత డేటా సెంటర్ల సాంకేతికతలో, విస్తృతిలో ప్రపంచంలో అగ్రస్థానం కోసం అమెరికా, చైనా పోటీపడుతున్నాయి. అయినా, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏదో ఉపద్రవం సంభవిస్తుందనే భావన కలుగజేయటానికి ఎందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారో తెలియదు. గుండెలు బాదుకోవటం వెనుక సాంకేతిక కారణాలు కాకుండా మరేవో ఉద్దేశాలు ఉన్నాయి.



ఆసియాలో అతిపెద్ద రేటింగ్–4 డేటా సెంటర్ కంపెనీ అయిన CtrlS తన డేటా సెంటర్స్‌ను హైదరాబాద్ సమీపంలోని చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లోని 40 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నది. 600 మెగావాట్లకు పైగా ఐటీ లోడ్‌కు ఇది మద్దతు ఇస్తుంది. హైపర్‌స్కేల్, ఎంటర్‌ప్రైజ్ డేటా అవసరాలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుంది. CtrlS డేటా సెంటర్ అధిక–సాంద్రత, అల్ట్రా–హై–డెన్సిటీ వర్క్‌లోడ్‌లను నిర్వహించడానికి రూపొందిన ఏఐ–రెడీ, ఇంటర్ కనెక్టెడ్ భవనాలను కలిగి ఉంటుంది. ఇదే కాకుండా అదానీ డేటా సెంటర్ కూడా ఇక్కడ వస్తోంది. అయినా హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ తరహాలో విద్యుత్ కొరత, నీటి ఎద్దడి వస్తుందనే విమర్శ మచ్చుకు కూడా కనపడదు. ఇదిలా ఉండగా దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం 2030 కల్లా తొమ్మిది గిగావాట్లకి పెంచడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

ఐటీ పరిశ్రమల స్థాపనలో అగ్రస్థానంలో ఉన్న కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలు గూగుల్ డేటా సెంటర్ తమ రాష్ట్రాలకు రానందుకు కారాలు మిరియాలు నూరుతున్నాయి. అయినా ఇప్పటివరకు ఎటువంటి ఐటీ పరిశ్రమా లేని ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ డేటా సెంటర్ స్థాపనపై కొందరు కత్తులు దూస్తున్నారు. రాష్ట్రంలో 13,488 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. మరెన్నో ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యంలో సగానికి మించివున్న మహారాష్ట్ర ఉత్పత్తి చేస్తున్న పునరుత్పాదక విద్యుత్తు (13,600 మెగావాట్లు)కు ఇది దాదాపు సమానం. అంతేకాకుండా మహారాష్ట్ర నేటి ఆంధ్రప్రదేశ్ కంటే జనాభాలో దాదాపు రెండున్నర రెట్లు, విస్తీర్ణంలో రెండు రెట్లు పెద్దది. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో వస్తున్న డేటా సెంటర్లతో విద్యుత్తు సంక్షోభం వస్తుందని భయాందోళనలు రేకెత్తించటంలో అర్థం లేదు.

అలాగే నీటి వినియోగంపై కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదు. దేశంలో 73 శాతం దాకా డేటా సెంటర్లు ఉన్న ముంబయి, చెన్నై నగరాలు నీటి కొరతతో ఉన్నాయి. డేటా సెంటర్లకు నీటి అవసరాలు గణనీయంగా ఉంటాయనేది నిజమే. కానీ నీటి వినియోగాన్ని, తద్వారా విద్యుత్తు వినియోగాన్ని తగ్గించే సాంకేతికతలైన లిక్విడ్ కూలింగ్ పద్ధతితో పాటు, వాడిన నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు. అలాగే సముద్రపు నీటిని నిర్లవణీకరణ (డీశాలినేషన్) చేసి వినియోగించటం, సముద్రపు లోతుల్లోని నీటిని (ఇది సముద్రపు పై భాగంలో ఉండే నీటికి భిన్నంగా కలుషితం కాకుండా ఉంటుంది) శుద్ధి చేసి వాడటం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కారణాల చేతనే ఈ నగరాలలో డేటా సెంటర్ల కారణంగా నీటి కొరత ఏర్పడలేదు.

నీరు, విద్యుత్తు లభ్యతలకు సంబంధించి విశాఖపట్నం ఏ విధంగా చూసినా ముంబయి, చెన్నైల కంటే మెరుగైన నగరం. అయినా ఏదో ప్రళయం సంభవిస్తున్నట్టు గుండెలు బాదుకోవటం వెనుక సాంకేతిక కారణాలు కాకుండా మరేవో ఉద్దేశ్యాలు ఉన్నాయి. ఊహాజనిత భయాలను సృష్టించటం, విశ్లేషణలో ద్వంద్వ ప్రమాణాలు పాటించటం ఏ లక్ష్యాల కోసమో తెలుసుకుని, వాటి వెనుకవున్న దురుద్దేశపూరిత రాజకీయాలను నిర్వీర్యం చేయకపోతే ఆంధ్రప్రదేశ్ భవిత అగమ్యగోచరం అవుతుంది.

◆ నెల్లూరు నరసింహారావు (సీనియర్ జర్నలిస్ట్)



క్షురకుల నియామక వివాదంతో
జంట హత్యలు
8 లో
● అత్త, మామపై దాడి చేశారని సోదరుల నరికివేత
● ఇరుపక్షాలు బంధువులే.. గ్రామంలో విషాదఛాయలు



సోలార్ కష్టాలకు చెల్లు

● మిగులు విద్యుత్ ఇచ్చేవారికి ప్రభుత్వం ఊరట
● ఏ నెలకానెల బిల్లుల చెల్లింపులు
● మూడు జిల్లాల్లో వేలమందికి స్వల్ప ప్రయోజనం
● చార్జీల మోత కూడా తగ్గించాలని విన్నపాలు

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న వినియోగదారుల కష్టాలు తొలగించడానికి ప్రభుత్వం స్వీకారం చుట్టింది. ఏపీజెన్‌కోకి సరఫరా చేసిన మిగులు విద్యుత్‌కు ఇక నుంచి ప్రతి నెలా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం ద్వారా భారీ రాయితీలు ఇస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తోందే తప్ప.. వారికి మిగులు విద్యుత్ చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తోంది. ఈ కారణంగా జిల్లాలో భారీగా పీఎం సూర్యఘర్‌కు రిజిస్ట్రేషన్లు జరిగినా.. ప్లాంట్ల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. బ్యాంకుల ద్వారా నామమాత్రపు వడ్డీకే రూ.2లక్షల వరకు రుణాలు ఇచ్చినా, 3 కిలోవాట్ల సోలార్ ప్లాంటుకు రూ.78వేలు, 2 కిలోవాట్ల ప్లాంటుకు రూ.60వేలు రాయితీ ఇచ్చినా వినియోగదారుల నుంచి స్పందన ఉండడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ పెట్టి పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు చేసినా అవి కార్యరూపం దాల్చలేదని కింది గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 80వేల దరఖాస్తులు రాగా.. 8 వేలు కూడా ప్లాంట్ల ఏర్పాటు దశకు (మిగతా 8లో)

ఇప్పటికీ చెల్లించని పాత బకాయిలు

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ చాలా మందికి మిగులు విద్యుత్ పాత బకాయిలు విద్యుత్ శాఖ చెల్లించలేదు. పాత విధానం ప్రకారం ప్రతి ఆరు నెలలకు నెట్ యూనిట్లను మదింపు చేసి, మిగులు యూనిట్లు ఉంటే చార్జీలు చెల్లిస్తారు. కానీ, ఇలా ఇచ్చిన సందర్భాలు అత్యంత అరుదు. కిందటేడాది ప్లాంటు ఏర్పాటు చేసుకున్న వారికి కూడా ఇప్పటికీ చెల్లించలేదు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు చెల్లింపులు జరగలేదు. జూలై నుంచి నవంబరు వరకూ సరఫరా చేసిన మిగులు విద్యుత్ మదింపు జరగలేదు.

మమ

● నలుగురి అరెస్టు.. 20 కార్లు స్వాధీనం
● పోలీసు అధికారులు కార్లు తీసుకున్నట్లుగా వెల్లడి
● కొనుగోలు చేసిన వారిపై చర్యలేవీ?



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లతో ఎస్పీ బీ కృష్ణారావు, డీఎస్పీ హనుమంతరావు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారకులైన ముఠా పోలీసులకు పట్టుబడింది. చోర్ గ్యాంగ్ అక్రమాలు పోలీసు విచారణలో వెల్లడయ్యాయి. ముఠా నుంచి 20 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు సోమవారం వెల్లడించారు. ముఠాలో మొత్తం తొమ్మిది సభ్యులు ఉన్నారు. వీరిలో కార్ల కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పుల్లంశెట్టి భానుప్రకాష్ (నరసింగపాడు), పుల్లంశెట్టి ఆంజనేయులు (నరసింగపాడు), షేక్ మహ్మద్ రఫీ(గురజాల), మధ్యాహ్నపు మోహన సత్య శ్రీనివాస్(బాసుపల్లి, హైదరాబాద్) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. తీగ లాగితే డొంక కదలినట్టుగా చిలకలూరిపేట బైపాస్ రోడ్డు జరిగిన ప్రమాదంలో గ్యాంగ్ నేరాలు వెలుగుచూశాయి. రోడ్డు ప్రమాద ఘటనా స్థలంలో ముందున్న వాహనం నంబరు ప్లేటును పోలీసులు పరిశీలించారు. దాని నంబరు ప్లేటు అక్కడ గుర్తించిన కారు మ్యాచ్ కాకపోవడంతో.. విచారిస్తే కార్ల ఉందంతం వెలుగుచూసింది.

ఈ నెల 12న శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఆరెస్టయిన ఆంజనేయులుకు మారుతి స్విఫ్ట్ కారును రూ.1.50 లక్షలకు తాకట్టు పెట్టాడు. తన కారు తిరిగి ఇవ్వకపోవడంతో అయన నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారించారు. ఆంజనేయులు అధిక వడ్డీ విధించి ఇచ్చిన డబ్బు సరిపోదని తాకట్టు పెట్టిన వాహనం తిరిగి ఇవ్వనని శ్రీనివాసరెడ్డిని బెదిరించాడు. ఈ నేరంలో మరికొందరు పాల్గొన్నట్టుగా వెల్లడైంది. ఈ కేసులో (మిగతా 8లో)

కొన్నవారిపై చర్యలేవీ?

ముఠా నుంచి 20 కార్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ కృష్ణారావు ప్రకటించారు. భాను ప్రకాష్‌కు చెందిన కొండమోడు గెస్ట్‌హౌస్‌లో 10 కార్లు, ఆంజనేయులు వెల్లడించిన సమాచారం మేరకు పాలపాడు రోడ్డులోని వెంచర్ వద్ద ముద్దాయిలందరూ కలచి దాచిన ఏడు కార్లను స్వాధీన పరచుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి రెండు నంబరు ప్లేట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే వెంకటనాయుడు తండ్రి ఏఎస్ఐ శ్రీనివాసరావును ఎందుకు సస్పెండ్ చేశారో వెల్లడించకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ఏఎస్ఐ పాత్రపై ఎటువంటి ఆధారాలు లేవని ఎస్పీ వెల్లడించారు. పోలీసు అధికారులు కార్లు తీసుకున్నారని వెల్లడించినా ఆ అధికారు లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నకిలీ నంబరు ప్లేట్లతో ఉన్న కార్లను గ్యాంగ్ నుంచి పోలీసు అధికారులు తీసుకున్నట్టు వెల్లడైనా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే అక్రమంగా కార్లు కొనుగోలు చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేయలేదు. కేవలం కార్లు స్వాధీనం చేసుకొని నలుగు రిని అరెస్టు చేసినట్లు ప్రకటించారు. కేసు విచారణ మొత్తమ్మీద మమ అనిపించినట్టు ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీకి ఆ 11 సీట్లు కూడా రావు

● మంత్రి నారాయణ

తుళ్లూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వస్తామంటూ, వైసీపీ నేతలు మతి భ్రమించి మాట్లాడుతున్నారు. ప్రజలు వైసీపీని తిరస్కరించారు. రాబోయే రోజుల్లో ఆ 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. తుళ్లూరు నుండి వడ్డమాను వెళ్లే కొత్త బీటీ రహదారిని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ




రిబ్బన్ కత్తిరించి రోడ్డుపై రాకపోకలను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

నెల 10న వడ్డమాను గ్రామ రైతులతో సమావేశం సందర్భంగా తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రిని కోరారు. వారి వినతి మేరకు వారం రోజుల్లో రోడ్డును పూర్తి చేశారు. రాజధాని 29గ్రామాలలో మౌలిక వసతుల కోసం రూ.900 కోట్లతో పనులు చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించి జూన్ నెలాఖరుకు అన్ని గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వరద నీటి కాలువల పనులు పూర్తి చేసేలా ముందుకు వెళుతున్నట్టు మంత్రి చెప్పారు. వడ్డమాను నుండి అనంతవరం, నెక్కల్లు, పెదపరిమి వరకు రోడ్డు ధ్వంసమయ్యి జనం గత ప్రభుత్వంలో ఇబ్బంది పడ్డారని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మొన్న ఎన్నికల ముందు రూ.6 కోట్లతో ఇదే రోడ్డు నిర్మాణం చేస్తున్నామని.. ఇదే వడ్డమాను గ్రామంలో వైసీపీ నేతలు కొబ్బరి కాయలు కొట్టారన్నారు. కాని అడుగు కూడా వేయలేదన్నారు.

రాజధాని రైతులతో సీఆర్డీఏ ఆటలు

● రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని పిలిచి తిప్పి పంపిన అధికారులు
● ఈ లాటరీ పేరుతో సగం మందికే ప్లాట్లు ఇచ్చిన వైనం
● మిగిలినవారికి దక్షిణం ఫేసు, రోడ్డు శూల ఉన్న ప్లాట్లు.. తిరస్కరిస్తున్న రైతులు
● పదేళ్లక్రితం భూములిచ్చిన వారికి ప్లాట్లు ఇవ్వకపోవడం..
● కొత్తగా ఇచ్చిన వారికి ప్లాట్లు ఇవ్వడంతో రైతుల్లో ఆగ్రహం



రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చే విషయంలో ఏపీ సీఆర్డీఏ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. రైతుల ప్లాట్ల కేటాయింపు కోసం ఈనెల 15వ తేదీన రాయపూడిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన 'ఈ- లాటరీ' ప్రక్రియ రైతుల్లో ఆగ్రహానికి కారణమైంది. ప్లాట్లు ఇస్తామని ఫోన్లు చేసి పిలిచి, తీరా అక్కడికి వెళ్లాక ప్లాట్లు అయిపోయాయని చెప్పి తిప్పిపంపించడంతో తమను అవమానించడానికి పిలిచారా అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగురోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం నేడు రాజధాని గ్రామాల్లో తీవ్ర చర్చగా మారింది.

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన రాయపూడిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, వెలగపూడి, మందడం 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక, తుళ్లూరు 1,2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1,2, వెంకటపాలెం, దొండపాడు, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాలకు చెందిన 225 మంది రైతులకు 405 ప్లాట్లు ఇచ్చేందుకు ఈ లాటరీ నిర్వహిస్తున్నట్లు సీఆర్డీఏ రైతులకు తెలియజేశారు. రైతులను ఈ లాటరీలో పాల్గొనాలని ఫోన్లు చేసి ఆహ్వానించారు. తీరా అక్కడికి వెళ్లిన తరువాత కొందరికి మాత్రమే ప్లాట్లు కేటాయించారు. 405 ప్లాటకుగానూ 282 ప్లాట్లు, 177 మంది రైతులకు మాత్రమే ఇచ్చారు. దాదాపు 1000 నుంచి 450 గజాల పైచిలుకు పెద్ద పెద్ద ప్లాట్లున్న రైతులు చాలా మంది తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మిగిలిన రైతులు తమను ఎందుకు పిలిచారంటూ అధికారులను ప్రశ్నించారు. తమను పిలిచి ఇలా అవమానించడమేంటని వారు వాపోతున్నారు. కాగా.. పుండుమీద కారం చల్లిన విధంగా రోడ్డు శూల, దక్షిణం ముఖం ఉన్న ప్లాట్లు కూడా రైతులకు ఇచ్చారు. దీంతో వారు మాకు ఆ ప్లాట్లు వద్దు అని తిరస్కరించారు. దీంతో సమస్య పెద్దదైంది. ఇప్పటికే రాజధాని రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో రోడ్డు శూల, దక్షిణం ఫేసు, ఇతర వాస్తు సమస్యలపై రైతుల నుంచి సీఆర్డీఏకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కాగా తాజాగా నిర్వహించిన ఈ వేలంలో కూడా అధికారులు పాత పద్ధతిలోనే వ్యవహరిస్తుండడంతో రైతులు ఆగ్రహంగా ఉన్నారు.

తమకు ఇవ్వకుండా కొత్తవారికి ఇవ్వడంపై ఆగ్రహం..

రాజధాని నిర్మాణంకోసం తొలి ప్రయత్నంలోనే, పదకొండేళ్ల క్రితం 2015లోనే భూములిచ్చిన రైతుల్లో చాలామందికి ఈ రోజుకూ రిటర్నబుల్ ప్లాట్లు దక్కలేదు. తాజాగా జరిగిన ఈ- లాటరీలో వారికి ప్లాట్లు కేటాయించకపోగా, తాజాగా సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం భూములిచ్చిన పెనుమాక, ఉండవల్లి రైతులకు ఈ- లాటరీలో ప్లాట్లు కేటాయించడంతో గతంలో భూములిచ్చిన రైతులు మండిపడుతున్నారు. వారికి ఇవ్వడం విషయంలో తమకు అభ్యంతరం లేదని, కానీ తమకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని వారు నిలదీస్తున్నారు. దీనికి తోడు చాలా మంది రైతులకు గతంలో భూసమీకరణకు ఒప్పుకోని భూముల్లో ప్లాట్లు కేటాయించారు. వారికి ప్రత్యామ్నాయం చూపకుండా, కొత్తగా వచ్చినవారికి ప్లాట్లు కేటాయించడం ఆగ్రహానికి కారణమవుతోంది.

రాజధాని పరిధిలోని వెలగపూడి గ్రామంలో దాదాపు 165కు పైగా సమస్యాత్మక ప్లాట్లు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో ఈ సంఖ్య పదుల్లో ఉండగా, ఇక్కడ మాత్రం వందల్లో ఉంది. ఆ గ్రామంలో ఉన్న లేఅవుట్లలో ప్లాట్లను ఆ గ్రామ రైతులకు కేటాయించకుండా, ఇటీవల భూసమీకరణకు భూములిచ్చిన పెనుమాక, ఉండవల్లి రైతులకు ఆ ప్లాట్లు కేటాయించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శాస్త్రీయ దృక్పథంతో.. పరిశోధనలపై ఆసక్తి

● వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించిన కలెక్టర్

గుంటూరు(విద్య),డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. సోమవారం పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డారు. సమావేశానికి డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్‌బాష అధ్యక్షత వహించారు. శాస్త్రీయదృక్పథంతో పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందని, ఫలితం గా నూతన ఆవిష్కరణలకు బీజం పడతుందన్నారు. మానవాళీ ఎదుర్కొనే అనేక సమస్యలు పరిష్కారం శాస్త్రవేత్తలు, పరిశోధకుల ద్వారానే సాధ్యమని చెప్పారు. పదిలో మెరుగైన ఫలితాల కోసం ఉన్నత పాఠశాలలకు ప్రత్యేక అధికారుల్ని నియమించినట్లు వివరించారు. డీఈవో మాట్లాడుతూ విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్‌మీరా పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా,చిత్రంలో డీఈవో సలీమ్ బాష తదితరులు

పిల్లి మాణిక్యరావుకు ఎమ్మెల్యేల శుభాకాంక్షలు





టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పిల్లి మాణిక్యరావుకు గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లి మాణిక్యరావును ఆయన ఇంటిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన గుంటూరు జిల్లా అధ్యక్ష పగ్గాలు పిల్లి మాణిక్యరావు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మాణిక్యరావుతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని తెలిపారు.

ఆట మొదలైంది
● యోనెక్స్ సన్‌రైజ్ బ్యాడ్మింటన్ జాతీయ టోర్నీ ప్రారంభం
● మెరిసిన స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్
8
గుంటూరు రైల్వేస్టేషన్‌లో
స్లీపింగ్ పాడ్స్
● ప్రయాణికులకు అందుబాటులోకి
● చార్జీలు రూ.150 నుంచి ప్రారంభం



మాచర్ల ప్యాసింజర్ రైలుకు తప్పిన పెను ప్రమాదం


కట్ అయిన రైలు ట్రాక్

గురజాలటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి గుంటూరుకు వెళ్తున్న మాచర్ల ప్యాసింజర్ రైలు సోమవారం ఉదయం 6:20 గంటల సమయంలో గురజాల రైల్వే స్టేషన్ దాటగానే అంబాపురం వద్ద రైల్వే ట్రాక్ కట్ అయింది. ఇది గమనించిన రైలు డ్రైవర్ అప్రమత్తతతో రైలును నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో మరమ్మతులు చేపట్టారు. అనంతరం రైలు బయలుదేరి వెళ్లింది.

క్విజ్ పోటీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య) డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ టి.ఎస్. రామారావు వర్థంతి సందర్భంగా స్థానిక హిందూ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాలల బోటనీ క్వెస్ట్ పోటీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. క్విజ్, ఉపన్యాస విభాగాల్లో విశేషంగా రాణించారని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్ పోటిల్లో ప్రథమ బహుమతి భానుధాత్రిక, రిషిత, వి.ధీరజ్ కృష్ణ, ద్వితీయ బహుమతి బి.భవిష్యానందరెడ్డి, సీహెచ్.సంజయ్ హిమ శ్రీకర్, సీహెచ్ నాగ సంతోష్, తృతీయ బహుమతి జె.అక్షిత సాయిచౌదరి, జి.హర్షవర్ధన్, వక్తృత్వ పోటీల్లో జి.భరత్‌రెడ్డి బహుమతులు సాధించినట్లు తెలిపారు.

నేడు వేళాంగిణికి ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండగ సందర్భంగా నాగపట్టణంలోని వేళాంగిణి చర్చిలో జరిగే వేడుకలకు గుంటూరు మీదగా ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07407 సికింద్రాబాద్ - వేళాంగిణి ప్రత్యేక రైలు మంగళవారం రాత్రి 7.25కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 5.30కి వేళాంగిణికి చేరుకొంటుంది. అదే రైలు 07408 వేళాంగిణి - సికింద్రాబాద్‌గా 25వ తేదీ ఉదయం 8 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

ప్రత్యేక రైలు సర్వీసుల పొడిగింపు

07615 నాందేడ్ - తిరుచ్చిరాపల్లి స్పెషల్‌ని జనవరి 6 నుంచి 27వ తేదీ వరకు ప్రతి మంగళవారం, 07616 తిరుచ్చిరాపల్లి - నాందేడ్ స్పెషల్ జనవరి 7 నుంచి 28వ తేదీ వరకు ప్రతి బుధవారం, 07041 సికింద్రాబాద్ - అనకాపల్లి జనవరి 25 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ప్రతిఆదివారం, 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ రైలు జనవరి 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 16 మధ్యన ప్రతి సోమవారం, 07191 కాచీగూడ - మధురై జనవరి 26న, 07192 మధురై - కాచీగూడ జనవరి 28న, 07193 హైదరాబాద్ - కొల్లం జనవరి 24న, 07194 కొల్లం - హైదరాబాద్ జనవరి 26న, 07230 హైదరాబాద్ - కన్యాకుమారి జనవరి 28న, 07229 కన్యాకుమారి - హైదరాబాద్ జనవరి 30న, 07219 నరసపూర్ - తిరువణ్ణామలై జనవరి 28న, 07220 తిరువణ్ణామలై - నరసపూర్ 29న ప్రయాణిస్తాయని సీపీఆర్‌వో తెలిపారు.

సూర్యలంక తీర ప్రాంతంలో రోడ్డుప్రమాదం

● నలుగురు యువకులకు తీవ్రగాయాలు

బాపట్లరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక తీరం సమీపంలోని చప్టా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలం ఆసోదివారిపాలేనికి చెందిన మర్రి సింహారెడ్డి, ముడుగు రంగారెడ్డి, మంచాల ఏడుకొండలురెడ్డి, దొంతిన గాంధీరెడ్డి కారులో సూర్యలంకకు వెళ్లి.. తిరిగి వస్తున్నారు. చప్టా వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చప్టాకు పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మెలను అదుపు వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవడంతో.. ఆ నలుగురు యువకులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు చీరాల ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దారు సలీమా వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

● రూ.18 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం
● టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి రివార్డులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన డిఎస్పీ అరవింద్, సీఐ వెంకటేశ్వర్లు, వెనుక నిందితులు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఇద్దరితో సహా ఎనిమిది మందిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13.60 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో రూ. 5 లక్షల నగదు ఫ్రీజ్ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్‌కు అందిన సమాచారం మేరకు.. వికాస్ నగర్ 3వ లైన్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేంద్రంపై వెస్ట్ డిఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, సిబ్బంది దాడి చేశారన్నారు. ఒక డాబా ఇంటిలో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు.. నల్లచెరువు, మేనకగాంధీ నగర్ 7వ లైనుకు చెందిన తాతినేని శ్రీనివాసరావు, కొరిటెపాడు పార్కు వెనుక ప్రాంతానికి చెందిన యర్రబోతుల విజయ భాస్కరరెడ్డి, కొరిటెపాడు 4వ లైనుకు చెందిన షేక్ సలీమ్ అలియాస్ శ్రీను, తిరుమలశెట్టి నాగు, శివారెడ్డిపాలెం పోలేరమ్మగుడి ప్రాంతానికి చెందిన కోటపాటి వెంకటరెడ్డి, పొన్నూరు రోడ్డు సాయిబాబా కాలనీ ఒకట లైనుకు చెందిన దొడ్డ శ్రీకాంత్, బృందావన్ గార్డెన్స్ 7వ లైనుకు చెందిన జిల్లెళ్ళమూడి బ్రహ్మ తేజ, నెహ్రూనగర్ 9వ లైనుకు చెందిన పల్లె సుధాకర్ తదితరులున్నట్లు తెలిపారు. తాతినేని శ్రీనివాసరావు అనే వ్యక్తి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో సుమారు పదేళ్లుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్నారు. యర్రబోతుల విజయ భాస్కరరెడ్డితో కలిసి బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడని తేలిందన్నారు. తాతినేని శ్రీనివాసరావు పేకాట కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ దాడుల్లో 62 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. వీటిల్లో ఆర్గనైజ్డ్ పేకాట - 24, ఆర్గనైజ్డ్ వ్యభిచారం - 11, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి - 14 కేసులు, ఇతర నేరాలకు సంబంధించి 13 కేసులు ఉన్నాయన్నారు. ఈ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు చేసిన టాస్క్ ఫోర్స్‌ను ఎస్పీ అభినందించి, నగదు రికార్డులు ప్రదానం చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది, వారికి దిశా నిర్దేశం చేసిన డీఎస్పీ అరవింద్‌ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ట్రేడింగ్ పేరుతో మోసం

సత్తెనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ ట్రేడింగ్ పేరుతో ఇద్దరి వద్ద సైబర్ నేరగాళ్లు రూ.17.61 లక్షల కొట్టేసిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన ప్రసాదు, విజయలక్ష్మిని ఈ-కామర్స్ వ్యాపారం చేస్తే తక్కువ పెట్టుబడితే ఎక్కువ లాభాలు వస్తాయని ప్రోత్సహించారు. ముందుగా వారికి రూ 50 వేలు లాభం చూపించారు. అనంతరం ఇద్దరూ సైబర్ నేరగాళ్లను నమ్మి రూ 17.61 లక్షలను ఆన్‌లైన్‌లో చెల్లించారు. తరువాత వారి ఖాతా నంబర్లను, ఫోన్ నంబర్లను క్లోజ్ చేయడంతో.. మోస పోయామని ప్రసాదు, విజయలక్ష్మి గుర్తించారు. సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

రైతులకు మేలైన విత్తనాలు

సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నరేంద్రకుమార్

పొన్నూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ద్వారా మేలైన, నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నట్లు సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీలో సోమవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడారు. రైతులకు పాడితో పాటు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సంగం సీడ్ ప్రాజెక్టు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ద్వారా వరి, టమాటో, మినుము విత్తనాలను అందించగా అధిక దిగుబడులతో అన్నదాతల మన్ననలు పొందినట్లు చెప్పారు. ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుని రైతులకు వరిలో అధిక దిగుబడులను అందించాయన్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌లో రైతులకు ఎక్కువ విత్తనాలు అందుబాటులోకి తెచ్చేందుకు సంగం సీడ్ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.5 కోట్లు ఖర్చు చేయాలని పాలకవర్గం అమోదించిందని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సెక్షడ్ సెమన్ పైలెట్ ప్రాజెక్ట్‌లో సంగం సంస్థ భాగస్వామ్యం కానున్నట్లు వెల్లడించారు. పాడి పశువులలో వచ్చే వ్యాధులను అరికట్టేందుకు కేరళలోని మలబార్ మిల్క్‌యూనియన్ ఆధ్వర్యంలో తయారవుతున్న ఆయుర్వేద మందులను స్థానిక పాల రైతులకు అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. పాడిపశువుల పాల ఉత్పత్తికి ఓరల్ కాల్షియంతో పాటు, ఆయుర్వేద మొక్కల పంపకం చేపట్టనున్నట్లు చెప్పారు. పాల ఉత్పత్తి పెంపుకు అవసరమైన మేలు జాతి గడ్డి విత్తనాలను అభివృద్ధి చేసేందుకు నకరికల్లులో భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. సమావేశం అనంతరం పాల ఉత్పత్తిదారుల సంక్షేమ పథకం ద్వారా మృతి చెందిన 5 పాల రైతుల కుటుంబాలకు రూ 2.60 లక్షలు, మరణ సహాయ నిధి నుంచి ముగ్గురు సిబ్బంది కుటుంబాలకు రూ4.08 లక్షలు చెక్కులను చైర్మన్ నరేంద్రకుమార్ అందజేశారు. ఈ సమావేశంలో ఎండీ పి.గోపాలకృష్ణన్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎంపీఎల్ క్రికెట్ పోటీలు

● రెండో రోజు 4 మ్యాచ్‌లు

మంగళగిరి సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండోరోజు సోమవారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. అంబేడ్కర్ లెవెన్స్ ఈమని జట్టుపై కాజ పీసీ లయన్స్ జట్టు గెలుపొందింది. సాయి సీసీ లెవెన్ జట్టుపై లెవెన్ థండర్స్, గల్లీ వారియర్స్‌పై కొత్తపేట సూపర్ కింగ్స్ జట్టు, హనుమాన్ యూత్ జట్టుపై పవన్ సీసీ విజయం సాధించాయి. సామాజిక మాధ్యమాల ద్వారా స్కోర్ వివరాలను ఎప్పటికప్పుడు లైవ్‌లో అందిస్తున్నారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో రూ.3 వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. కూటమి నాయకులు మ్యాచ్‌లను తిలకించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


టాస్ వేస్తున్న టీడీపీ నాయకులు


క్రికెట్ మ్యాచ్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చి యార్డు సమాచారం

(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	52,872
అమ్మకాలు	49,859
నిల్వ	10,174

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17200
నెంబరు. 5	12000	15200
273	11500	14200
341	10500	16700
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16200
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	16500
దేవనూరు డీలక్స్	11000	17500
ఆర్మూరు	10000	12700
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16600
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7700

ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా..కూటమి లక్ష్యం

● ఎంపీ లావు, చీఫ్‌విప్ జీవీ


కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, పక్కన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తదితరులు

బొల్లాపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగు నీటిని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో జేజేఎం పథకం ద్వారా నిర్మాణం చేపట్టిన పైపులైన్ పనులను ప్రారంభించారు. పైపులైన్ నిర్మాణానికి రూ.65 లక్షలు కేటాయించారని, ప్రతి ఇంటికి సురక్షిత తాగు నీటిని అందించి.. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలో పైపులైన్ నిర్మాణ పనులు రూ.5.85 కోట్లతో జరుగుతున్నాయని తెలిపారు. అలాగే గ్రామంలో నిర్మించిన హెచ్‌పీ పెట్రోల్ బంకును ప్రారంభించారు. మండలంలోని నాయుడుపాలెంలో రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నిశ్శంకర శ్రీనివాసరావు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, పెమ్మసాని నాగేశ్వరరావు, పెసల వెంకటనారాయణ, ఆరికట్ల వాసుదేవరెడ్డి, దాసరి కోటేశ్వరరావు, గోవిందునాయక్, ఎలిశెట్టి రంగయ్య, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, యలగాల బాదరయ్య, యర్ల శ్రీనివాసరావు, చొక్కా వెంకటేష్, బండిశ్రీను, తంగినీడి కోటేశ్వరరావు, బోయనశెట్టి ఏడుకొండలు, తోటకూరి గోవిందయ్య పాల్గొన్నారు.

అక్షర పల్నాడును సాకారం చేద్దాం

● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా చేసి అక్షర పల్నాడును సాకారం చేద్దామని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో అక్షర ఆంధ్ర, హరిత గోపాలం వంటి అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో గుర్తించిన 1,27,565 నిరక్షరాస్యులకు తరగతులు నిర్వహించాలన్నారు. స్వయం సేవా సంఘాల మహిళలకు చదవడం, రాయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, వ్యాపార నైపుణ్యాలను అందించాలని ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక సామూహిక గోశాల నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షలు అందజేస్తామన్నారు. అర ఎకరంలో గోశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. పశుగ్రాసానికి కొరత లేకుండా హరిత గోపాలం పథకం ద్వారా గడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో ఇళ్లు, స్థలాల హద్దులు నిర్ణయించే స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలన్నారు. పన్ను వసూలులో వెనకబడిన పంచాయతీ అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. డ్వామా, డీఆర్డీఏ పీడీలు సిద్ద లింగమూర్తి, ఝాన్సీరాణి, జిల్లా పంచాయతీ అధికారి వి.నాగేశ్వరనాయక్, ఐసీడీఎస్ డీఎం ఉమాదేవి, విద్యుత్‌శాఖ అధికారి విజయ్‌కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారిణి మాలతీ, సివిల్ సప్లయీస్ మేనేజర్ నారదముని, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి మల్లి పాల్గొన్నారు.

ఎంపీకి తృటిలో తప్పిన ప్రమాదం

వినుకొండటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలుకు తృటిలో ప్రమాదం తప్పింది. వినుకొండలోని పలు అధికార కార్యక్రమాలను ముగించుకొని కారంపూడిలో రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సురేష్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌ను సందర్శించేందు వెళ్లారు. లిఫ్ట్ ద్వారా 2వ అంతస్తుకు వెళ్తుండగా.. ఒక్కసారిగా లిఫ్ట్ కుప్పకూలింది. ఈ సమయంలో డాక్టర్ సురేష్, ఆయన భార్య డాక్టర్ మృదుల తేజస్వి, జిల్లా బీజేపీ మాజీ కార్యదర్శి మేడం రమేష్, మరో నలుగురు ఎంపీతో పాటు లిఫ్ట్‌లో ఉన్నారు. దీంతో కొంతసేపు అక్కడ తీవ్ర ఆందోళన నెలకొంది. లిఫ్ట్ ఆసాంతం గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోవడంతో లిఫ్ట్‌లో ఉన్నవారందరిని బల్ల వేసి పైకి తీసుకురావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ప్రజా సేవే ప్రాధాన్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్య సాధన, నారా లోకేశ్ నాయకత్వంలో అనునిత్యం ప్రజా సేవే తన ప్రథమ ప్రాధాన్యం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించి, పల్నాడు ప్రజలకు 20 నెలలు పాటు సేవ చేసే అవకాశాన్ని ఇచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. 20 నెలలు పాటు సహకరించిన పార్టీ ఇన్‌చార్జిలు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుడు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులకు, అనుబంధ విభాగాల నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

పొగాకు, ఎరువుల బస్తాలు దగ్ధం


మంటల్లో కాలిపోయిన బైకు, సామగ్రి

వినుకొండటౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసు కోవడంతో ఏడు క్వింటాళ్ల పొగాకు, 30 బస్తాలు ఎరువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డులోని 16 వార్డులో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. బాధితుడు చిలంకూరి వెంకటేశ్వర్లు కథనం మేరకు.. ఏడు క్వింటాళ్ల పొగాకుతో పాటు, 30 ఎరువులు బస్తాలు, ద్విచక్రవాహనం, ఇంట్లోని విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని తెలిపారు. వినుకొండ తహసీల్దారు సురేష్ ఘటనా ప్రాంతానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. స్పందించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

నాగార్జున సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం ‌568.10 అడుగులు ఉంది. ఇది 251.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,863, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 , మొత్తం ఔట్‌ఫ్లో 47,416 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 12,583 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అనంతవరప్పాడు పాఠశాలలో ఫర్నీచర్ ధ్వంసం

● పోలీసులకు హెచ్‌ఎం మాధవి ఫిర్యాదు


ధ్వంసమైన పిల్లల కుర్చీలు, బీరువాలోని పుస్తకాలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో 3వ తరగతి క్లాస్ రూమ్ తాళాలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగల గొట్టి బీభత్సం సృష్టించారు. ఫర్నీచర్ ధ్వంసం చేశారని హైస్కూల్ హెచ్‌ఎం టీ మాధవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పది కుర్చీలు, మూడు సీలింగ్ ఫ్యాన్‌లు, ర్యాక్, కరెంటు బోర్డుతో పాటు వాష్ బేషన్ దగ్గర ఉన్నటువంటి కుళాయిలను పూర్తిగా ధ్వంసం చేసినట్టు ఆమె పేర్కొన్నారు. గతంలో కూడా ఇలా జరిగినట్లు చెప్పారు. సీఐ రమా నాయక్, ఎస్ఐ బాబూరావులు హైస్కూల్‌ను సందర్శించారు. ఆవరణలో ఒక పార్టీ జెండాలు, కాల్చిన సిగరెట్లు, అగ్గి పెట్టే ఉండటాన్ని సీఐ రమానాయక్ క్షుణ్ణంగా పరిశీలించారు. హైస్కూల్ ప్రాంగణానికి రక్షణ గోడ లేక పోవటంతో భద్రత లేకుండా పోయిందని, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు.

ఏఎన్‌యూలో మరోసారి చోరీ యత్నం

● విచారించిన పోలీసులు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఏఎన్‌యూ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాపులో మరోమారు చోరీ యత్నం చోటుచేసుకుంది. మెకానికల్ విభాగం విద్యార్థుల శిక్షణ నిమిత్తం అధికారులు వర్క్‌షాపును ప్రత్యేకంగా ఓ భవనంలో ఏర్పాటు చేశారు. దీనిలో శిక్షణకు అవసరమైన లక్షలాది రూపాయల యంత్రాలు, కాపర్ వైర్లతో పాటు పనిముట్లను అందుబాటులో ఉంచారు. గత అక్టోబర్ 24న గుర్తుతెలియని వ్యక్తులు వర్క్‌షాపు గది తాళం పగలగొట్టి కాపర్ వైర్లను పెద్ద ఎత్తున దొంగలించారు. దీంతో విశ్వవిద్యాలయానికి భారీగా నష్టం వాటిల్లినట్లుగా అప్పట్లో అంచనా వేశారు. ఈ నెల 21న మరోసారి రాత్రి వర్క్‌షాపు షట్టర్‌తో పాటు తలుపుల తాళాలు పగులగొట్టారు. లోపల పలు యంత్రాలకు అమర్చిన వైర్లను తెంచారు. ఈ నెల 15న వీసీ గంగాధరరావు ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ మిషన్ ల్యాబ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి చోరీ యత్నం జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈసారి ఎలాంటి వస్తువులు చోరీ కాలేదని.. వర్సిటీ అధికారులు, పోలీసులు వెల్లడించారు. రిజిస్ట్రార్ సింహాచలం పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వర్క్‌షాపును పరిశీలించారు. పలువురు ఉద్యోగులను విచారించి వారి చేతి వేలి ముద్రలను సేకరించారు. తెలిసిన వ్యక్తులే దొంగతనానికి పాల్పడి ఉంటారని వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని సమాచారం. గతంలో ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు లక్షలాది రూపాయల వ్యయంతో అమర్చిన కిటికీల గ్రిల్స్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లడం జరిగింది. ఇలా ఇంజనీరింగ్ కళాశాలలో వరుస దొంగతనాలు జరగడం భద్రతా వ్యవస్థకు సవాలుగా మారింది. రిజిస్ట్రార్ స్పందిస్తూ.. దొంగతనం వెనుక ఎంతటి వ్యక్తులు ఉన్నా వదిలి పెట్టమని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్



టిఫిన్ బండి నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారి శుధ్య పనుల్లో భాగంగా మధ్యాహ్నం సమయంలో తప్పనిసరిగా డ్రెయిన్లు శుభ్రం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆయన రైలుపేట, సాంబశివపేట ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వ వైద్యశాల, రైల్వే స్టేషన్ వద్ద ఆక్రమణలు గమనించి, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఆక్రమణల తొలగింపు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ హనీఫ్, ఏసిపీ జకీరా, బయాలజిస్ట్ రాజు నాయక్, ఎస్ఎస్ సాంబయ్య, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

● నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు గత వారం అందిన ఫిర్యాదులపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌తో అధికారులు హాజరుకావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ జరిగింది. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 24 ఫిర్యాదులు తీసుకొని, అర్జీల పరిష్కార పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 25 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, సిఎంఒహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నగరపాలక సంస్థకు బకాయిలు ఉన్న పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మొండి బకాయిదారుల ఇళ్లు, కమర్షియల్ సంస్థలకు ట్యాప్, డ్రైనేజి కనెక్షన్‌లు తొలగించాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగ సమావేశం జరి గింది. పన్ను వసూళ్లలో పురోగతి లేకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి పన్ను వసూళ్లలో జీరో శాతంతో ఉన్న అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు రవికిరణ్‌రెడ్డి, మదన్ గోపాల్, రెహ్మాన్, సాదిక్‌బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పాల్గొన్న జేసీ తదితరులు

వక్ఫ్ భూములను పూర్తిస్థాయిలో సర్వే చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు (తూర్పు) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వక్ఫ్ బోర్డుకి చెందిన భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దుల ఏర్పాటుకు వక్ఫ్ బోర్డు, సర్వే, రెవిన్యూ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వక్ఫ్ భూములు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలు, రిజిస్ట్రేషన్‌లపై వక్ఫ్ బోర్డు అధికారులు లిఖిత పూర్వకంగా వివరాల అందిస్తే సంబంధిత అధికారులతో విచారణ చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డీఆర్వో కే.ఖాజావలి, జిల్లా రిజిస్ట్రార్ సునీత, డీపీవో సాయికుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా సర్వేయర్ పవన్ కుమార్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో కారుణ్య నియామక ప్రక్రియలో భాగంగా ముగ్గురికి నియామక పత్రాలను సోమవారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అందజేశారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ్, డిఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిమాపక భవన నిర్మాణానికి కలెక్టర్ శంకుస్థాపన

గుంటూరు సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా అగ్నిమాపక భవనం నిర్మాణానికి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ భవనాన్ని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రూ.3.39 కోట్లతో నిర్మించనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కె ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.ఎ.క్యూ జిలానీ, జిల్లా అగ్నిమాపక అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌ల కోసం కృషి చేయాలి

● ఎన్ఏఏఆర్ఎం అదనపు సీఈవో డాక్టర్ విజయ్

● ఆర్వీఆర్ జేసీలో జాతీయ స్థాయి వ్యవసాయ హ్యాకథాన్



మాట్లాడుతున్న ఐకార్ ఎన్ఏఏఆర్ఎం అదనపు సీఈవో డాక్టర్ విజయ

గుంటూరు(విద్య), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ ఆధారిత అగ్రి స్టార్టప్‌లను యువ ఇంజనీర్లు రూపొందించాలని జాతీయ వ్యవసాయ పరిశోధనా, నిర్వహణ సంస్థ అదనపు సీఈవో డాక్టర్ విజయ్ ఏఎన్ఏ విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025 ప్రారంభం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ విజయ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల అన్వేషణ లోనే కాకుండా వ్యవసాయరంగం అభివృద్ధికి అవసరమైన నూతన ఆవి ష్కరణలపై దృష్టిసారించాలన్నారు. నాబార్డు ఏజీఎం(పల్నాడు) జి.శరత్ మాట్లాడుతూ పంటల సాగులో ఆధునిక సాంకేతక పరిజ్ఞానాన్ని విని యోగించి అధిక దిగుబడి సాధించేలా యువ సాంకేతిక నిపుణులు కృషి చేయాలన్నారు. ఇందిరాగాంధీ టెక్నికల్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాంనా రాయణ మాట్లాడుతూ సురక్షితమైన ఆహారమే ఆరోగ్యానికి మూలమని, భావితరాలకు వ్యవసాయాన్ని అందించే బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ ఆర్ అండ్ డి డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఐటిబిఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవిపి చంద్రశేఖరావు, సిఈవో డాక్టర్ ఆర్ హఫీజ్‌బాషా, ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ శోభ వివిధ విభాగాల హెచ్‌వోడిలు పాల్గొన్నారు.

సాయి సన్నిధానంకు సేవా వాహన వితరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, శ్రీ సాయినాధ సన్నిధానంకు చుక్కపల్లి శంకరరావు ఛారిటబుల్ ట్రస్ట్ వారు శ్రీ సాయి సేవా వాహనాన్ని వితరణ చేశారు. సోమవారం చుక్కపల్లి రమేష్, సునీత దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి వాహనాన్ని ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్ కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్యలకు అందజేశారు. కార్యక్రమంలో రాయపాటి కోటి సుధాకర్, వంకాయలపాటి బలరామ కృష్ణయ్య, మైనేని రాంప్రసాదు, మొవ్వ సంజీవరావు, ఉప్పల సుదేష్ పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పీజీఆర్ఎస్‌కు 320 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీ వాస్తవా తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన ఆర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 320 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ అధికంగా వస్తున్న ఫిర్యాదులపై అయా విభాగాల వారీగా మండల స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జాప్యంపై సదరు అధికారి నుంచి వివరణ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగ సాయికుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, అగ్రికల్చరల్ జేడీ పద్మావతి, డ్వామా పీడీ శంకర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డీడీ సత్యనారాయణ చౌదరి, ఆర్డీవో శ్రీహరి, విభిన్న ప్రతిభా వంతుల ఏడీ దుర్గాబాయి, ఉద్యావన శాఖ అధికారి రవీంద్ర పాల్గొన్నారు.

● పార్లమెంట్‌లో పెట్టిన 2005 ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక శాఖ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అర్జీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుత చట్ట సవరణతో పలు రాష్ట్రాలపై ఆర్థిక భారం పడనున్నట్టు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పాశం రామారావు, కంచుమాటి అజయ్, నేతాజీ, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

● దివ్యాంగులకు స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో దివ్యాంగులు అర్జీ అందజేశారు. దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచనను స్వాగతిస్తున్నామని అన్నారు. జిల్లాలోని అర్హుల జాబితాను తయారు చేసి ప్రతి ఒక్కరికి నివాసాలు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలిముట్టి కిరణ్, నాగార్జున, రెహమన్, శ్రీను తదితరులు ఉన్నారు.

● వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అర్జీ అందజేశారు. ఎలక్ట్రికల్, స్వీపింగ్ ఇతర విభాగాల్లో 26 మంది విధులు నిర్వహిస్తున్నామని, గత 9 నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందిపడుతున్నామని వాపోయారు. కలెక్టర్ స్పందించి వేతనాలు విడుదలకు చొరవ చూపాలని కోరారు.



డీబీఆర్‌సీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

సమాజంలో అసమానతలు తొలగించేందుకే పీ4

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలు తొలగించేందుకే సీఎం చంద్రబాబు పీ 4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గోరంట్లలో ది స్క్వేర్ కన్వెన్షన్ హాల్లో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో దళిత, బహుజన వర్గాల స్థితిగతులు, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం 2025 - ఎక్స్‌పోను ఆయన సోమవారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు తలపెట్టిన పీ 4 కార్యక్రమంలో డీబీఆర్‌సీ కూడా భాగస్వామ్యం కావటం ముదావహమన్నారు. డీబీఆర్‌సీ సంస్థ డైరెక్టర్ అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8 జిల్లాల్లో రెండు లక్షల కుటుంబాలతో తమ సంస్థ క్షేత్రస్థాయిలో పని చేస్తుందన్నారు. డీబీఆర్‌సీ సంస్థ డీడీ చుక్కా శామ్యూల్ అనీల్‌కుమార్, గంగాదేవి, నాగలక్ష్మీ, రమాదేవి, మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.

జిల్లాలో 98.50 పల్స్ పోలియో ఇమ్యునైజేషన్

● నేడూ ఆరోగ్య సిబ్బంది మాపప్ సర్వే

గుంటూరు మెడికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రానికి 98.50 పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ లక్ష్యాలను సాధించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలో మొత్తం 2,14,981 మంది ఐదేళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆదివారం నిర్వహించిన పోలియో బూత్ యాక్టివిటిలో 2,08,735 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రెండో రోజు సోమవారం ఆరోగ్య సిబ్బంది మాపప్ ద్వారా ఇంటింటి సర్వే నిర్వ హించి మరో 3013 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. దీంతో మొత్తం మీద 2,11,748 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లైంది. ఇది నిర్దేశిత లక్ష్యంతో పోలిస్తే 98.50 శాతం. సోమవారం కూడా ట్రాన్సిట్ పాయింట్‌లో 874 మంది పిల్లలకు, 271 మంది హైరిస్క్ గ్రూప్ పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలో మంగళవారం కూడా ఆరోగ్య సిబ్బంది మాపప్ కార్యక్రమం జరిపి, పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలు ఉంటే వారికి ఇమ్యునైజేషన్ నిర్వహిస్తారు.

జిల్లా స్థాయి గణిత ఫోరం క్విజ్ విజేతలు వీరే

● అభినందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

గుంటూరు(విద్య), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యా శాఖ, ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత దినోత్సవం సందర్భంగా జరిగిన క్విజ్ పోటీల్లో విజేతలను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం అభినందించారు. స్థానిక హిందూ కళాశాలలో జరిగిన క్విజ్ పోటీల్లో నగరంలోని కాసు శాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించగా, జడ్పీహెచ్ఎస్ నారాకోడూరు విద్యార్థులు ద్వితీయ, జడ్పీహెచ్ఎస్ రేవేంద్రపాడు విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్‌బాషా తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, కే.కామాక్షి, పి.సునీతరజని, ఎంఈవో ఖుద్దూస్, నాగేంద్రమ్మ, డీసీఈబీ కార్యదర్శి తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు ఇవే

గుంటూరు (విద్య) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మెరుగైన ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన సైన్స్ ప్రాజెక్టులు జాబితాను డీఈవో డాక్టర్ ఎస్ కే సలీం బాషా సోమవారం రాత్రి ప్రకటించారు. మొత్తం 125కుపైగా ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా వాటిలో 11 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఇందులో పెదనందిపాడు మండలం ఎస్ ఎన్ గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులు కే ప్రేమ్ రాజు, సిహెచ్ కళ్యాణ్ రూపొందించిన సీడ్ ప్రొటెక్టర్, పీఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్ మంగళగిరి విద్యార్థులు సీహెచ్ కీర్తన, ఈ.తమన్నా, భవాని రూపొందించిన ఇండోర్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సీకే జూనియర్ కాలేజ్ హైస్కూల్ మంగళగిరి విద్యార్థులు సంకీర్తన, ఎం.గణేష్ రూపొందించిన స్మార్ట్ మల్టీపర్పస్ స్పిన్నింగ్ వీల్, రేవేంద్రపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూపొందించిన ఐ ఓటీ బేస్డ్ ఫింగర్ ప్రింట్ డోర్ లాక్ సిస్టం ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అదేవిధంగా ఎస్ఎస్ఎన్ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుంటూరు) విద్యార్థులు టీ.శాంతి, షేక్ రెహానా రూపొందించిన మ్యాథమెటిక్స్ ఇన్ డైలీ లైఫ్, సికే హైస్కూల్ కొత్త రెడ్డిపాలెం చేబ్రోలు విద్యార్థులు జి.చందుసాయి, ఎస్.విజయ్ రూపొందించిన స్మార్ట్ డస్ట్ బిన్, పల్లపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులు టీ హేమ తేజస్విని, షేక్ దీవెన రూపొందించిన ఆటోమేటిక్ రైన్ డిటెక్టర్ క్లాత్ రిమూవర్, నంబూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కే రోహిత్ వర్మ రూపొందించిన ఆటోమేటిక్ ఫైర్ సిస్టం ఫర్ బస్సెస్, అనంతవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సీహెచ్ మోహన్ కృష్ణ రూపొందించిన స్మార్ట్ బెడ్ విత్ బాడీ ప్రొటెక్షన్, నారాకోడూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బి శ్రీహరి ప్రసాద్ రూపొందించిన ఎక్స్‌ప్లోరింగ్ ద వండర్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ, ఎన్‌సీఆర్ఎం హైస్కూల్, తెనాలి విద్యార్థి పి.భాస్కరరావు రూపొందించిన మ్యాజిక్ స్కేర్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. విద్యార్థులను డీఈవో డాక్టర్ సలీం బాషా, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా, ఎంఈఓ కుద్దూస్ నాగేంద్రమ్మ తదితరులు అభినందించారు.

రాష్ట్ర జూడో పోటీల్లో రన్నర్‌గా గుంటూరు జట్టు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన ఏపీ స్టేట్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జూడో జూనియర్ క్రీడాకారులు రన్నర్స్ ఛాంపియన్‌ను కైవసం చేసుకున్నారు. జూనియర్ బాలికల విభాగంలో జాహ్నవి, దీపిక, భవాని బంగారు, జి మధురిమ, లావణ్యలు వెండి పతకాలతో మెరిశారు. బాలుర భాగంలో జాకబ్ జాన్ రజతం, లిఖిత్ పవన్ కుమార్ వెండి పతాకాలను కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను గుంటూరు జిల్లా జూడో ప్లేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.కిరణ్ కుమార్ రెడ్డి, అధ్యక్షుడు ఏ శ్రీహరి నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాపై భారం పడని సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం బ్రాడీపేట, జీడీసీసీ బ్యాంకు ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనల్లో ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి చిన్నారావు, గోగినేని కిషోర్ కుమార్, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, షేక్ బాషా పాల్గొన్నారు.

సీతారామయ్య హైస్కూల్లో గణిత దినోత్సవం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడు ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ స్పేస్ సైంటిస్ట్, రేరా సభ్యుడు చందు సాంబ శివరావు పాల్గొని చిన్నారులు చేసిన వివిధ ప్రాజెక్టులను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధామాధవి, ప్రైమరీ కో ఆర్డినేటర్ సయ్యద్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కో ఆర్డినేటర్ తిరువీధుల శ్రీదేవి, ఇన్‌చార్జి కొమ్మినేని హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాన్‌కు ఉద్యోగ సంఘాల నాయకుల అభినందనలు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన పఠాన్ హుస్సేన్ ఖాన్‌కు నల్లచెరువులోని డివిజన్ కార్యాలయంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం అభినందనలు తెలిపారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదార నరసింహారావు, డివిజన్ అధ్యక్షుడు కె.రవీంద్ర, కార్యదర్శి మోహన్‌రావు, సీనియర్ నాయకులు, పలువురు ఉద్యోగులు, ఆపరేషన్ ఏఈలు ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.

నిరాడంబరంగా లింగంశెట్టి జన్మదిన వేడుకలు

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు రాజీవ్ గాంధీ భవన్‌లో సోమవారం నిరాడంబరంగా జరిగాయి. వాసవీ సేవా సమితుల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కొప్పరపు రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛంతో లింగంశెట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోడపాటి నాగేశ్వరరావు, గుప్తా తదితరులున్నారు.

శాపంగా మారిన నూతన ఉపాధి హామీ చట్టం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన 2025 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు శాపంగా మారనున్నదని వామపక్ష నాయకులు ఆరోపించారు. స్థానిక హిమనీ సెంటర్, గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వై.నేతాజి, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఆకిటి అరుణ్ కుమార్, ఎన్.కృష్ణ, నల్లపనేని సాంబశివరావు, ఎల్ అరుణ పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



గోపీకృష్ణ మృతదేహం

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చే మార్గం లేక దర్శి ఉమా గోపీకృష్ణ (32) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు ఫిరంగిపురం మండలం సిరంగిపురం గ్రామానికి చెందిన దర్శి ఉమా గోపీకృష్ణకు సంధ్యతో వివాహమై ఇద్దరు మగ పిల్లల సంతానం కలిగారు. అతను బియ్యం షాపులో గుమస్తాగా పని చేస్తూ జీవిస్తున్నాడు. సుమారు పది లక్షల వరకు అప్పులు అయినట్లు తెలిసింది. ఈ క్రమంలో 22న ఉదయం పొట్టిశ్రీరాములు నగర్‌లోని ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దర్శి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు...

మద్యం తాగొద్దన్నందుకు శారదాకాలనీకి చెందిన ఇస్తల మరియదాసు(62) ఆత్మహత్యకు పాల్పడాడు. పోలీసుల కథనం మేరకు.... శారదాకాలనీ 23వ లైన్‌కి చెందిన ఇస్తల మరియదాసు దురలవాట్లకు బానిసై మూడు సంవత్సరాల క్రితం పక్షవాతానికి గురయ్యాడు. మద్యం తాగుతుండగా కుటుంబ సభ్యుల మందలించారు. ఈనెల 18న ఇంట్లో ఉన్న అన్ని రకాల టాబ్లెట్లు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్ళగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ సీఐ ఆరోగ్యరాజు తెలిపారు.

అపర కర్మల సత్రం స్థలం కబ్జాపై ఫిర్యాదు

స్థానిక ఆర్ అగ్రహారం కోనేరు వద్ద ఉన్న ఆర్యవైశ్య హిందూ అపర కర్మల సత్రం స్థలాన్ని కొందరు కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని సంఘ కార్యదర్శి గోకవరపు వెంకట కుమార్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈనెల 1న కుటుంబంతో కేరళ వెళ్లి పదో తేదీ వచ్చానన్నారు తాను ఊరిలో లేని సమయంలో అపర కర్మల సత్రానికి సంబంధించిన స్థలాన్ని, రోడ్డును కబ్జా చేసి శ్రీనివాస నాయక్, కోమలి బాయ్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణరావు, సాంబశివరావు, అనిల్ కుమార్ తదితరులు మూడు షెడ్లు వేసుకున్నారన్నారు.

కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదని...

తాను ఫ్లెక్సీలు కడుతూ స్తంభంపై నుంచి కిందపడి కాలు విరిగినా కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదని సుద్దపల్లికి చెందిన షేక్ మీరావలి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను రవి, గోపీ వద్ద ఫ్లెక్సీలు కడుతుంటానని తెలిపాడు. ఈ క్రమంలో ఫెక్సీలు కడుతూ కాలు జారి పడ్డానని, దీంతో తన కాలు విరిగిందన్నాడు. తాను పనికి వెళితేనే కుటుంబం గడుస్తుందని చెప్పినా స్పందించడంలేదన్నారు.

పీకలవాగు అభివృద్ధి, రక్షణ గోడలకు సహకరించండి!

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుకు మొక్కను బహూకరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యంత ప్రాధాన్యమున్న పీకల వాగును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందించాలని సీఎం చంద్రబాబును పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆమె సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల గురించి ఆమె సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. పీకలవాగుపై సమగ్ర సర్వే నిర్వహించి ఇంజనీరింగ్ అధికారులతో పూర్తి స్థాయి డిజైన్ రూపొందించి, వాగుకు రెండువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో పీకలవాగు ప్రవాహం సజావుగా సాగకపోవడం వల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని చెప్పారు. వచ్చే ఎండాకాలం పనులు చేపట్టడానికి అనుకూల సమయమని, ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె సీఎం దృష్టికి తీసుకుని వెళ్లారు.

తాగునీటి సరఫరాపై..

నియోజకవర్గంలోని పలు మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ గంటపాటు కూడా తాగునీరు అందని పరిస్థితి ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దెబ్బతిన్న పైపులైన్లను పూర్తిగా రీడిజైన్ చేసి, కొత్త నీటిసరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

యువత గెలుపు ఓటముల్ని సమభావంతో స్వీకరించాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యువత గెలుపు, ఓటముల్ని సమంగా భావించాలని, క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం పెరుతుందని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్ కుమార్ మాట్లాడారు. జిల్లాలోని 19 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుప్పావై 7వ పాశురంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ధనుర్మాసం సందర్భంగా సోమవారం తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి తిరుప్పావై 7వ పాశురాన్ని ప్రవచనం చేశారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులోని శ్రీ రాజ్యలక్ష్మి గోదా సమేత శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తోన్నట్లు ఆలయ పాలకవర్గం తెలిపింది. ఈనెల 30న ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి విశేష ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకుడు సెంట్రింగ్ బాబు, అర్చకుడు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

దీపక్ కుటుంబానికి ఆర్థికసాయం

గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అశువులు బాసిన సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ పిల్లి దీపక్ కుటుంబానికి సోమవారం కాకాని రోడ్డులోని సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో ఆ శాఖ ఆడిట్ కమిషనర్ పులిపాక ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయం అందచేశారు. దీపక్ తండ్రి ఏసుపాదం, తల్లి శశిదేవిలకు కమిషనర్ ఆనంద్‌కుమార్ రూ.5 లక్షల చెక్కును అందచేశారు. కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా దీపక్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ ఆడిట్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌వి సుబ్రహ్మణ్యం సూపరింటెండెంట్‌లు సాయి చరణ్, కొప్పిశెట్టి రామారావు, అస్లాం ఉస్మాని, షబ్బీర్ షేక్ ఎన్ సుధీర్, చాణిక్య, పురుషోత్తం, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ చేస్తున్న వేధింపులు ఆపాలని 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి 104 సిబ్బంది వినతి పత్రం అందజేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులకు తగ్గించిన వేతనాలు, రద్దు చేసిన క్యాజువల్ లీవులు పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోరంట్ల సురేష్, శ్రీహర్ష, ఐ.నాగులు, ఏడుకొండలు, సత్యరాజ్, బాలకృష్ణ, సాయిరామ్ తదితరులు ఉన్నారు.

రైలు రద్దయ్యేలా చేసిన పంతం

● ప్రైమరీ మెయిన్‌టెనెన్స్‌లో వివాదంతో ఆగిన విజయవాడ-బెంగళూరు కంటోన్మెంట్ రైలు

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ పశ్చిమ రైల్వే జోన్‌లు పంతాలకు పోయి పేద ప్రజలు ప్రయాణించే రైలు రద్దుకు కారణమయ్యాయి. కరోన లాక్‌డౌన్ ముందు వరకు విజయవాడ-బెంగళూరు కంటోన్మెంట్ మధ్యన రాకపోకలు సాగించిన ప్యాసింజర్ రైలును ఇప్పటివరకు పునరుద్ధరించలేదు. లాక్‌డౌన్‌కు ముందు రద్దు చేసిన వాటన్నింటిని రైల్వే శాఖ తిరిగి పట్టాలెక్కించినప్పటికీ ఈ రైలును మాత్రం తీసుకురాలేదు. ఇందుకు కారణం ర్యాక్ ప్రైమరీ మెయిన్‌టెనెన్స్ విషయంలో రెండు జోన్ల మధ్యన అంగీకారం కుదరకపోవడమే. ఈ రైలు ర్యాక్ నిర్వహణను తొలి నుంచి దక్షిణ పశ్చిమ రైల్వే జోన్ చేసేది. సెకండరీ మెయిన్‌టెనెన్స్‌ను విజయవాడలో చేసేవాళ్లు. అయితే కరోనా లాక్ డౌన్ తర్వాత తాము మెయిన్‌టెనెన్స్ చేయలేమని ఎస్‌డబ్ల్యూఆర్ జోన్ చేతులెత్తేసింది. తాము కూడా ఇక్కడ మెయిన్‌టెనెన్స్ చేయలేమని ఎస్‌సీఆర్ జోన్ అధికారులు చెప్పడంతో రైల్వేబోర్డు ఏకంగా ఆ రైలునే రద్దు చేసేసింది.

రైలు నంబరు 56504 విజయవాడ- బెంగళూరు కంటోన్మెంట్ ప్యాసింజర్ రైలు నిత్యం రాత్రి వేళ 8.35కి విజయవాడలో బయలుదేరి కృష్ణాకెనాల్, మంగళగిరి, నంబూరు, పెదకాకాని హాల్ట్, గుంటూరు, నల్లపాడు, పేరేచర్ల, ఫిరంగిపురం, నుదురుపాడు, సాతులూరు, నరసరావుపేట, శావల్యాపురం, వినుకొండ మీదుగా నంద్యాల, డోన్, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.45కి బెంగళూరు కంటోన్మెంట్‌కు చేరుకొనేది. ఈ రైలు పేద ప్రజలు బెంగళూరుకు చేరుకోవడానికి ఎంతో అనువుగా ఉండేది. అలానే రైలు నంబరు 56503 బెంగళూరు కంటోన్మెంట్-విజయవాడ ప్యాసింజర్ రైలు నిత్యం ఉదయం 7.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 4.10కి గుంటూరు, 6.05కి విజయవాడ చేరుకొనేది. ఈ రెండు రైళ్లకు కేఎస్‌ఆర్ బెంగళూరు-హుబ్లీ-కేఎస్ బెంగళూరు ప్యాసింజర్ రైళ్లతో ర్యాక్ షేరింగ్ ఉండేది.

అయితే జోన్‌ల మధ్యన పేచీల కారణంగా ఈ రైళ్లు రద్దయ్యాయి. వీటిని పునరుద్ధరించేందుకు ఏ ఒక్కరూ దృష్టి సారించడం లేదు. అదేమంటే బెంగళూరుకు ప్రస్తుతం ప్రశాంతి(డైలీ), గరీబ్‌రథ్(వీక్లీ), కొండవీడు(ట్రైవీక్లీ), ఎస్‌ఎస్‌పీఎన్(వీక్లీ), స్పెషల్ రైళ్లు ఉన్నాయని చెబుతున్నారు. ఇవన్నీ గుంటూరుకు పాసింగ్ రైళ్లే. అదే విజయవాడ-బెంగళూరు కంటోన్మెంట్ రైలు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు అందులో ప్రయాణం చేయడానికి సీట్లు దొరకుతాయి. దూర ప్రాంత రైలు కాబట్టి రైల్వే నిబంధనల ప్రకారం ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. అప్పుడు స్లీపర్, ఏసీ బోగీలు కూడా అందుబాటులోకి వస్తాయి. దీని పునరుద్ధరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మూగజీవాలపై ముఖ్యమంత్రి ఉదారత

● ప్రతి నియోజకవర్గంలో పశువుల హాస్టల్స్

● ఒక్కో హాస్టల్‌కు అరెకరం స్థలం కేటాయింపు

● ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం



పశువుల హాస్టల్ నమూనా

వేమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వినూత్న ఆలోచనలతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తోంది. ప్రజల కోసమే కాకుండా పశువుల సంరక్షణ కోసం కూడా తాజాగా కొత్త ఆలోచన చేసింది. పశువుల కోసం ప్రత్యేక హాస్టల్స్‌ను నిర్మించేందుకు నియోజకవర్గాల స్థాయిలో ప్రణాళికలు రూపొందించడం ప్రారంభించింది. అందులో భాగంగా బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం మోదుకూరులో హాస్టల్ నిర్మాణానికి రెవెన్యూ శాఖ నుంచి స్థల కేటాయింపు కోసం చర్యలు ప్రారంభించారు. గ్రామాలు, పట్టణాల్లో రోడ్ల మీద తిరుగుతూ ఉండే పశువులు, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతులకు తగిన స్థలాలు లేక పశువులను రోడ్లపై కట్టి వేస్తూ అవస్థలు పడుతున్నారు. వారి పశువులకు ఆశ్రయం కల్పించడమే ఈ హాస్టల్స్ ప్రధాన ఉద్దేశ్యం.

● బాపట్ల జిల్లాలో ఆరు కేంద్రాల ఏర్పాటు

ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక పశువుల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో పశువుల హాస్టల్స్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మనుషుల్లాగా పశువులకు ఏర్పాటు చేసే హాస్టల్స్‌లో ఆవులు, గేదెల పోషణకు అన్ని రకాల చర్యలు తీసుకోనున్నారు. ఒక్కో హాస్టల్‌కు అరెకరం స్థలం కేటాయించి, ఒక్కో దానికి నిధులు రూ.10 లక్షలతో షెడ్డు నిర్మాణం చేసేందుకు ఉపాధి విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● ఆవులు, గేదెలకు సకల సౌకర్యాలు

పశు సంవర్ధక శాఖను బలోపేతం చేయడంతో పాటు పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని గుర్తించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలం అరెకరం హాస్టల్ షెడ్లకు కేటాయించనున్నారు. అందులో షెడ్డు నిర్మాణానికి ఒక్కో దానికి రూ.10 లక్షలు ఖర్చు చేస్తూ 20 నుంచి 30 పశువులను కట్టి వేసేందుకు సౌకర్యాలు కల్పిస్తారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు పర్యవేక్షణలో వైద్య సౌకర్యం, పశువులకు దోమల బెడద లేకుండా ఫ్యాన్లు, నెట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఈ హాస్టల్స్‌ను కర్నూలు జిల్లాలో ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు.

● కమిటీ కనుసన్నల్లో నిర్వహణ

ప్రతి హాస్టల్‌కు ఒక కమిటీ ఏర్పాటు చేసి తద్వారా వాటి నిర్వహణ చేయనున్నారు. కమిటీలో పశు వైద్య శాఖ అధికారిని సభ్యునిగా నియమించనున్నారు. పశు గ్రాసం, పాలు పితికే యంత్రాలు, గడ్డి కోసే మిషన్లు అందుబాటులో ఉంచనున్నారు. పేడ ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి సేంద్రీయ ఎరువులు తయారీ సౌకర్యాల ద్వారా హాస్టల్‌కు ఆదాయం పెంచనున్నారు. గడ్డి పెంపకానికి కూడా ఆ కేంద్రాల పరిధిలోని ప్రభుత్వానికి సంబంధించిన ఐదెకరాల భూమిని కేటాయించేందుకు కూడా రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.



ఉపాధి పీడీ విజయలక్ష్మి

క్షురకుల నియామక వివాదంతో జంట హత్యలు

● అత్త, మామపై దాడి చేశారని సోదరుల నరికివేత

● ఇరుపక్షాలు బంధువులే.. గ్రామంలో విషాదఛాయలు



మృతులు శ్రీరామమూర్తి, హనుమంతు (ఫైల్‌ఫోటోలు)



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పుల గ్రామంలో జరిగిన సోదరుల జంట హత్యలతో గ్రామం ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు కొత్త శ్రీరామమూర్తి (44), కొత్త హనుమంతు (35) టీడీపీలో చురుకైన కార్యకర్తలు. గ్రామ సమీపంలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి గుడి ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లో శ్రీరామమూర్తి విధులు నిర్వహిస్తుండగా, అతని సోదరుడు కొత్త హనుమంతు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన యాగంటి నరేష్, అతని తోడల్లుడు పువ్వాడ రామలింగం టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అందరూ ఒకే పార్టీలో కొనసాగుతూ వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో క్షురకులు మాచర్ల కృష్ణ, పోలేపల్లి శివ విధులు నిర్వహిస్తుండగా వారిని విధుల నుంచి తొలగించి వారి స్థానంలో కొర్రపాటి వెంకట్రావు, కందుకూరి చక్రవర్తిని నియమించారు. దీనిపై కొత్త శ్రీరామమూర్తి సుమారు పది రోజుల క్రితం యాగంటి నరేష్ మామ లింగా బ్రహ్మయ్య ఘర్షణ పడ్డారు. అంతటితో ఆగకుండా లింగా బ్రహ్మయ్య తన భార్య లింగా బ్రహ్మేశ్వరిని మరో ఇద్దరిని వెంట తెచ్చుకొని శ్రీరామమూర్తిపై అమ్మవారి గుడి ప్రాంగణంలో దాడి చేశాడు. ఆ దాడిలో శ్రీరామమూర్తి కోపోద్రిక్తుడై బండ రాయితో మోదడంతో యాగంటి నరేష్ అత్త బ్రహ్మేశ్వరి తలకు బలమైన గాయాలయ్యాయి. తమ అత్తామామలపై దాడి చేయడాన్ని మనసులో పెట్టుకున్న యాగంటి నరేష్, అతని తోడల్లుడు పువ్వాడ రామలింగం.. కొత్త శ్రీరామమూర్తి, కొత్త హనుమంతును అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఆదివారం రాత్రి పథకం ప్రకారం తోడల్లుళ్లు ఇద్దరు చెరొకరిని హతమార్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మద్యం పూటుగా సేవించి ఒకరు గ్రామంలో మాటు వేయగా మరొకరు అమ్మవారి గుడి వద్ద మాటు వేశారు. రాత్రి సుమారు 10:30 గంటల తరువాత అమ్మవారి గుడి వద్ద వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కొత్త శ్రీరామమూర్తిని యాగంటి నరేష్, అతని అనుచరులు గొడ్డళ్లతో హతమార్చారు. తదుపరి అడిగొప్పుల గ్రామంలోని బొడ్రాయి సెంటర్లో ఉన్న శ్రీరామమూర్తి సోదరుడు కొత్త హనుమంతును నరేష్ తోడల్లుడు పువ్వాడ రామలింగం, అతని అనుచరులు గొడ్డళ్లతో నరికి హతమార్చి పరారయ్యారు.

● జంట హత్యలపై పోలీసుల విచారణ

కొత్త శ్రీరామమూర్తి, అతని సోదరుడు కొత్త హనుమం తు జంట హత్యలపై పల్నాడు పోలీసులు విచారణ చేపట్టారు. సమాచారం అందుకున్న కారంపూడి సీఐ శ్రీనివాసరావు, దుర్గి ఎస్ఐ సుధీర్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు సోమవారం సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

● గ్రామంలో విషాద ఛాయలు

కొత్త శ్రీరామమూర్తి, అతని సోదరుడు కొత్త హనుమంతు హత్యలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరుపక్షాలు బంధువులైనప్పటికీ, ఒకే పార్టీ, ఒకే సామాజికవర్గం అయినప్పటికీ గ్రామంలో ఆధిపత్యం కోసం, తమ మాటే చెల్లాలని ఘర్షణ పడి హత్యలకు దారి తీయడం చర్చనీయాంశంగా మారింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అడిగొప్పుల గ్రామానికి తీసుకురాగా దహన సంస్కారాలు ముగిశాయి.

స్మార్ట్ వర్క్‌తోనే విజయం

● సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత



మాట్లాడుతున్న- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత

ఏఎన్‌యూ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలంలో సాంకేతికతను ఉపయోగించుకుంటూ ఎవరు ఎక్కువ కష్టపడతారో వారికి విజయాలు దక్కుతాయని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ మల్లవరపు బాలలత అన్నారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రథమ సంవత్సర న్యాయ విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమానికి ఆమె గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, మనం ఏ మేరకు సక్సెస్ అయ్యామనేది ముఖ్యం కాదని, ఎంత మంది జీవితాలలో మార్పులు తీసుకురాగలిగామనేదే ముఖ్యమని అన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షలప్పుడే కాకుండా ప్రతిరోజు అభ్యసించాలని సూచించారు. మెడికల్, ఇంజనీరింగ్ రంగాలకున్న ప్రాధాన్యత నేడు న్యాయ రంగంలో కూడా పెరిగిపోవడంతో అనేకమంది ఈ కోర్సు పట్ల ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ లా బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్ విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ,కృషి, పట్టుదలతో మసులుకుంటే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ మందూరి వెంకటరమణ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయవిభాగపు అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ రామకోటి రెడ్డి, డాక్టర్ రామకృష్ణ బాబా, పరుచూరు కుమారి, దినకర్, మనోజ్ , సైకాలజీ అధ్యాపకురాలు ప్రమీలా రాణి, జై పాల్గొన్నారు.

ఆట మొదలైంది



బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పీవీ సింధు

● యోనెక్స్ సన్‌రైజ్ బ్యాడ్మింటన్ జాతీయ టోర్నీ ప్రారంభం

● 500 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల రాక

● మెరిసిన స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్

● ఈ నెల 28న ముగింపు ఉత్సవాలకు సీఎం చంద్రబాబు

విజయవాడ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యోనెక్స్ సన్‌రైజ్ షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీనియర్ మహిళల, పురుషుల విభాగంలో ఏడు రోజుల పాటు జరిగే ఈ పోటీలు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఏపీబీఏ) నిర్వహిస్తోంది. తొలిరోజు 78వ టీం చాంపియన్‌షిప్ విభాగంలో పోటీలు జరిగాయి. మంగళవారం నుంచి 87వ జాతీయ పోటీలు ప్రారంభమవుతాయి. 33 రాష్ట్రాలకు చెందిన ఆరు భారత సంస్థల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. పోటీలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. స్టార్ షెట్లర్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలి రోజు హోరాహోరీగా జరిగిన పోటీలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి తిలకించారు. టీం చాంపియన్‌షిప్ పోటీలు క్వార్టర్స్‌తోనే ప్రారంభం కావడంతో సెమీస్‌లో ఆశలను నిలుపుకునేందుకు జట్లు కష్టపడ్డాయి. క్వార్టర్స్‌లో ఐదు మ్యాచ్‌లకు మూడు గెలిస్తేనే సెమీస్‌కు ప్రవేశం ఉన్న నేపథ్యంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు చెమటోడ్చారు.

● పకడ్బందీ ఏర్పాట్లు

దేశవ్యాప్తంగా ఉన్న షటిల్ దిగ్గజాలు హాజరైన ఈ పోటీలకు ఏపీబీఏ ప్రతినిధులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దేశంలోనే అత్యున్నత స్థాయిలో ఉన్న 100 మంది రిఫరీల కనుసన్నల్లో పోటీలు జరుగుతున్నాయి. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. క్రీడా ప్రాంగణంతో పాటు పరిసరాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

● మెరిసిన సింధు, శ్రీకాంత్

రాష్ట్రానికి చెందిన స్టార్ షట్లర్ పీవీ సింధు, అర్జున అవార్డు గ్రహీత కిడాంబి శ్రీకాంత్ పోటీలలో సత్తా చాటారు. అంతర్జాతీయ, ఒలింపిక్ పోటీల్లో వీరు ఆడే తీరును ఇప్పటి వరకు కేవలం మాధ్యమాల్లోనే చూశామని, నేరుగా చూడటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు తెలిపారు. సింధు సింగిల్స్ ఆటతోనే టీం చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లోనే విజయం సాధించి మధ్యాహ్నం డబుల్స్ విభాగంలో మెరిసి ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టును సెమీ ఫైనల్స్‌కు తీసుకెళ్లింది. మరో మహిళల సింగిల్స్‌లో విజయవాడ క్రీడాకారిణి టి.సూర్యచరిష్మ విజయం సాధించింది. టీం చాంపియన్‌షిప్ విభాగంలో ఏపీ, ఉత్తరాఖండ్ తలపడ్డాయి. ఏపీకి ప్రాతినిధ్యం వహించిన సింధు, సూర్యచరిష్మ.. ప్రత్యర్థి ఉత్తరాఖండ్ క్రీడాకారులపై పైచేయి సాధించారు. మధ్యాహ్నం జరిగిన డబుల్స్‌లో సింధు-కవిప్రియ జోడి 21-11, 21-17 తేడాతో ఉత్తరాఖండ్ జోడిని ఓడించారు. 3-0 తేడాతో ప్రత్యర్థిపై నెగ్గిన ఏపీ టీం సెమీ ఫైనల్స్‌లోకి అడుగు పెట్టింది. సెమీ ఫైనల్‌లో గుజరాత్ జట్టుతో సింధు తలపడింది. పురుషుల విభాగంలో ఏపీ జట్టు తమిళనాడు చేతిలో ఓడి క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ ఏపీకి ప్రాతినిధ్యం వహించాడు.



కిడాంబి శ్రీకాంత్ (ఆంధ్రప్రదేశ్), ఎస్.రిత్విక్ సంజీవి (తమిళనాడు) మధ్య హోరాహోరీ పోరు

● త్వరలో రాష్ట్రానికి క్రీడా వర్సిటీ: ఎంపీ కేశినేని చిన్ని

పోటీలను ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు, ఎండీ భరణి, డైరెక్టర్ సంతోష్, ఏపీబీఏ అధ్యక్షుడు ద్వారకానాథ్, పి.అంకమ్మచౌదరి, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, త్వరలో రాష్ట్రానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ రానుందన్నారు. దేశానికి కోచ్‌లను తయారుచేసే రాష్ట్రంగా ఏపీ మారబోతుందన్నారు. ముగింపు వేడుకలకు హాజరయ్యేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని వేదికపై ప్రకటించారు.

గుంటూరు రైల్వేస్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్

● ప్రయాణికులకు అందుబాటులోకి

● ఫ్రీ వైఫై, వేడినీళ్లు, తదితర సదుపాయాలు

● చార్జీలు రూ.150 నుంచి ప్రారంభం



గుంటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు రైల్వేస్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సదుపాయాన్ని రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకొస్తోంది. మంగళవారం డీఆర్ఎం సుధేష్ణ సేన్ వీటిని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇవి ప్రయాణికులకు విశ్రాంతి తీసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 1, గేట్ నంబరు 3లో ఈ స్లీపింగ్ పాడ్స్ అందుబాటులో ఉంటాయి. మొత్తం 64 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వీటిల్లో 52 సింగిల్ బెడ్స్, 12 డబుల్ బెడ్స్‌తో పాటు నాలుగు గదులు కూడా ఉన్నాయి. వీటన్నింటికి ఉచిత వైఫై, హాట్ వాటర్, స్నాక్స్‌బార్, ట్రావెల్ డెస్కు, టాయ్‌లెట్స్, విశాలమైన బెడ్లు, దిండులు, లాకర్ సదుపాయాలు ఉంటాయి. కుటుంబం, మహిళలకు ప్రత్యేకంగా 10 డబుల్, 12 సింగిల్ బెడ్స్‌ను రిజర్వు చేశారు.

● చార్జీలు ఇలా..

సింగిల్ బెడ్స్ అయితే తొలి మూడు గంటలకు రూ. 150 ఆ తర్వాత 24 గంటల వరకు రూ.300 చార్జీ చేస్తారు. డబుల్ బెడ్స్‌కు తొలి మూడు గంటలకు రూ. 250, ఆ తర్వాత 24 గంటల వరకు రూ.500 వసూలు చేస్తారు. గదులు అయితే తొలి మూడు గంటలకు రూ. 300, రోజంత అయితే రూ.వెయ్యి చార్జీగా నిర్ణయించారు. వీటి వల్ల ప్రయాణికులు తక్కువ ఖర్చులోనే విశ్రాంతిని పొందవచ్చు. ఇతర ప్రాంతల నుంచి గుంటూరుకు వచ్చి అదే రోజు తిరుగు ప్రయాణమయ్యే వారికి ఈ స్లీపింగ్ పాడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయి.

ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వేజోన్‌లోని కొన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో ఈ స్లీపింగ్ పాడ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటికి మంచి స్పందన వస్తుండటంతో గుంటూరులోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన స్లీపింగ్ పాడ్స్

ఉరకలెత్తిన ఉత్సాహం

● వీవా వీవీఐటీయూ యువజనోత్సవం

● ఆటపాటలతో ఉర్రూతలూగిన విద్యార్థులు


● ఘనంగా ముగిసిన యువజనోత్సవాలు

● వానర, చాంపియన్ చిత్రబృందాలు హాజరు



విజేతలతో యూనివర్సిటీ ఉపకులపతి వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి యువజనోత్సవం వీవా-వీవీఐటీయూ 2025-26 వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. రెండురోజుల యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మారుమోగింది. 20వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ వేడుకలలో సాహితీ ప్రహేళిక, ఆధునిక అష్టావధానం, జానపద శాస్త్రీయనృత్యం సంగీతం వంటి సాంస్కృతిక అంశాలతో పాటుగా ది త్రోన్ చాలెంజ్, సైబర్ క్లాష్, బ్రెయిన్ బజ్, కాంపోనెంట్స్ క్లాష్, ఎలక్ట్రోబిడ్జ్, వైర్ వార్స్ క్యాడ్ బిల్డర్స్‌వంటి సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠతో సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడుకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, వీవీఐటీ యూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ పోటీలలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసారు. వేడుకలో చాంపియన్ చిత్రబృందం హీరో రోషన్, హీరోయిన్ అనస్వరారాజన్ బృందం, వానర చిత్రబృందం హీరో అవినాష్ తిరువీదుల, హీరోయిన్ సిమ్రాన్‌చౌదరి సందడి చేసారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ, యువజన ఉత్సవాల నిర్వహణ వెనుక గొప్ప ఉద్దేశం ఉంటుందని, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాల పెంపునకు ఇవి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆరోగ్యం, భావోద్వేగాల సమతుల్యత, మంచి ఆలోచనలు విజయాన్ని అందిస్తాయని చెప్పారు. ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ సెల్ఫ్ ల ర్నింగ్ కెపాసిటీ పెంచుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ, యువజనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని, మంచి అనుభూతులతో సంతోషంగా గడిపారని తెలిపారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, మాట్లాడుతూ విద్యార్థులు విజయవంతంగా ఈ యువజనోత్సవాన్ని నిర్వహించారని, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుదలకు ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై.మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్రీడల్లో పోటీపడుతున్న విద్యార్థులు

సోలార్ కష్టాలకు చెల్లు

(5వ పేజీ తరువాయి)

చేరలేదు. పల్నాడు జిల్లాలో 60వేలు, బాపట్ల జిల్లాలో 50వేల వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి.. కానీ వాటిలో పదో వంతు కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

చార్జీల మోత తగ్గితేనే ప్రయోజనం

పీఎం సూర్యఘర్ పథకం ముఖ్య ఉద్దేశం ఉచిత విద్యుత్, సున్నా చెల్లింపులు. కానీ సోలార్ ప్లాంట్లు పెట్టుకుని.. ప్రతి రోజూ విద్యుత్‌ను తయారు చేసుకుని.. తమ విద్యుత్ తామే వాడుకుంటున్నవారినీ ప్రభుత్వం వీర బాదుడు బాదుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ.. ప్రభుత్వానికి తోడ్పాటు ఇస్తున్నారన్నా.. భావన కూడా లేకుండా భారాన్ని మోపుతోంది. ప్రతి నెలా ప్రభుత్వానికి 100 నుంచి 200 యూనిట్ల విద్యుత్తు ఇస్తున్న వినియోగదారులు కూడా కస్టమర్ చార్జీలు, గ్రిడ్ చార్జీల రూపంలో రూ.300 నుంచి రూ.400 బిల్లులు కట్టాల్సి వస్తోంది. అదే ప్రభుత్వ విద్యుత్ పది యూనిట్లు వాడుకున్నా బిల్లు రూ.400 నుంచి రూ.500కు పెరిగిపోతోంది. విద్యుత్ వినియోగం సున్నా రూపాయలు అయినా.. స్థిర చార్జీలు రూ.30, కస్టమర్ చార్జీలు రూ.30 నుంచి రూ.50, విద్యుత్ సుంకం రూ.1.86, సర్‌చార్జీ రూ.25, గ్రిడ్ చార్జీలు కిలోవాట్‌కు రూ.15 చొప్పున.. ఒకరకం ఎఫ్‌పీపీసీ చార్జీలు రూ.144, రెండో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జీలు రూ.79, కొత్తగా ప్లాంట్ పెట్టుకున్న వారికి మూడో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జీలు మరో రూ.100 అదనంగా కట్టాల్సి వస్తోంది. దీంతో బిల్లు రూ.400 నుంచి రూ.500 వరకూ ఉంటోంది. ఈ భారం కూడా తగ్గితేనే పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యం నెరవేరుతుంది. ఈ భారాన్ని తగ్గించాలని సోలార్ విద్యుత్ వినియోగదారులు చాలాకాలంగా కోరుతున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటేనే రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్ ఎనర్జీ లక్ష్యం నెరవేరుతుంది.

మమ..

(5వ పేజీ తరువాయి)

ప్రధాన నిందితులుగా భానుప్రకాష్, ఆంజనేయులు, రఫీ, వెంకట్ నాయుడు, రామకృష్ణ వర్మ కూడా పాల్గొన్నారు. ముఠా కార్యకలాపాలను విచారించి ఫార్చ్యునర్, ఇన్నోవా ఇలా వివిధ రకరాల కార్లను స్వాధీనం చేసుకున్నారు.

నంబరు ప్లేట్లు మార్చి...

ఈ ముఠా ప్రధానంగా ఫైనాన్స్ కంపెనీల వద్ద రుణంపై కార్లు తీసుకొంటుంది. ఆ వాహనాలకు నంబరు పేట్లు మార్చి, సదరు కంపెనీలు రికవరీ చేసే విధంగా లేకుండా వీటిని తాకట్టు పెడతారు. అలాగే అద్దెకు ఇవ్వడం, విక్రయించడం వంటి కార్యకలాపాలకు పాల్పడ్డారు. మరికొంత మంది వాహనాలను తాకట్టు పెట్టుకుని.. తిరిగి డబ్బు చెల్లించే సమయంలో వహానాలను ఇవ్వకుండా బెదిరించారు. ఈ వహనాల నంబరు ప్లేట్లనూ మార్చేశారు. గ్యాంగ్‌కు సంబంధించి మొత్తం తొమ్మిది మందిని ముద్దాయిలుగా గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రకాష్‌గౌడ్, మోహన్ ఉన్నారు. వీరు ఇద్దరూ తుక్కు కింద విక్రయించిన కార్ల నంబరు పేట్లు, డాక్యుమెంట్లు సేకరించుకొని వాటిని వర్మ అనే వ్యక్తి ద్వారా ముఠాకు విక్రయించారు. ఈ విధంగా గ్యాంగ్ తాకట్టు పెట్టుకున్న, ఫైనాన్స్ తిసుకున్న వహనాలకు నంబరు ప్లేట్లు మార్చేసి విక్రయించారు. ఇలా వచ్చిన డబ్బుతో సరదాలు చేశారు. ఇంకా ఇరిద్దరు పరారీలో ఉన్నారు. వీరు పట్టుబడితే మరి కొన్ని కార్లు పట్టుబడే అవకాశాలు ఉన్నాయి.

ఇద్దరు అధికారులు కార్లు తీసుకున్నారు..

కార్ల కేసును సాంకేతికంగా పోలీసు శాఖ పరిశీలిస్తోంది. తమ శాఖ అధికారులు గ్యాంగ్‌తో సంప్రదింపులు చేశారా.. అన్న అంశాన్ని పరిశీలించారు. ఒక అధికారి 2022లో ఇన్నోవా క్రిటా వహనం తీసుకున్నాడు. ఆ వాహనాన్ని బ్యాంక్ అధికార్లు రికవరీ చేసుకున్నారు. యశ్వంత్ అనే వ్యక్తి తాకట్టు పెట్టిన వాహనాన్ని కూడా ఒక అధికారి వినియోగించడం జరిగింది. గ్యాంగ్ తక్కువ డబ్బుకు కార్లను విక్రయించగా వాటిని ఒకరిద్దరు అధికారులు కొనడం జరిగిందన్న అంశం విచారణలో వెల్లడైంది. వేరే కోణంలో కూడా ఆధారాలు ఉంటే నిందితులను కస్టడీలోకి తీసుకొని విచారించనున్నారు. వెంకట్ నాయుడు తండ్రి ఏఎస్ఐ శ్రీనివాసరావు పాత్రపై పరిశీలిస్తున్నారు. అయనపై ఇంకా ఎటువంటి పిర్యాదు అందలేదని ఎస్పీ తెలిపారు.

ఇదీ విషయం

పెరుగుతో దీర్ఘాయుష్షు

ప్రపంచంలో అతి పెద్ద వయస్కురాలైన 117 ఏళ్ల 'మారియా బ్రాన్యాస్ మొరేరా' దీర్ఘాయుష్షు రహస్యమేంటి? ఈ స్పానిష్ బామ్మగారి ఆరోగ్య రహస్యాన్ని ఛేదించడం కోసం ఆమె ఆరోగ్యాన్నీ, అలవాట్లనూ అధ్యయనం చేసిన పరిశోధకులకు నివ్వెరపోయే ఒక వాస్తవం తెలిసింది.



మెడిటరేనియన్ ఆహారశైలిని అనుసరించడం, దృఢమైన జన్యువులను కలిగి ఉండడంతో పాటు మూడు పూటలా పెరుగు తినే అలవాటు మారియా నిండైన ఆరోగ్యానికి దోహదపడినట్టు తాజాగా పరిశోధకులు కనిపెట్టారు. ఆమెను అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలకు ఆమె పేగుల్లో బైఫైడోబ్యాక్టీరియం అనే బ్యాక్టీరియా ఎక్కువ స్థాయిలో కనిపించింది. సాధారణంగా ఇన్‌ఫ్లమేషన్‌ను అదుపులో ఉంచడంతో పాటు జీర్ణశక్తిని, రోగనిరోధకశక్తినీ మెరుగుపరిచే ఈ బ్యాక్టీరియా పైబడే వయసుతో పాటు క్షీణిస్తుంది. అయితే పెరుగుతో ఈ సూక్ష్మక్రిములు వృద్ధి చెందుతూ ఉంటాయి. కాబట్టి మూడు పూటలా పెరుగు తినే అలవాటు వల్లే ఈ మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతూ బామ్మగారి ఆరోగ్యానికి తోడ్పడినట్టు పరిశోధకులు భావిస్తున్నారు. అలాగని పెరుగుతోనే దీర్ఘాయుష్షు సాధ్యపడుతుందని అనుకోవడం పొరపాటనీ, సమతులాహారం తీసుకోవడంతో పాటు, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో సరదా సమయాలను గడపడం, ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండడం లాంటివి కూడా తోడైనప్పుడే ఆయుష్షు పెరుగుతుందని పరిశోధకులు సూచిస్తున్నారు. పెరుగుతో ఆరోగ్యాన్ని పెంచుకోవాలనుకునేవారు పెరుగుకు అదనపు చక్కెరలకు బదులుగా భోజనంతో కలిపి లేదా పండ్లు, నట్స్‌తో కలిపి తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

స్పోర్ట్స్ కేర్

ఆటలు ఆడాలంటే..!



క్రీడలు కూడా వ్యాయామమే! కాబట్టి జిమ్‌కు బదులుగా క్రీడలను ఎంచుకుంటూ ఉంటాం. అయితే ఎంచుకునే క్రీడ ఏదైనా, అందుకోసం శరీరాన్ని క్రమేపీ సిద్ధం చేయాలంటున్నారు వైద్యులు. కీళ్లు, లిగమెంట్లు, చీలమండల గాయాల బారిన పడకుండా ఉండడం కోసం ఎలాంటి నియమాలు పాటించాలో సూచిస్తున్నారు.

బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్... ఇవన్నీ మనందరికీ తెలిసిన క్రీడలే! ప్రత్యేకించి నేర్చుకుని, సాధన చేయవలసిన అవసరం లేదు. పైగా ఇంటి పరిసరాల్లో, స్నేహితులు, ఇరుగుపొరుగుతో కలిసి ఆడుకోవచ్చు. కాబట్టి ప్రత్యేకంగా వ్యాయామం కోసం సమయం కేటాయించడానికి బదులుగా కాలక్షేపాన్నీ, శారీరక శ్రమనూ అందించే ఈ క్రీడలకు పూనుకుంటూ ఉంటాం. నిజానికి ఈ క్రీడలు కచ్చితంగా ఎంతో కొంత వ్యాయామ ఫలితాన్ని అందిస్తాయన్నది వాస్తవమే అయినా, ఆ క్రీడలకు మన శరీరాలు ఏ మేరకు సంసిద్ధంగా ఉన్నాయన్నది కూడా ఆలోచించుకోవాలి.

30 పుషప్స్, స్క్వాట్స్

ఏ వయసువారైనా ఏ క్రీడనైనా ఎంచుకోవచ్చు. అయితే ఆ ఆటకు శరీరాన్ని సన్నద్ధం చేయడం కోసం కొన్ని ముందు జాగ్రత్త చర్యలు పాటించాలి. అందుకోసం వెన్ను, భుజాలు, మోకాళ్లను బలపరిచే వ్యాయామాలు నెల ముందు నుంచే సాధన చేయడం మొదలుపెట్టాలి. అందుకోసం పుషప్స్, స్క్వాట్స్ మొదలుపెట్టాలి. మొదటి రోజు రెండు పుషప్స్, రెండు స్క్వాట్స్ చొప్పున మూడు రోజులు కొనసాగించి, ఏడో రోజు ఆరు పుషప్స్, ఆరు స్క్వాట్స్‌కు పెంచాలి. తర్వాత 14వ రోజుకు 8 నుంచి 10 పుషప్స్, 10 స్క్వాట్స్, 20వ రోజుకు 15 పుషప్స్, 15 స్క్వాట్స్, 30వ రోజున 30 పుషప్స్, 30 స్క్వాట్స్ చేసే స్థాయికి క్రమేపీ చేరుకోవాలి. ఇలా పుషప్స్ చేయడం వల్ల భుజాలు, నడుము పైభాగం బలపడతాయి. స్క్వాట్స్‌తో మోకీళ్లు, తొడ ముందు, వెనక భాగం, పిక్క కండరాలు, చీలమండలం బలపడతాయి. స్క్వాట్స్ కొత్తగా మొదలుపెట్టిన వాళ్లు మోకాళ్లను 90 డిగ్రీలకు మించి వంచకుండా ఉండడమే మంచిది.



తీవ్రత పెంచుకుంటూ...

క్రీడలకు తగ్గట్టు శరీరాన్ని సన్నద్ధం చేసుకున్నాం కాబట్టి ఇక ఢోకా లేదని అనుకోడానికి వీల్లేదు. మునుపటి వ్యాయామాలతో కీళ్లు, కండరాలు బలపడి ఉండొచ్చు. కానీ గుండె కొట్టుకునే వేగం కూడా క్రీడల్లో కీలకమే! కాబట్టి క్రీడ తీవ్రతను ఒకేసారి కాకుండా కూడా క్రమేపీ పెంచుకోవాలి. మొదటి రెండు వారాల పాటు 15 నిమిషాల పాటు క్రీడలో పాల్గొనాలి. ఆ తర్వాత రెండు వారాల పాటు అరగంట పాటు ఆడి, ఆ క్రీడా సమయాన్ని మూడు నెలలకు గంటకు పెంచుకోవచ్చు.

సప్లిమెంట్లు వాడుకోవచ్చు

అన్ని జాగ్రత్తలు పాటించినా వ్యాయామం సమయంలో నొప్పులు వేధించవచ్చు. 50 ఏళ్లు దాటిన వారిలో ఈ పరిస్థితి సహజం. ఈ కోవకు చెందినవారు కొన్ని సప్లిమెంట్లను వాడుకోవచ్చు.

- **విటమిన్ డి:** 2000 ఇంటర్నేషనల్ యూనిట్స్ విటమిన్ డి మాత్రలను రోజుకొకటి చొప్పున 8 వారాల పాటు వాడుకోవాలి.
- **కొల్లాజెన్:** మెరైన్ కొల్లాజెన్, బొవీన్ కొల్లాజెన్ సప్లిమెంట్లు మూడు నెలల పాటు వాడుకోవడం వల్ల కండరాల నొప్పులు అదుపులోకొస్తాయి

సామాజిక మాధ్యమాలతో తప్పుదోవ

సామాజిక మాధ్యమాల్లో సినీ ప్రముఖులు, క్రీడాకారుల నుంచి ప్రేరణ పొంది క్రీడలను, వ్యాయామాలను అనుసరించకూడదు, అనుకరించకూడదు. ఏ ఇద్దరి శరీరాలూ ఒకేలా ఉండవు. అన్ని శరీరాలూ ఒకే తీవ్రతనూ, శ్రమనూ స్వీకరించలేవు. అలాగే గూగుల్‌నూ, కృత్రిమ మేధస్సునూ ప్రశ్నిస్తూ, అవి అందించే సలహాలు, సూచనలను గుడ్డిగా అనుసరించకూడదు. వాటికి మన ఆరోగ్య సమస్యలూ, శరీర తత్వాలు, స్పందించే తీరులూ తెలియదనే విషయం గుర్తుపెట్టుకోవాలి.

అయితే సమయ నిడివిని నిరవధిక క్రీడా సమయాలుగా పరిగణించాలి. చాలా మంది పది నిమిషాలు ఆడి, కూర్చుని విశ్రాంతి తీసుకుంటారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. ఆగకుండా 15, 30, 60 నిమిషాలు ఆడినప్పుడే ఫలితం దక్కుతుంది.

జిమ్‌లో చేరుతున్నారా?

35 నుంచి 45 ఏళ్ల వయస్కులు మొదటిసారిగా జిమ్‌లో చేరాలని నిర్ణయించుకున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- మనకంటే వయసులో చిన్న శిక్షకులు, మన శరీర సామర్థ్యాన్ని అంచనా వేయలేరు. కాబట్టి మనకంటే పెద్ద వయసు శిక్షకులను ఎంచుకోవాలి
- అనుభవజ్ఞులైన శిక్షకులను ఎంచుకోవాలి
- జిమ్ నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- దుస్తులు, బూట్లు సౌకర్యవంతమైనవి ఎంచుకోవాలి
- 35 ఏళ్లు పైబడినవాళ్లు, కొత్తగా వ్యాయామాలు మొదలుపెట్టినవాళ్లు హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్‌కు దూరంగా ఉండాలి
- గ్రూప్ సెషన్స్‌లో మిగతా వాళ్లతో కలిసి ఒకే తీవ్రతతో వ్యాయామాలు చేయడం కూడా సరి కాదు

ఈ నొప్పుల మీద కన్నేసి

వ్యాయామాల్లో కండరాల ఇబ్బంది సహజం. కానీ కొందర్లో నొప్పి తీవ్రంగా వేధిస్తుంది. ఈ రెండింటికీ తేడా ఉంది. కండరాల ఇబ్బంది సాధారణంగా ఒకట్రెండు రోజుల్లో సర్దుకుంటుంది. కానీ తీవ్రమైన నొప్పి అదుపులోకి రాకపోవచ్చు. నొప్పి తీవ్రంగా ఉన్నా, కదలిక ఇబ్బందికరంగా మారినా మూడు నుంచి నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలి. అప్పటికీ నొప్పి తగ్గనప్పుడు ఒత్తిడి కండరానికి బదులుగా, టెండన్, లిగమెంట్, కీలు మీద పడుతున్నట్టు అర్థం చేసుకోవాలి. అప్పుడు వ్యాయామం చేస్తున్న తీరును సరిచేసుకోవాలి. అవసరాన్ని బట్టి వైద్యులను కలవాలి.

వీళ్లు అప్రమత్తం

రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, యాంకిలోసింజ్ స్పాండిలైటిస్ సమస్యలు ఉన్నవాళ్లలో ముందు నుంచి కీళ్ల నొప్పులు ఉంటాయి కాబట్టి మందులు తీసుకుంటూ, వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. ఈ కోవకు చెందిన వాళ్లు తీవ్రతతో కూడిన క్రీడలు ఆడలేని సందర్భాల్లో ఈతను ఎంచుకోవచ్చు. అలాగే గుండె సమస్యలున్నవాళ్లు క్రీడలకు ముందు వైద్యుల సూచనలు పాటించడం తప్పనిసరి.

డాక్టర్ రవితేజ రెడ్డి కరుమూరి,
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్



చైల్డ్ కేర్

స్నానం దివ్య ఔషదం

పసికందుల స్నానం విషయంలో తల్లులకు ఎన్నో అపోహలుంటాయి. నూనె మర్దన మొదలు, స్నానం చేయించే తీరు గురించి పలువురు పలు సూచనలూ, సలహాలూ ఇస్తూ ఉంటారు. అయితే ఈ విషయంలో వైద్యుల సలహాలను పాటించడం శ్రేయస్కరం.

స్పర్శతో తల్లికీ, బిడ్డకూ మధ్య అనుబంధం బలపడుతుంది. కాబట్టి అర్థం లేని భయాలు, అనుమానాలతో తల్లులు పసికందులకు స్నానం చేయించడానికి వెనకాడకూడదు. నూనె మర్దనతో బిడ్డల జీర్ణశక్తి మెరుగు పడుతుంది. ఒత్తిడి తగ్గి, బరువు పెరుగుతారు. కంటి నిండా నిద్రపోతారు. కాబట్టి తప్పనిసరిగా పసికందులకు నూనెతో మర్దన చేయాలి. అందుకోసం....

- చదునైన, సౌకర్యవంతమైన ప్రదేశంలో బిడ్డను పడుకోబెట్టి, తాజా కొబ్బరినూనెతో మర్దన మొదలుపెట్టాలి. ఆవనూనె, సోయాబీన్ నూనెలు మర్దనకు పనికిరావు
- సున్నితంగా, మృదువుగా తల నుంచి పాదాల వరకూ మర్దన చేయాలి
- మర్దన మొరటుగా కాకుండా సున్నితంగా సాగాలి
- 15 నుంచి 30 నిమిషాల లోపు మర్దన ముగించాలి
- ముఖం మీదా, నోటి చుట్టూరా వేళ్లతో వృత్తాకారంలో మర్దన చేయాలి
- భుజాల నుంచి ఛాతీ వరకూ పైనుంచి కిందకు మర్దన చేయాలి. అరచేతులు, వేళ్లను కూడా మర్దన చేయాలి
- కడుపు మీద కుడి నుంచి ఎడమకు సవ్య దిశలో మర్దన సాగాలి



మర్దన ఎప్పుడు?

- పాలు తాగిన గంట తర్వాత మొదలుపెట్టాలి
- చేతులకు గోళ్లు, ఆభరణాలు ఉండకూడదు
- వేసవిలో స్నానానికి ముందు, చలికాలంలో స్నానం తర్వాత మర్దన కొనసాగాలి
- మౌనంగా కాకుండా బిడ్డతో కబుర్లు చెబుతూ, ఆడిస్తూ మర్దన కొనసాగించాలి

కూడని పనులు

- ముక్కు, చెవుల్లో, బొడ్డులో నూనె పోయకూడదు
- రొమ్ములను పిండకూడదు
- బిడ్డ నలతగా ఉన్నప్పుడు మర్దన చేయకూడదు

స్నానం ఇలా...

- తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు, బొడ్డు ఊడని పిల్లలకు వైద్యులు సూచించనిదే స్నానం చేయించకూడదు
- చలికాలంలో వారానికి రెండు లేదా మూడు స్నానాలు సరిపోతాయి
- నీటి ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెంటీగ్రేడ్ మించకూడదు
- స్వల్ప ఆమ్ల పిహెచ్ కలిగిన సబ్బును ఎంచుకోవాలి. సబ్బు తక్కువ సువాసన కలిగి ఉండాలి
- స్నానం తదనంతరం తువ్వాలుతో సున్నితంగా తుడవాలి. దురుసుగా వ్యవహరించకూడదు
- ముడతల్లో, బాహుమూలల్లో, తడి నిలిచిఉండే ప్రదేశాలన్నీ పొడిగా తుడిచి, పొడి దుస్తులు తొడగాలి.

డాక్టర్ రవళి వోగేలి,
కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్,
ఫెర్నాండెజ్ హాస్పిటల్, హైదరాబాద్

తెలుసుకుందాం

సప్లిమెంట్లు ఎప్పుడు?

కొవిడ్ తర్వాత పోషకాల పట్ల అవగాహన పెరిగింది. ఇది ఒకందుకు మంచిదే! అయితే అవసరం ఉన్నా లేకపోయినా 'హెల్త్ సప్లిమెంట్లు' వాడేసే ధోరణితో ఆరోగ్యం కుదేలయ్యే ప్రమాదం లేకపోలేదు.



సమతులాహారం తీసుకుంటే శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయి. ఇలాంటి ఆహారం తీసుకునే ఆరోగ్యకరమైన వ్యక్తులకు అదనపు పోషకాల అవసరం ఉండదు. కానీ కొంతమంది కాస్త నీరసంగా అనిపించగానే బీ కాంప్లెక్స్ మింగేస్తూ ఉంటారు. ఇంకొందరు మోకాళ్ల నొప్పి పెడితే, క్యాల్షియం తగ్గిందని ఆ సప్లిమెంట్లు వాడేస్తూ ఉంటారు. చర్మం మెరుపు కోసం విటమిన్ ఇ క్యాప్సూల్స్, నిస్సత్తువను వదిలించడం కోసం ఐరన్ మాత్రలు... ఇలా వైద్యుల ప్రమేయం లేకుండా మెడికల్ షాపులో దొరికే హెల్త్ సప్లిమెంట్లను విచ్చలవిడిగా వాడేస్తూ ఉంటాం. ఈ అలవాటుతో మేలు కంటే కీడే ఎక్కువ.

హెల్త్ సప్లిమెంట్లు ఎవరికంటే...

పెద్దలు, దీర్ఘకాలం పాటు మంచానికే పరిమితమైనవాళ్లు, కొన్ని రకాల జబ్బుల కారణంగా విటమిన్ల శోషణ శక్తి కోల్పోయిన రోగులు, బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నవాళ్లు, కొన్ని రకాల ఆహార పదార్థాలను మాత్రమే ఎంచుకుని తినేవాళ్లు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, తల్లి పాలు మానేసిన తర్వాత కేవలం పోత పాల మీదే ఆధారపడే పిల్లలు... వీళ్లందరికీ అదనపు పోషకాలు అవసరమవుతాయి.

వీటితో ప్రమాదం ఎక్కువ

తగు పరిమాణాల్లో విటమిన్లు తీసుకోవటం వల్ల ఆరోగ్యానికి ఎంత ప్రయోజనం ఉంటుందో, ఎక్కువ పరిమాణాల్లో కొన్ని విటమిన్లు తీసుకోవటం వల్ల అంతకంటే రెట్టింపు ప్రమాదమూ ఉంటుంది. కొన్ని విటమిన్లు నీళ్లలో కరిగే స్వభావాన్ని కలిగి ఉంటే, ఇంకొన్ని కొవ్వులో కరిగే స్వభావాన్ని కలిగి ఉంటాయి. బికాంప్లెక్స్ (బి1, బి2, బి6, బి12), విటమిన్ సిలు నీటిలో కరిగే గుణం కలిగి ఉంటాయి. కాబట్టి వీటిని తీసుకున్నా అవి మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతాయి. ఎ, డి, ఇ, కె విటమిన్లు ఫ్యాట్ సాల్యుబుల్. ఇవి శరీరంలోని కొవ్వులో చేరి అక్కడే నిల్వ ఉండిపోతాయి. అవసరం లేకపోయినా వీటిని తీసుకుంటే కొంత పరిధి దాటాక శరీరంలో టాక్సిసిటీ పెరుగుతుంది. ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్లు అవసరానికి మించి శరీరంలో చేరుకుంటే రక్తంలో క్యాల్షియం స్థాయిలు పెరిగిపోతాయి.

ఏ మోతాదుల్లో....

- బి కాంప్లెక్స్: బి కాంప్లెక్స్‌లో బి1, బి2, బి6, బి12 అనే ఎన్నో రకాల వర్గాలున్నాయి. వైద్యులు సూచించే ఈ బికాంప్లెక్స్ పరిమాణం, తీసుకునే ఆహారంలో పొందే బి విటమిన్లతో సమానంగా ఉంటుంది. అంటే ఆహారం ద్వారా 50% బి విటమిన్లు అందితే, మిగతా 50 శాతాన్ని వైద్యులు మందులతో భర్తీ చేస్తారు. కొందరు ప్రత్యేకమైన వ్యక్తులకు నూటికి నూరు శాతం బి కాంప్లెక్స్‌ను మందుల రూపంలోనే వైద్యులు సూచిస్తారు. బి కాంప్లెక్స్ ఎంత వాడాలి? ఎప్పుడు వాడాలి? ఏ పరిస్థితుల్లో వాడాలనేది వైద్యులు నిర్ణయిస్తారు.
- క్యాల్షియం, విటమిన్ డి: మనకు రోజు మొత్తానికి సరిపడా విటమిన్ డితో కలిసిన కాల్షియం పరిమాణం 600 నుంచి 800 మైక్రో యూనిట్లు. గర్భిణులు కూడా కాల్షియంను ఇదే పరిమాణంలో తీసుకోవాలి. అయితే మెనోపాజ్ దశకు చేరుకుని, 65 ఏళ్లు దాటిన మహిళలకు 800 నుంచి 1000 మైక్రో యూనిట్ల కాల్షియం ఇవ్వాలి. మెనోపాజ్ తర్వాత 1200 మైక్రో యూనిట్ల క్యాల్షిం అవసరం పడుతుంది.
- విటమిన్ డి: విటమిన్ డి కలిపిన నూనెలు వాడటం వల్ల శరీరానికి సరిపడా విటమిన్ డి అందుతుంది. అలాగే సూర్యరశ్మి ద్వారా కూడా మన చర్మంలో విటమిన్ డి తయారవుతుంది. కాబట్టి వైద్యులు సూచిస్తే తప్ప ఈ విటమిన్‌ను తీసుకోకూడదు.
- యాంటీ ఆక్సిడెంట్లు: యాంటీ ఆక్సిడెంట్లు తీసుకుంటే క్యాన్సర్ ముప్పు, హృద్రోగాలు తగ్గుతాయనే అపోహలు కూడా ఉన్నాయి. దీన్లో వాస్తవం ఉన్నా అది కొన్ని వర్గాల రోగులకే పరిమితం. తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి వీటి వల్ల కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది. అలాగని తీవ్ర వ్యాధుల నుంచి రక్షణ పొందటం కోసం ప్రతి ఒక్కరూ యాంటీ ఆక్సిడెంట్ల మీద ఆధారపడితే లాభం కంటే నష్టమే ఎక్కువ.

• **డాక్టర్ శ్రీధర్ రెడ్డి,**
జనరల్ ఫిజీషియన్,
హైదరాబాద్

ముత్యాల ముగ్గు



20 చుక్కలు 6వరుసలు 6 వచ్చే వరకు

ఎ. రుక్మిణి అనురాధ,
బుట్టాయగూడెం,
ఏలూరు



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

గుడ్ హెల్త్

కడుపుబ్బరం వదలాలంటే...

కొన్ని ఆహార పదార్థాల మూలంగానే ఈ సమస్య మొదలవుతుంది. కాబట్టి మందుల మీద ఆధారపడకుండా కారణాలను కనిపెట్టాలి. అవసరమైన చిట్కాలు పాటించాలి.



- **పప్పు దినుసులు:** వీటిలో గ్యాలెక్టోలిగోశాక్రైడ్స్, ఫ్రక్టేన్స్ అనే శోషణ చెందని పిండి పదార్థాలుంటాయి. ఇవి పేగుల్లోని బ్యాక్టీరియాతో కలిసి, పులుస్తాయి. దాంతో వాయువులు వెలువడి, కడుపు ఉబ్బరం మొదలవుతుంది.
- **కొన్ని కూరగాయలు, పండ్లు:** కాలీఫ్లవర్, క్యాబేజీ, క్యారెట్‌లలో స్టార్చ్ ఎక్కువ. అలాగే అప్రికాట్, ప్రూన్స్‌లో చక్కెరలు ఎక్కువ. ఇవన్నీ బ్లోటింగ్‌కు దారి తీస్తాయి.
- **పాల ఉత్పత్తులు:** ల్యాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ ఉన్నవాళ్లు పాల ఉత్పత్తులు తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బరం మొదలవుతుంది.
- **స్వీటెనర్లు:** కొందరు పదార్థాల నిల్వకు ఉపయోగించే ఫ్రక్టోజ్‌ను జీర్ణం చేసుకోలేరు. కృత్రిమ తీపి పదార్థాలలో ఉండే సార్బిటాల్ అనే రసాయనం తేలికగా జీర్ణం కాదు. కాబట్టి వీటిని తగ్గించుకోవాలి.

ఉపశమనం ఇలా

- **కామొమైల్ ఆయిల్:** ఈ నూనె పొట్టలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. కాబట్టి ఈ నూనెను పొట్ట మీద రాసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- **జీలకర్ర ఆయిల్:** ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లాంటి సమస్యలకు ఈ నూనె చక్కని విరుగుడు. కాబట్టి ప్రతి రోజూ రాత్రి నిద్రకు ముందు ఈ నూనెతో పొట్టను మర్దన చేయాలి.
- **అల్లం నూనె:** వాయువులు పేగుల గుండా బయటకు వెళ్లిపోడానికి ఈ నూనె తోడ్పడుతుంది. ఈ నూనెను పరగడుపున తీసుకోవాలి
- **పెప్పర్‌మింట్ ఆయిల్:** దీన్లోని యూజెనాల్, థైమాల్ పేగులను ఆరోగ్యంగా ఉంచుతాయి. పేగుల్లో ఆహారం పులిసే ప్రక్రియకు అడ్డు పడతాయి. సమస్య తలెత్తినప్పుడు ఈ నూనెను తీసుకోవచ్చు.

ఫీల్డింగ్ లోపాలకు చెక్ పెట్టాలని..



ఆత్మవిశ్వాసంతో భారత మహిళల జట్టు

సమం కోసం లంక ఆరాటం

రెండో టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళల జట్టు అద్భుత విజయంతో ఆరంభించింది. తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో హర్మన్‌ప్రీత్ సేన అదరగొట్టినా.. ఫీల్డింగ్ మాత్రం పేలవం. ఏకంగా ఐదు క్యాచ్‌లను మన అమ్మాయిలు చేజార్చారు. ఈ నేపథ్యంలో లంకతో మంగళవారం జరిగే రెండో టీ20లో మెరుగైన ఫీల్డింగ్‌తో ఆధిక్యాన్ని మరింతగా పెంచుకోవాలని భారత జట్టు పట్టుదలతో ఉంది. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత హర్మన్‌సేన ఆరు వారాలు విశ్రాంతి తీసుకొంది. ఓ వారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ప్రాక్టీస్ చేసిన అనంతరం బరిలోకి దిగింది. బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ విఫలమైనా.. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ మెరుగైన ప్రదర్శన చేయడంతో భారత్ అలవోకగా నెగ్గింది. పేసర్ క్రాంతి గౌడ్‌తోపాటు స్పిన్నర్లు దీప్తి శర్మ, శ్రీచరణి కట్టుదిట్టంగానే బౌలింగ్ చేశారు. జట్టులోకి కొత్తగా వచ్చిన వైష్ణవి శర్మ వికెట్లు పడగొట్టక పోయినా పొదుపుగా బంతులేసింది. మరోవైపు లంక ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలనుకొంటోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు బ్యాటింగ్‌కు ప్రధాన బలం. మిడిలార్డర్ బ్యాటర్లు విష్మి గుణరత్నే, హర్షిత, హాసిని జట్టుకు అండగా నిలవాల్సి ఉంది.

జట్లు (అంచనా)

భారత్: షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, అరుంధతి, క్రాంతి, వైష్ణవి శర్మ, శ్రీచరణి.

శ్రీలంక: చమరి ఆటపట్టు (కెప్టెన్), విష్మి, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, కవిష దిల్హారి, నీలాక్షి సిల్వా, కౌషిని నుత్యాంగన (వికెట్ కీపర్), ఇనోకా రణవీర, మాల్కి మదార, కవింది, షాషిని గిమ్హాని.

పిచ్/వాతావరణం..

తొలి మ్యాచ్ ఆడినప్పటి పరిస్థితులే ఉన్నాయి. చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కాబట్టి భారీ స్కోర్లు నమోదుకావచ్చు. మంచు ప్రభావం ఉండే అవకాశం ఉండడంతో టాస్ గెలిచిన టీమ్ బౌలింగ్ ఎంచుకోవచ్చు.



సింహాచలం ఆలయ ప్రాంగణంలోని గోదాదేవి అమ్మవారిని సోమవారం దర్శించుకున్న భారత క్రికెటర్లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్‌కౌర్, అరుంధతిరెడ్డి, రిచాఘోష్.

దేశవాళీ మహిళా క్రికెటర్ల ఫీజులు భారీగా పెంపు

న్యూఢిల్లీ: దేశవాళీ పోటీలలో మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు భారీగా పెంచుతూ బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఇకపై సీనియర్ మహిళా క్రికెటర్లు వన్డే, బహుళ రోజుల టోర్నీలలో తుది 11 మంది జట్టులో ఉంటే..రోజుకు రూ. 50 వేలు అందుకుంటారు. ప్రస్తుతం ఇది రూ. 20 వేలుగా ఉంది. రిజర్వ్‌లకు రూ. 25 వేలు (ప్రస్తుతం రూ. 10వేలు) లభిస్తాయి. జాతీయ టీ20 టోర్నీలలో తుది 11 మంది క్రికెటర్లు ఒక్కొక్కరికి రూ. 25వేలు చెల్లిస్తారు. రిజర్వ్‌లకు రూ. 12,500 లభిస్తాయి. అంటే..మహిళా క్రికెటర్లు అన్ని ఫార్మాట్లలో కనుక ఆడితే సీజన్‌కు 12 నుంచి 14 లక్షల వరకు సంపాదిస్తారు. అండర్-23, అండర్-19 క్రికెటర్లకు రోజుకు రూ. 25 వేలు అందుతాయి. రిజర్వ్‌లకు రూ. 12,500 లభిస్తాయి. అంపైర్లు, మ్యాచ్ రెఫరీలకు ఇకపై రోజుకు రూ. 40 వేలు చెల్లిస్తారు. నాకౌట్ మ్యాచ్‌లకు..రోజుకు రూ. 50 నుంచి రూ. 60 వేలు అందుకుంటారు. పెంపు తర్వాత రంజీ ట్రోఫీ లీగ్ పోటీలకు బాధ్యతలు నిర్వర్తించే అంపైర్లకు ఒక్కో మ్యాచ్‌కు రూ. 1.60 లక్షలు లభిస్తాయి. నాకౌట్‌లో మ్యాచ్‌కు రూ. 2.5 లక్షల నుంచి మూడు లక్షల దాకా అందుకుంటారు.

క్రికెట్‌కు కృష్ణప్ప గౌతమ్ గుడ్‌బై

బెంగళూరు: ఐపీఎల్ స్టార్ కృష్ణప్ప గౌతమ్ క్రికెట్ అన్ని ఫార్మాట్లకు సోమవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. కర్ణాటకకు చెందిన 37 ఏళ్ల ఆల్‌రౌండర్ 14 ఏళ్లపాటు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడాడు. ఆఫ్ స్పిన్నర్ గౌతమ్ 2021లో భారత్ తరపున ఒకే ఒక వన్డే ఆడాడు. టీ20 స్పెషలిస్ట్ అయిన కృష్ణప్ప ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

జాతీయ బాల పురస్కార్‌కు శివాని



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెట్ శివాని ఎంపికైంది. కర్నూలు జిల్లా, మద్దికెర గ్రామం శివాని స్వస్థలం. హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శివాని పారా అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో గత నాలుగేళ్లగా శివాని కనబరుస్తున్న ప్రతిభ ఆధారంగా ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 26వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా శివాని ఈ పురస్కారాన్ని అందుకోనుంది.

ఆ ఓటమితో రిటైర్ కావాలనుకున్నా



రోహిత్ శర్మ

న్యూఢిల్లీ: మూడేళ్ల క్రితం స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో ఓటమి తననెంతో కుంగదీసిందని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. 2023లో జరిగిన ఆ మెగా టోర్నమెంట్‌లో రోహిత్ కెప్టెన్సీలో టీమిండియా అద్భుత ప్రదర్శనతో తుది పోరుకు దూసుకొచ్చింది. కానీ టైటిల్ ఫైట్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. 'ఆ మ్యాచ్ నా నుంచి అన్నీ తీసుకుపోయిందని అనిపించింది' అని గుర్గావ్‌లో మాస్టర్స్ యూనియన్ కార్యక్రమంలో మాట్లాడుతూ రోహిత్ పేర్కొన్నాడు. '2023 ప్రపంచ కప్ ఫైనల్ ఓటమితో తీవ్ర నిరాశకు లోనయ్యా. ఇకపై క్రికెట్ ఆడకూడదని నిర్ణయించుకున్నా' అని వెల్లడించాడు. 'ఆ పరాజయభారం నుంచి కోలుకొనేందుకు కొంత సమయం పట్టింది. నేను అమితంగా ప్రేమించే ఆటను వీడడమా అని పదే పదే ప్రశ్నించుకున్నా. జీవితం ఇంతటిలో ముగిసిపోలేదని, అవకాశాలు ఇంకా మిగిలి ఉన్నాయని నచ్చజెప్పుకొన్నా. దాంతో నెమ్మదిగా కోలుకున్నా. శక్తినంతా కూడదీసుకొని మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టా' అని రోహిత్ వివరించాడు. 'వరల్డ్ కప్ గెలవడం నా ప్రధాన లక్ష్యం. అది టీ20 ప్రపంచకప్ కావొచ్చు లేదా 2023 వరల్డ్ కప్ కావొచ్చు. కానీ అది జరగలేదు. మేమేకాదు అంతా నిరాశకు గురయ్యారు. జరిగిందేమిటో మాకు అంతుబట్టలేదు. వ్యక్తిగతంగానూ అది నాకు క్లిష్ట సమయం. ఎందుకంటే 2023 వరల్డ్ కప్ కోసం నేను ఎంతో కష్టపడ్డా. 2022లో నేను సారథ్య బాధ్యతలు చేపట్టినుంచే ప్రపంచ కప్ కోసం సమాయత్తమయ్యా' అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

'హజారే' బరిలో గిల్, అభిషేక్, అర్ష్‌దీప్

ముంబై జట్టులో సూర్యకుమార్, శివమ్ దూబే

జార్ఖండ్ సారథిగా ఇషాన్ కిషన్

చండీగఢ్: టీమిండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్‌లు విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగనున్నారు. తాజాగా ప్రకటించిన పంజాబ్ జట్టులో వీరికి చోటు దక్కింది. టీ20 వరల్డ్‌కప్‌లో అభిషేక్‌కు స్థానం లభించగా.. గిల్‌పై వేటుపడిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 11 నుంచి న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో గిల్, పేసర్ అర్ష్‌దీప్ రెండు లేదా మూడు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉండే అవకాశం ఉంది. బుధవారం నుంచి విజయ్ హజారే జరగనుంది. ఇక, టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే ముంబై తరపున చివరి రెండు మ్యాచ్‌ల్లో ఆడనున్నారు. యశస్వీ జైస్వాల్ కూడా ముంబై జట్టులో కొన్ని మ్యాచ్‌లు ఆడతాడని సమాచారం. మరోవైపు, టీ20 వరల్డ్‌కప్ జట్టులో స్థానం దక్కించుకొన్న ఇషాన్ కిషన్.. హజారే టోర్నీలో జార్ఖండ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జాతీయ జట్టు మ్యాచ్‌లు లేనప్పుడు ఆటగాళ్లంతా దేశవాళీ టోర్నీలో కచ్చితంగా ఆడాలని బీసీసీఐ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా తమ జట్ల తరపున ఈ టోర్నీ బరిలో నిలవనున్నారు.

పాక్ కుర్రాళ్లకు భారీ నజరానా

కరాచీ: అండర్-19 ఆసియా కప్ గెలిచిన పాకిస్థాన్ జట్టుకు ఆ దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్ భారీ నజరానాను ప్రకటించారు. విజేతగా నిలిచిన పాక్ యువ జట్టుకు షాబాజ్ సోమవారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒక్కో ఆటగాడికి కోటి (పాక్ కరెన్సీ) రూపాయలను ప్రకటించారు.



సిరీస్ కివీస్ వశం

మూడో టెస్ట్‌లో విండీస్ ధమాల్

మౌంట్ మాంగనుయ్: వెస్టిండీస్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 2-0తో సొంతం చేసుకొంది. జాకబ్ డఫీ (5/42) నిప్పులు చెరగడంతో మూడో టెస్ట్‌లో కివీస్ 323 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. తొలి టెస్ట్ డ్రా కాగా.. రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిచింది. 462 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఆఖరి, ఐదో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 43/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించి విండీస్ 138 పరుగులకే కుప్పకూలింది. బ్రాండన్ కింగ్ (67) మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటాన్ని కూడా ప్రదర్శించలేదు. న్యూజిలాండ్ 575/8 డిక్లేర్, 306/2 డిక్లేర్ చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 420 పరుగులు చేసింది.

ఫైనల్లో సింధు బృందం

ఘనంగా ప్రారంభమైన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు



విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఇక్కడి చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ స్టార్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ పోటీపడుతున్న ఈ టోర్నీలో తొలి రోజు టీమ్ విభాగంలో మ్యాచ్‌లు నిర్వహించారు. ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు మహిళల టీమ్ విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సింధు సారథ్యంలోని ఏపీ జట్టు సెమీఫైనల్లో గుజరాత్‌ను ఓడించింది. పురుషుల టీమ్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్ నేతృత్వంలోని ఏపీ జట్టు క్వార్టర్‌ఫైనల్లో తమిళనాడు చేతిలో ఓటమిపాలైంది. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ భరణి, శాప్ మాజీ ఛైర్మన్ అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది ఐటీ నియామకాల్లో 16% వృద్ధి

వర్క్‌ఫోర్స్, క్వెస్ కార్ప్ నివేదిక విడుదల



ముంబై: ఈ ఏడాది దేశీయ ఐటీ రంగం కాస్త కోలుకుందని ఓ నివేదిక పేర్కొంది. 2025లో ఐటీ ఉద్యోగ నియామకాలు 18 లక్షలకు చేరాయని, గత సంవత్సరంతో పోలిస్తే ఇది 16 శాతం అధికమని సోమవారం విడుదలైన 'ఐటీ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్ ఇన్ ఇండియా 2025' నివేదిక వెల్లడించింది. టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ క్వెస్ కార్ప్, వర్క్ ఫోర్స్ సంయుక్తంగా దీన్ని రూపొందించాయి. మరిన్ని విషయాలు..

- భారత ఐటీ రంగ నియామకాల్లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) వాటా గణనీయంగా పెరిగింది. 2024లో నమోదైన 15 శాతం నుంచి ఈ ఏడాదిలో 27 శాతానికి చేరుకుంది.
- ప్రొడక్ట్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (ఎస్‌ఏఏఎస్) సంస్థల్లోనూ ఎంపిక చేసిన విధుల్లో హైరింగ్ పెరగగా.. ఐటీ సేవలు, కన్సల్టింగ్ విభాగంలో స్వల్ప వృద్ధి నమోదైంది. ఫండింగ్ తగ్గడంతో స్టార్టప్‌ల నియామకాల వృద్ధి ఏక అంకెకు జారుకుంది.
- ఫ్రెషర్స్‌తో పోలిస్తే అనుభవజ్ఞులకే అధిక డిమాండ్ కన్పించింది. ఈ ఏడాది మొత్తం నియామకాల్లో 4-10 ఏళ్ల అనుభవం కలిగిన వారి వాటానే 65 శాతంగా ఉంది. 2024లో ఈ వాటా 50 శాతంగా నమోదైంది.
- 2025లో ఎంట్రీ లెవల్ ఉద్యోగుల హైరింగ్ వాటా 15 శాతంగా ఉండగా.. కాంట్రాక్టు ఉద్యోగుల వాటా 10-11 శాతంగా నమోదైంది.
- కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు కంపెనీల నుంచి బలమైన డిమాండ్ కన్పించింది.
- 2026లోనూ ఐటీ ఉద్యోగ నియామకాల జోరు కొనసాగనుందని, ముఖ్యంగా డిజిటల్ నైపుణ్యాలకు డిమాండ్ అధికంగా ఉండనుందని నివేదిక పేర్కొంది. ఐటీ హైరింగ్ ద్వితీయ శ్రేణి నగరాల పరిధి దాటి విస్తరించనుంది. నియామకాల డిమాండ్ ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డేటా స్పెషలిస్ట్ విభాగాల మధ్య కేంద్రీకృతం కానుంది. బీఎఫ్ఎస్ఐ, ఎస్ఏఏఎస్, టెలికాం, మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో ఐటీ నిపుణుల గిరాకీ పెరగనుంది.
- వచ్చే ఏడాది హైరింగ్‌లో కంపెనీలు మానవ వనరుల విస్తరణ కంటే సామర్థ్యం ఆధారిత వృద్ధిపై దృష్టి సారించనున్నాయి.

29 శాతం పెరిగిన ఉద్యోగ అర్జీలు

ఈ సంవత్సరంలో జాబ్ అప్లికేషన్లు (ఉద్యోగ అర్జీలు) 9 కోట్లు దాటాయని, గత ఏడాదితో పోలిస్తే 29 శాతం పెరిగాయని జాబ్ పోర్టల్ అప్నా.కో సోమవారం విడుదల చేసిన 'ఇండియా ఎట్ వర్క్ 2025' నివేదిక వెల్లడించింది. మహిళలు, ఫ్రెషర్ల నుంచి అప్లికేషన్లు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. 2024తో పోలిస్తే ఈ ఏడాది మహిళల నుంచి ఉద్యోగ అర్జీలు 36 శాతం పెరిగాయని.. ముఖ్యంగా ఫైనాన్స్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్, హెల్త్‌కేర్ సపోర్ట్ ఉద్యోగాలకు వీరి నుంచి అధిక అప్లికేషన్లు వచ్చినట్లు రిపోర్టు తెలిపింది. ఫ్రెషర్ల అప్లికేషన్లు కూడా వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగాయని వెల్లడించింది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,35,280	1,24,000	2,30,000
విజయవాడ	1,35,000	1,22,000	2,15,000
విశాఖపట్నం	1,38,350	1,24,800	2,31,000
రాజమండ్రి	1,36,150	1,24,800	2,12,000
ప్రొద్దుటూరు	1,35,400	1,24,570	2,00,800
ముంబై	1,33,970	1,22,717	2,07,727



జోస్ అలుక్కాస్ ప్రచారకర్తగా దుల్కర్ సల్మాన్

హైదరాబాద్: భారత్‌లోని అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల సంస్థల్లో ఒకటైన జోస్ అలుక్కాస్.. తన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్‌ను నియమించుకుంది. తెలుగు, మలయాళం, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న దుల్కర్ సల్మాన్ ప్రచారంతో జోస్ అలుక్కాస్ వినియోగదారులకు మరింత చేరువ కానుందని జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కాస్, పాల్ అలుక్కాస్, జాన్ అలుక్కాస్ తెలిపారు. జువెలరీ రంగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా ఉన్న జోస్ అలుక్కాస్‌కు ప్రచారం నిర్వహించటం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ అన్నారు.

సిప్లా నుంచి ఓరల్ ఇన్సులిన్

న్యూఢిల్లీ: మధుమేహ రోగుల్లో నోటి ద్వారా ఇన్‌హేల్ చేయడానికి అవకాశం ఉన్న ఇన్సులిన్ పౌడర్ 'అఫ్రెజా'ను విడుదల చేసినట్టు ఔషధ దిగ్గజం సిప్లా ప్రకటించింది. దీని తయారీకి కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) గత ఏడాది అనుమతి ఇచ్చింది. ఇంజెక్షన్ ద్వారా తీసుకునే ఇన్సులిన్‌కు ఇది ప్రత్యామ్నాయమే కాకుండా నోటితో ఇన్‌హేల్ చేయడం వల్ల త్వరగా పని చేస్తుందని సిప్లా తెలిపింది. దీన్ని ఒక్కసారి ఇన్‌హేల్ చేసి పారేయడానికి అనువైన కాట్రిడ్జ్‌ల రూపంలో విక్రయిస్తారు. దాన్ని ఇన్‌హేలర్ డివైస్ ద్వారా ఉపయోగించాల్సి ఉంటుందని సిప్లా వెల్లడించింది.

7.15% వడ్డీకే గృహ రుణాలు

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: గృహ రుణాలపై వడ్డీ రేట్ల కోత కొనసాగుతోంది. తాజాగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కూడా ఈ జాబితాలో చేరింది. మంచి పరపతి స్కోరు ఉన్న గృహ కొనుగోలుదారులకు కొత్తగా ఇచ్చే గృహ రుణాలపై వసూలు చేసే కనీస వడ్డీ రేటును 7.15 శాతానికి తగ్గించింది. సోమవారం నుంచే ఈ తగ్గింపు అమలు చేస్తున్నట్టు తెలిపింది. ఈ నెల 5న ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధానంలో ఆర్‌బీఐ కీలక రెపో వడ్డీ రేటును పావు శాతం తగ్గించింది. దాంతో బ్యాంకులు, గృహ ఫైనాన్స్ కంపెనీలు వరుసపెట్టి తమ గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్నాయి.

గోల్డ్, సిల్వర్ సరికొత్త రికార్డు

- పది గ్రాముల బంగారం రూ.1.38 లక్షలు
- రూ.2.14 లక్షలు దాటిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ: విలువైన లోహాల ధరలు సోమవారం సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.1,685 పెరిగి రూ.1,38,200కు చేరుకుంది. కిలో వెండి ఏకంగా రూ.10,400 ఎగబాకి రూ.2,14,500కు పెరిగింది. అంతర్జాతీయంగానూ వీటి రేట్లు కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరడమే ఇందుకు ప్రధాన కారణమని బులియన్ మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 80.85 డాలర్లు లేదా 1.86 శాతం వృద్ధితో 4,420.35 డాలర్లు పలికింది. సిల్వర్ 2.31 డాలర్లు లేదా 3.44 శాతం పెరుగుదలతో 69.45 డాలర్లకు చేరింది. ప్లాటినం కూడా 5.4 శాతం ఎగబాకి 17 ఏళ్లకు పైగా గరిష్ఠ స్థాయి 2,079.25 డాలర్లకు, పల్లాడియం 2.7 శాతం వృద్ధితో దాదాపు మూడేళ్ల గరిష్ఠ స్థాయి 1,759 డాలర్లకు పెరిగింది.

స్థూల ఆర్థిక గణాంకాలకు కొత్త సీరీస్

న్యూఢిల్లీ: ప్రభుత్వం విడుదల చేసే స్థూల ఆర్థిక గణాంకాలన్నింటికీ కొత్త సీరీస్‌ను కొత్త సంవత్సరంలో విడుదల చేయనున్నట్టు గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) ప్రకటించింది. జాతీయ గణాంకాలకు, రిటైల్ ద్రవ్యోల్బణానికి బేస్ సంవత్సరాన్ని మార్చుతూ కొత్త సీరీస్ ఫిబ్రవరిలోను, పారిశ్రామికోత్పత్తికి కొత్త సీరీస్‌ను వచ్చే మే నెలలోను విడుదల చేయనున్నట్టు తెలిపింది. సీపీఐకి బేస్ సంవత్సరం (2024=100) మార్చుతూ కొత్త గణాంకాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న తొలిసారిగా విడుదల చేయనున్నారు. అలాగే 2022-23 బేస్ సంవత్సరంగా జాతీయ గణాంకాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న విడుదల చేయనున్నారు.

బొండాడకు రూ.945 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యువబల్స్ లిమిటెడ్ (ఎన్ఐఆర్ఎల్) నుంచి రూ.945 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఎన్ఐఆర్ఎల్‌కు చెందిన ఆర్‌వీయూఎన్ఎల్ సోలార్ పార్క్‌లో 810 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్ పనులు చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. ఎల్ఓఏ ఆమోదించిన నాటి నుంచి 15 నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

షేరు.. హుషారు

- 638 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- మళ్లీ 26,100 ఎగువ స్థాయికి నిఫ్టీ
- రూ.4.11 లక్షల కోట్ల సంపద వృద్ధి
- 2 రోజుల్లో రూ.10 లక్షల కోట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 638.12 పాయింట్ల వృద్ధితో 85,567.48 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 206 పాయింట్లు బలపడి 26,172.40 వద్ద ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీ నేపథ్యంలో ట్రేడర్లు ఐటీ, వాహన, లోహ రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ మరో రూ.4.11 లక్షల కోట్లు పెరిగి రూ.475.32 లక్షల కోట్లకు (5.31 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గత శుక్రవారం సెన్సెక్స్ 447.55 పాయింట్లు, నిఫ్టీ 150.85 పాయింట్లు పెరిగాయి. దాంతో మార్కెట్ సంపద రూ.5.42 లక్షల కోట్లు పుంజుకుంది. అంటే, రెండు సెషన్లలో రూ.9.53 లక్షల కోట్ల వృద్ధి నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 26 లాభపడ్డాయి.

భారత్ బయోటెక్‌తో బయోఫ్యాబ్రి జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్షయ (టీబీ) వ్యాధి చికిత్సలో ఉపయోగించే రెండు వ్యాక్సిన్లలో ఒకటైన ఎంటీబీవీఏసీ టెక్నాలజీ బదిలీకి సంబంధించి భారత్ బయోటెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు వ్యాక్సిన్ తయారీ కంపెనీ బయోఫ్యాబ్రి ప్రకటించింది. ఎంటీబీవీఏసీ ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ దశలోకి చేరింది. దీనిపై 2022 సంవత్సరంలోనే ఉభయ సంస్థల మధ్య లైసెన్సింగ్ ఒప్పందం కుదిరింది. ఇప్పుడు టెక్నాలజీ బదిలీకి దాన్ని విస్తరించడంతో భారత్ బయోటెక్ ప్లాంట్లలో ఎంటీబీవీఏసీ తయారీకి మార్గం సుగమం అవుతుందని బయోఫ్యాబ్రి తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా భారత్ బయోటెక్ ఎంటీబీవీఏసీ వ్యాక్సిన్ తయారీకి, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో క్షయ వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 70కి పైగా దేశాల్లో దాని పంపిణీకి భరోసా ఇస్తుంది.

కోరమాండల్ నుంచి ఫెర్టినెక్స్ ఎరువు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొక్కలకు పోషక విలువలు అందించడంతో పాటు భూసారాన్ని కాపాడేందుకు ఉపయోగపడే నీటిలో కరిగిపోయే ఎరువు "ఫెర్టినెక్స్"ను మార్కెట్లో విడుదల చేసినట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలిపింది. పళ్లు, కూరగాయలు, పప్పులు, ఉద్యాన పంటలకు దీన్ని ఉపయోగించవచ్చని పేర్కొంది. కంపెనీ సీఈఓ, ఎండీ శంకర సుబ్రమణియన్ తొలి బ్యాచ్ ఫెర్టినెక్స్ రవాణా వాహనానికి విశాఖ ప్లాంట్‌లో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.

సెన్నా కోర్‌లో రూ.645 కోట్ల పెట్టుబడి

మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడికల్ డివైస్‌ల తయారీలోని సెన్నా కోర్ మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో రూ.645 కోట్ల పెట్టుబడితో మైనారిటీ వాటా కొనుగోలు చేసినట్టు మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ ప్రకటించింది. సెన్నా కోర్ ఈ మొత్తాలను ఉత్పత్తుల అభివృద్ధికి, ప్రపంచ విస్తరణకు ఉపయోగిస్తుంది. ఈ కంపెనీకి చెందిన ఎలక్ట్రోలైట్ అనలైజర్లను 40 వేలకు పైగా ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ లాబ్స్‌లోను ఉపయోగిస్తున్నారు. 78కి పైగా దేశాలకు పైగా ఎగుమతి చేస్తోంది. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారం ప్లాంట్‌లో ఈ కంపెనీ వివిధ రకాల వైద్య పరికరాలు ఉత్పత్తి చేస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 23వ తేదీ			
హైదరాబాద్	675	విజయవాడ	720
వరంగల్	677	గోదావరి	695
చిత్తూరు	703	విశాఖపట్నం	702
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	140
కరీంనగర్	142	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	134
కర్నూలు	142	నెల్లూరు	139
విశాఖపట్నం	121	అనంతపురం	139
గోదావరి	135		

మే 12 నుంచి ఈఏపీసెట్

» మే 4న లాసెట్, ఎడ్‌సెట్.. పలు ప్రవేశ పరీక్షల షెడ్యూలు విడుదల

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే 2026-27 విద్యా సంవత్సరంలో పలు కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూలును ఉన్నత విద్యామండలి సోమవారం విడుదల చేసింది. ఇంజనీరింగ్ అడ్మిషన్ల కోసం ఈఏపీసెట్‌ను వచ్చే ఏడాది మే 12 నుంచి 18వ తేదీన మధ్య ఐదు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపింది. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్ పరీక్షలు 19, 20 తేదీల్లో జరుగుతాయని వెల్లడించింది. ఈ ఏడాది మే 19న ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కాగా, వచ్చే ఏడాది వారం ముందుగానే పరీక్షలు నిర్వహించేలా ఉన్నత విద్యామండలి ప్రణాళిక రూపొందించింది. అలాగే త్వరలో అడ్మిషన్ల షెడ్యూల్‌ను కూడా ప్రకటించేందుకు సన్నద్ధమవుతోంది. ఆలస్యం జరుగుతుందనే విమర్శలు రాకుండా వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తు చర్యలు చేపట్టింది. కాగా ఎడ్‌సెట్, లాసెట్ మినహా మిగిలిన అన్ని ప్రవేశ పరీక్షలు రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతాయి.

ప్రవేశ పరీక్షల షెడ్యూలు ఇదీ..

ప్రవేశ పరీక్ష	నిర్వహణ తేదీలు	సెషన్లు
ఈసెట్	ఏప్రిల్ 23	2
ఐసెట్	ఏప్రిల్ 28	2
పీజీఈసెట్	ఏప్రిల్ 29, 30, మే 2	6
లాసెట్	మే 4	1
ఎడ్‌సెట్	మే 4	1
పీజీసెట్	మే 5, 8- 11	10
ఈఏపీసెట్ (ఇంజనీరింగ్)	మే 12- 15, 18	10
ఈఏపీసెట్ (అగ్రి, ఫార్మసీ)	మే 19, 20	4

స్వాప్ కోటాలో వీఏఏ, వీహెచ్‌ఏల బదిలీలు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీవిత భాగస్వామి(స్పౌజ్) కోటా కింద గ్రామ, వార్డు సచివాలయాల ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న గ్రామ వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులకు అంతర జిల్లా బదిలీలు జరిగాయి. 35 మంది వ్యవసాయ సహాయకు(వీఏఏ)లు, 11 మంది ఉద్యాన సహాయకు(వీహెచ్ఏ)లను బదిలీ చేసింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగాచ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పశుసంవర్ధకశాఖ కార్యదర్శిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యాయవాదులకు 5.60కోట్ల ఆర్థిక ప్రయోజనాలు

» ఏపీ న్యాయవాదుల సంక్షేమనిధి కమిటీ కీలక నిర్ణయాలు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్, వైద్యఖర్చులు, పదవీ విరమణ ప్రయోజనాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సమావేశమైన ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ పలు నిర్ణయాలు తీసుకుంది. బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ సమావేశంలో సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నరసింగ రావు, ఏపీ హైకోర్టు, న్యాయశాఖ ప్రతినిధులు హాజరయ్యారు. ఇటీవల మరణించిన 54 మంది న్యాయవాదుల కుటుంబ సభ్యులకు రూ 3.51కోట్లు, వైద్య ఖర్చుల నిమిత్తం 137మంది న్యాయవాదులకు రూ 1.90 కోట్లు, పదవీ విరమణ ప్రయోజనం కింద ఏడుగురు న్యాయవాదులకు రూ.19.20 లక్షలు వెరసి.. రూ 5.60 కోట్లు మంజూరు చేసింది.

దళారులను నమ్మి మోసపోవద్దు: సమగ్రశిక్ష ఎస్పీడీ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ ట్రైనర్ల పేరుతో సమగ్రశిక్ష నేరుగా ఎవరినీ విధుల్లోకి తీసుకోవడం లేదని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. వృత్తి విద్య కోర్సుల బోధనకు థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా మాత్రమే ట్రైనర్లు పరిమిత కాలానికి నియమితులవుతున్నారని వివరించారు. వృత్తి విద్య కోర్సు ట్రైనర్లతో సమగ్రశిక్షకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు దళారుల ప్రలోభాలకు గురై మోసపోవద్దని సూచించారు.

తాట తీస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదం మోపోతున్నారు. యోగి తరహాలో ఎన్‌కౌంటర్లు చేయడం, బుల్డోజర్లు పంపడం వంటివి కాకపోయినా కఠిన చర్యలు ప్రారంభమయ్యాయి. రౌడీలు, అసాంఘికశక్తులకు వణుకు పుట్టిస్తున్నారు. ఇటీవల తీవ్రమైన నేరాల విషయంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. తాజాగా అనంతపురంలో కత్తితో దాడిచేసిన ఓ రౌడీకి పోలీసులు తమ మార్క్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లో ఒక వైన్ షాపు వద్ద ఆదివారం రాత్రి గొడవ జరిగింది. మద్యం కావాలని అడిగిన రాజా అనే వ్యక్తిపై రౌడీ అజయ్ కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి పారిపోయాడు. సోమవారం ఉదయం అజయ్‌ను పట్టుకునేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఎస్ఐ ఆటోలో వెళ్లగా.. అతడు పొదల్లోకి పారిపోయాడు. కాసేపటి తర్వాత బయటికి వచ్చి పోలీసుల్ని తీసుకొచ్చాడన్న కోపంతో ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేశాడు. ఆటో డ్రైవర్ పొట్టలో నుంచి పేగులు బయటికి వచ్చేలా పొడిచి పరుగు తీశాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జగదీశ్ ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. గాలించేందుకు వెళ్లిన సీఐపైనా అజయ్ కత్తితో దాడి చేసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. సీఐ రివాల్వర్ బయటికి తీసి, కొస్త దూరం వెంబడించి అజయ్ కాల్లోకి బుల్లెట్ దించడంతో కింద పడ్డాడు. రెచ్చిపోయి అలజడులు సృష్టిస్తాం.. కత్తులు తీసి దాడులకు తెగబడతామంటే అంతే కఠినంగా దండిస్తామని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ రౌడీలను హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఎవరైనా భయోత్పాతాన్ని సృష్టించినా.. హద్దులు మీరి ప్రవర్తిస్తూ పోలీసులపైనే దాడులు చేసినా తీవ్రంగా స్పందిస్తామని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో 2,599 మందిపై రౌడీ షీట్లు ఉన్నాయని, శాంతిభద్రతలు ఉల్లంఘిస్తే ఎవరినీ వదలబోమని స్పష్టం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే జగన్ పుట్టినరోజు వేడుకలలో మూగజీవాలను బలి ఇచ్చి, ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేసిన 26 మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 13 మందిని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. మరో ముగ్గురిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేశారు. కొన్ని చోట్ల ఫ్లెక్సీలపై '2029లో రప్పా రప్పా' అని రాయించారు. నిందితులు వేట కొడవళ్లు చేత పట్టుకుని చిందులు వేశారు. ఓ గ్రామంలో 'రప్పా రప్పా..' అంటూ కేకలు వేశారు.

రేపిస్టులకు దండన.. ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డలపై అత్యాచారానికి పాల్పడేవారికి అవే చివరి రోజులు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో హెచ్చరించారు. చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు రేపిస్టుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇవ్వడమే గాక రోడ్లపై నడిపించి తీసుకెళ్తున్నారు. అనకాపల్లి జిల్లాలో ఇటీవల మైనర్ బాలికను తోటలోకి తీసుకెళ్లి వృద్ధుడు (సమీప బంధువు) అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కోర్టుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి అంటూ వాహనం దిగి చెరువులో దూకేశాడు. మరుసటి రోజు శవమై కనిపించాడు.


అత్యాచార కేసులో నిందితులను చిత్తూరులో రోడ్లపై నడిపించుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు


నెల్లూరు లో రౌడీషీటర్లతో ప్రమాణం చేయిస్తున్న పోలీసులు

నెల్లూరులో రౌడీలపై భరతం

ప్రశాంతంగా ఉండే జిల్లాగా పేరున్న నెల్లూరులో గత వైసీపీ ప్రభుత్వంలో రౌడీల సంఖ్య బాగా పెరిగింది. పురుషులతో పోటీ పడి మహిళలు సైతం ఇక్కడ డాన్లుగా తయారయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వందల మంది రౌడీలపై ఉక్కుపాదం మోపింది. గ్యాంగ్‌లు ఏర్పాటు చేసి దందాలు, బెదిరింపులకు పాల్పడుతున్న నిడిగుంట అరుణను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె అరాచకాలకు సంబంధించి ఆధారాలన్నీ సేకరించి పీడీ యాక్టు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదే సమయంలో నెల్లూరులో జరిగిన సీపీఎం నాయకుడి హత్యలో అరవ కామాక్షి అనే మరో మహిళను అరెస్ట్ చేశారు. జిల్లాలోని మొత్తం రౌడీలందరినీ వెతికి వెతికి రోడ్లపై నడిపిస్తున్నారు. ఆ మధ్య తెనాలిలో గంజాయి బ్యాచ్‌ను నడిరోడ్డుపై పోలీసులు లాఠీలతో దండించిన వీడియోలు మరోమారు వైరల్ అవుతున్నాయి. అమాయకులు, ఆడవాళ్లపై అఘాయిత్యాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నెటిజెన్లు కామెంట్లు పెడుతున్నారు.

ఉక్కు యాజమాన్యానికి షాక్!

ఉత్పత్తి ఆధారిత వేతనాలపై డీపీఈ సీరియస్

సరైన చర్యలు చేపట్టాలని ఉక్కు మంత్రిత్వ శాఖకు ఆదేశం

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు నిర్దేశిత ఉత్పత్తి ఆధారంగా జీతాలు ఇవ్వాలని విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) సీరియస్‌గా స్పందించింది. ఇటీవల స్టీల్‌ప్లాంటులో 92 శాతం ఉత్పత్తి సాధించాలని యాజమాన్యం లక్ష్యం నిర్దేశించింది. వివిధ విభాగాల్లో సమస్యల వల్ల అది సాధ్యం కాలేదు. ఉద్యోగులకు జీతాల్లో కోత పెడితే తప్ప సరైన ఫలితాలు రావని భావించిన యాజమాన్యం నవంబరు 15వ తేదీన ప్రత్యేక ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి విభాగానికీ ఉత్పత్తి లక్ష్యాలు నిర్దేశించామని, వాటిని 100 శాతం సాధిస్తే పూర్తి జీతం ఇస్తామని, ఎంత తగ్గితే ఆ మేరకు జీతాల్లో కోత వేస్తామని స్పష్టంచేసింది. నవంబరు నెల జీతాలు ఆ విధంగానే పంపిణీ చేసింది. ఆ నెలలో 19 శాతం ఉత్పత్తి తగ్గింది. ఆ ప్రకారం విభాగాల వారీగా లెక్కించి జీతాలు ఇచ్చింది. నెలకు లక్ష రూపాయల జీతం తీసుకునే ఉద్యోగికి రూ.19 వేలు కోత పడింది. దీనిని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ ఇలా ఉత్పత్తి ఆధారిత జీతాలు లేవంటూ సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా యాజమాన్యం వెనక్కి తగ్గలేదు. దీంతో స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఢిల్లీ వెళ్లి డీపీఈలో అధికారులను కలిసింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నా, తగ్గించాలన్నా... డీపీఈ అనుమతి ఉండాలని, విశాఖ ఉక్కు యాజమాన్యం నిర్ణయాన్ని మీరు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. తాము జీతాల తగ్గింపుపై ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదని అక్కడి అధికారులు తెలపడంతో వెంటనే సంఘం నాయకులు అక్కడికక్కడే డీపీఈకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీపీఈ ఉన్నతాధికారులు ఉక్కుమంత్రిత్వ శాఖకు తాజాగా మెమో జారీ చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి ఆధారిత జీతాల అంశంపై తక్షణమే సరైన నిర్ణయం తీసుకోవాలని, దానిని అధికారికంగా తమకు తెలియజేయాలని ఆదేశించింది. దీనిపై అధికారుల సంఘం ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, డీపీఈ ఆదేశాల ప్రకారమే ఉద్యోగుల నుంచి విద్యుత్ చార్జీలను యూనిట్ల లెక్కన వసూలు చేస్తున్నారని, గతంలో అండమాన్ పర్యటనల పేరుతో కొందరు తీసుకున్న మొత్తాలను కూడా డీపీఈనే రికవరీ చేసిందని తెలిపారు. అలాంటి సంస్థ ఆదేశాలు లేకుండా జీతాలు తగ్గించడం యాజమాన్యం తప్పిదమేనని, దీనిని తక్షణమే ఉపసంహరించుకోకపోతే న్యాయపోరాటం తప్పదని స్పష్టం చేశారు.


సీఎం చంద్రబాబుకు సోమవారం వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

ఉపాధిలో కేంద్రం వాటా తగ్గింపు సరికాదు

» బిల్లును వెనక్కితీసుకునేలా కేంద్రాన్ని ఒప్పించండి

» చంద్రబాబుకు వినతిపత్రం అందించిన సీపీఐ నేతలు


అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వ వాటాను తగ్గించడం సమంజసం కాదని సీపీఐ పేర్కొంది. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథతథంగా అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుని కలసి వినతిపత్రం అందజేసింది. ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వర రావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకర రావు, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు. 'ఇప్పటివరకు ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 90 శాతం నిధులను 60 శాతానికి కుదించింది. 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలంటే ఏపీ సహా దేశంలోని పలు రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుంది. ఉపాధి పథకం కింద కల్పిస్తున్న పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతామని కేంద్రం చెబుతున్నప్పటికీ.. ఇప్పటి వరకు కుటుంబానికి సగటున 50 పని దినాలు కూడా కల్పించ లేదు. ఇప్పటివరకు పేదలకు హక్కుగా ఉన్న ఈ చట్టంలో సవరణల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కష్టంగా మారుతుంది. ఎన్ఆర్ఈజీఎస్‌లో చేసిన సవరణలను వెంటనే వెనక్కి తీసుకునేలా కేంద్రంతో మాట్లాడాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పెట్టిన జాతిపతి మహాత్మాగాంధీ పేరును తొలగించి.. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్‌గా మార్చడం దుర్మార్గం. స్వచ్ఛ భారత్‌కు జాతి పితను కళ్ల జోడును వాడుకున్న ప్రధాని మోదీ... ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరి కాదు. మహాత్ముని పేరుతో ఉపాధి పథకాన్ని కొనసాగించకపోతే 'పేదల వ్యతిరేకత ప్రభుత్వంగా ఎన్డీయే ముద్ర వేసుకుంటుంది' అని బృందం సభ్యులు సీఎం దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ అంశంపై కేంద్ర పెద్దలతో చర్చిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు సీపీఐ నాయకులు సచివాలయం బయట మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఏపీలోనూ బీసీ జన గణన, కుల గణన చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు రామకృష్ణ వివరించారు. విద్య, వైద్యం, స్థానిక సంస్థల పదవుల్లో జనాభా ప్రాతిపదికన పదవులు కేటాయించాలని కోరామని చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మళ్లీ తిరిగొస్తానని అనుకోలేదు

– శివరాజ్ కుమార్



'గతేడాది డిసెంబరులో క్యాన్సర్ చికిత్స కోసం యూఎస్ వెళ్లాను. శస్త్రచికిత్స పూర్తయ్యాక ఐదు గంటల తర్వాత స్పృహలోకి వచ్చాను. 'మళ్లీ ఇలా నీ చేయి పట్టుకుంటానో లేదో అని అనిపించింది' అని నా భార్యతో చెప్పాను. మళ్లీ మామూలు మనిషిని కావడానికి కొంత సమయం పట్టింది. భారత్‌లో అడుగుపెట్టిన క్షణం భావోద్వేగానికి గురయ్యాను' అని అన్నారు కన్నడ నటుడు శివరాజ్ కుమార్. తన కొత్త సినిమా '45' ప్రమోషన్స్‌లో భాగంగా శివరాజ్ కుమార్ చెన్నై సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్యాన్సర్ శస్త్రచికిత్స రోజులను గుర్తు చేసుకున్నారు. మళ్లీ తిరిగి వస్తానని అనుకోలేదంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా యోగక్షేమాల గురించి ఎవరైనా ఫోన్ చేసినప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగేవి. ఇలాంటి ప్రేమ ఎవరికి దక్కుతుంది? కావల్సినంత డబ్బు సంపాదించవచ్చు. కానీ ఇలాంటి ప్రేమను పొందడం చాలా కష్టం' అని అన్నారు.

ఐపీ లాగిన్లు మూడు వారాల్లో అందించండి

● పవన్, జూనియర్ ఎన్టీఆర్ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు ఆదేశం



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిత్వ హక్కులకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వీరి వ్యక్తిత్వ హక్కులకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ఉన్న ఐపీ లాగిన్ల వివరాలను మూడు వారాల్లో అందించాలని సంబంధిత సామాజిక మాధ్యమ సంస్థలను ఆదేశించింది. సామాజిక మాధ్యమాల్లో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య అవసరాలకు వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం వాటిల్లుతోందని వీరిద్దరూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, గూగుల్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఆ పిటిషన్లు సోమవారం జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చాయి. హైకోర్టు ఇదివరకు ఇచ్చిన ఆదేశాల మేరకు కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తెలిపారు. అయితే కొన్ని లింకులను మాత్రమే తొలగించారని, మరికొన్ని అలాగే ఉన్నాయని పవన్ కల్యాణ్, జూనియర్ ఎన్టీఆర్ తరఫు న్యాయవాది న్యాయమూర్తికి వివరించారు. అవి ఎందుకు తొలగించలేదో తెలియజేయాలని.. సంబంధిత ఐపీ లాగిన్ల వివరాలను మూడు వారాల్లో అందించాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది. పలువురు సినీటులు, ప్రముఖులు కూడా తమ వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడాలని కోరుతూ ఇదే కోర్టును ఆశ్రయించగా.. వారికి మధ్యంతర ఉపశమనం మంజూరు చేయడం తెలిసిందే.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న చిత్రం పేరును 'రౌడీ జనార్ధన'గా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన వేడుకలో విజయ్ దేవరకొండ అభిమానుల కేరింతల నడుమ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని నిర్మాతలు రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'విజయ్ ఇప్పటి వరకూ ఇంత మాస్, బ్లడ్ షెడ్ ఉన్న క్యారెక్టర్ చేయలేదు. ఆయనతో తొలిసారిగా తూర్పు గోదావరి యాసలో మాట్లాడించబోతున్నాం' అని చెప్పారు. దర్శకుడు రవి కిరణ్ కోలా మాట్లాడుతూ "రౌడీ జనార్ధన' టైటిల్ మీకు నచ్చిందని అనుకుంటున్నా. ఇకపై మూవీ నుంచి విడుదల చేసే కంటెంట్ కూడా మీకు నచ్చుతుందని ఆశిస్తున్నా' అని అన్నారు. ఈ చిత్రంలో కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తున్నారు.

కట్టిపడేసే సన్నివేశాలు.. కదిలించే భావోద్వేగాలు



మలయాళ కథానాయకుడు మోహన్ లాల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'వృషభ'. సమర్జిత్ లంకేశ్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా, గరుడ రామ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నందకిశోర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. ఈ నెల 25న పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదలవుతోంది. తెలుగులో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బన్నీ వాసు మాట్లాడుతూ 'భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన 'వృషభ' విజువల్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. మరో లోకంలోకి తీసుకెళ్తాయి. ఇందులోని భావోద్వేగాలు కదిలిస్తాయి' అని అన్నారు.

'వైజయంతి'లో పనిచేయడం నా అదృష్టం

రోషన్



రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కించిన సినిమా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించాయి. నందమూరి కల్యాణ్ చక్రవర్తి కీలక పాత్రను పోషించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఛాంపియన్ నైట్ ఈవెంట్‌ను నిర్వహించారు మేకర్స్. కార్యక్రమంలో రోషన్ మాట్లాడుతూ 'దర్శకుడు ప్రదీప్ విజన్‌ను నిర్మాత స్వప్న మరో స్థాయికి తీసుకెళ్లారు. ఎంతోమంది హీరోలను పరిచయం చేసిన వైజయంతి సంస్థలో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు. 'రోషన్ కచ్చితంగా ఈ సినిమాతో ఛాంపియన్ అవుతారు. ఇందులో నా పాత్ర పేరు చంద్రకళ' అని అనస్వర రాజన్ తెలిపారు.

లెట్స్ డ్యాన్స్...: ఈ సినిమా నుంచి 'కమ్ కమ్ ఛాంపియన్.. లెట్స్ డ్యాన్స్ ఛాంపియన్' పాటను హీరోయిన్ సమంత విడుదల చేశారు. చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. వినసొంపైన సంగీతం, ఆకట్టుకునే విజువల్స్‌తో ఉన్న ఈ పార్టీ గీతం ప్రస్తుతం అందర్నీ అలరిస్తోంది.



సూపర్ హిట్ ఖాయం

అనిల్ రావిపూడి

'ఆది అద్భుతమైన నటుడు. ఎన్నో జానర్స్‌లో సినిమా చేశాడు. నా తొలి చిత్రం 'పటాస్' సమయంలో సాయికుమార్ ఎంతో సహకారం అందించారు. 'శంబాల'తో ఆదికి సూపర్ హిట్ ఖాయం అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కించిన మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీదర్ రెడ్డి నిర్మించారు. అర్చన అయ్యర్, స్వసిక, రవి వర్మ, మధునందన్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 25న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు అనిల్ రావిపూడితో పాటు హీరోలు కిరణ్ అబ్బవరం, మంచు మనోజ్, ప్రియదర్శి, నిర్మాతలు నవీన్ యెర్నేని, టీజీ విశ్వప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'శంబాల' చిత్రంపై మొదటి నుంచీ పాజిటివ్ వైబ్ ఉంది. నా కెరీర్ బాగుండడానికి కారణమైన వారిలో సాయికుమార్ ఒకరు. హిట్లు కొట్టడం ఒకెత్తయితే, ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం ఒక ఎత్తు అని ఆది సాయికుమార్‌ను చూస్తే అర్థమైంది. ఈ చిత్రంతో ఆయనకు సూపర్ హిట్ ఖాయం' అని చెప్పారు కిరణ్ అబ్బవరం. 'ఈ సినిమా కోసం ఆది చాలా కష్టపడ్డాడు. 'శంబాల బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టాలి' అని మంచు మనోజ్ అన్నారు. 'శంబాలతో ఆదికి చిత్రోత్సాహం.. నాకు పుత్రోత్సాహం.. టీమ్‌కు విజయోత్సాహం రావాలి' అని సాయికుమార్ పేర్కొన్నారు.



'వెండితెర ఆణిముత్యాలు' పేరుతో రాజేంద్ర ప్రసాద్, భానుచందర్, శివాజీరాజా, పృథ్వీ, దర్శకుడు బాబ్జీ తదితరులను డాక్టర్ జెఎన్ రాజేంద్ర సారథ్యంలో మన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సంస్థ ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో సన్మానించింది. 'నటులకు అవార్డులు, సన్మాన కార్యక్రమాలు బూస్ట్ లాంటివనీ, తనతో కలసి పనిచేసిన నటులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నానని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు.

ఆవకాయ.. అమరావతి.. ఆనందం

పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో

జనవరి 8 నుంచి 10 వరకూ నిర్వహణ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటి చెప్పేలా కూటమి ప్రభుత్వం విజయవాడ వేదికగా జనవరి 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు 'ఆవకాయ... అమరావతి ఉత్సవ్'ను నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఉత్సవ్ పోస్టర్‌ను సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీ పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్... సంయుక్తంగా మూడు రోజులపాటు విజయవాడలోని కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్, భవాని ద్వీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని సుసంపన్నమైన కథా సంప్రదాయాలు, సినిమా, సాహిత్యం, ప్రదర్శన కళలను ఘనంగా చాటాలన్న లక్ష్యంతో ఈ ఉత్సవం రూపుదిద్దుకుంది. కేవలం ఇండోర్ హాల్స్‌కే పరిమితం కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం ఈ ఉత్సవం ప్రత్యేకత. ఉత్సవానికి ప్రవేశం ఉచితం. అమరావతిని సాహితీ, కళా రాజధానిగా తయారు చేసే క్రమంలో ఈ కార్యక్రమం తొలిమెట్టు. గత ప్రభుత్వం కళలను నిర్లక్ష్యం చేసింది. మా ప్రభుత్వం కళా, సాంస్కృతిక రంగాలకు పునరుజ్జీవనం కల్పించింది. తెలుగు వారి రుచులను ఆవకాయ్ ఉత్సవ్‌లో రుచి చూపిస్తాం' అని మంత్రి తెలిపారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ... 'దీర్ఘకాలిక పర్యాటక లక్ష్యాలకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి. జనవరి నెలలోనే గండి కోట, అరకు, విశాఖ, ఫ్లెమింగో ఉత్సవ్‌లను నిర్వహిస్తాం. ఈ ఉత్సవాల నిర్వహణకు రూ.40 నుంచి రూ.50 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. ఆవకాయ ఉత్సవ్ నిర్వహణకు రూ.5 కోట్లు ఖర్చు చేయనున్నాం' అని తెలిపారు. అనంతరం ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి మాట్లాడుతూ... "సినిమా, సాహిత్యం, ప్రదర్శన కళలతో కూడిన బహుముఖ కార్యక్రమాల ద్వారా ఏపీ సాంస్కృతిక, సృజనాత్మక బలాన్ని ప్రదర్శించడానికి 'ఆవకాయ' రూపకల్పన జరిగింది" అని చెప్పారు. ఈ ప్రాంతపు ఆలోచనలు, కథలు, ప్రదర్శనలను ఒక చోట చేర్చే బహిరంగ వేదికే ఈ ఉత్సవం అని టీమ్ వర్క్ ఆర్ట్స్ ఎండీ సంజయ్ కె రాయ్ తెలిపారు.

ప్రవేశం పూర్తి ఉచితం



'ఆవకాయ' లోగోను ఆవిష్కరించిన మంత్రి దుర్గేశ్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి



'మిస్ ఆంధ్ర'గా సాత్విక

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన చెన్నమనేని గమన సాత్విక మిస్ ఆంధ్రగా ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి జైపూర్‌లో ఫరెవర్ స్టార్ ఇండియా సంస్థ నిర్వహించిన అందాల పోటీల్లో సాత్విక దేశ (మిస్ ఇండియా) స్థాయిలో నాలుగో స్థానంలో నిలవగా, ఏపీలో మొదటి స్థానంలో నిలిచారు. 22 ఏళ్ల సాత్విక గతంలో ఇదే సంస్థ నిర్వహించిన పోటీల్లో మిస్ తిరుపతిగా ఎంపికయ్యారు. సాత్విక తల్లి నెల్లూరు జిల్లా కోర్టులో పనిచేస్తుండగా, తండ్రి సీసీ నాయుడు వెంకటగిరి టీడీపీకి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్.

పేకాట డెన్‌పై పోలీసుల దాడి

- **281 మంది అరెస్టు.. రూ.32 లక్షలు స్వాధీనం**
- **అదుపులో ఆంధ్ర, తెలంగాణవాసులు**
- **ఆగిరిపల్లిలోని రిక్రియేషన్ క్లబ్ వద్ద బంధువుల ఆందోళన**

నూజివీడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ పరిధిలో రిక్రియేషన్ క్లబ్ పేరిట నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఏలూరు జిల్లా పోలీసులు మెరుపు దాడులు చేశారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండల పరిధిలోని మ్యాంగో బే కల్చరల్ రిక్రియేషన్ సొసైటీలో భారీ ఎత్తున్న జూదం జరుగుతోందన్న సమాచారంపై ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ ఆదేశాలతో.. పోలీసులు ఆదివారం రాత్రి ఈ దాడులు నిర్వహించారు. క్లబ్‌లో పేకాడుతున్న 281 మందిని అదుపులోకి తీసుకోగా, మరికొందరు తప్పించుకుని పారిపోయారు. జూదం ఆడడానికి వచ్చిన వ్యక్తులకు చెందిన 130 వాహనాలు, 40 ద్విచక్ర వాహనాలతో పాటు సుమారు 32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. సొసైటీ నిర్వాహకులు కిలారి అప్పారావు, కాట్రగడ్డ అశోక్‌లను కూడా అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. క్లబ్‌లో జూదాలకు సంబంధించిన కుర్చీలు, టేబుళ్లను స్వాధీన పరచుకుని కోర్టుకు అప్పగించనున్నట్టు తెలిపారు. కాగా, మ్యాంగో బే కల్చరల్ రిక్రియేషన్ సొసైటీలో 2019లో మూతపడగా 2025లో నవంబరు మొదటి వారం నుంచి మళ్లీ తెరిచారు. ఈ సందర్భంలో, సొసైటీ వెనుక మంత్రి లోకేశ్ ఉన్నారంటూ నిర్వాహకులు విస్తృతంగా ప్రచారం చేశారు. సొసైటీలో సభ్యత్వం పొందాలంటే ముఖ్యమంత్రి స్థాయిలోని నాయకుల రికమండేషన్లు ఉండాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిబంధనల ప్రకారమే సొసైటీ నిర్వహణ ఉంటుందని విలేకరులకూ వెల్లడించారు. ఈ ప్రచారాల నేపథ్యంలో సాఫీగా సాగిపోతుందనుకుంటున్న సొసైటీ వ్యవహారంపై ఎస్పీ మెరుపు దాడులు నిర్వహిండం.. అసత్య ప్రచారాలకు చెక్ పెట్టినట్లయింది. కాగా, అదుపులోకి తీసుకున్న పేకాట రాయుళ్లను కోర్టులో హాజరు పరచకపోవడంపై వారి బంధువులు రిక్రియేషన్ క్లబ్ వద్ద సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. దొరికినవారిలో 30 శాతానికి పైగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉండటంతో అక్కడి నుంచి వారి బంధువులు వచ్చి ఆందోళన చేపట్టారు.

క్విక్ మార్చ్.. పుష్ అప్..

5,751 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం

అధునాతన పోలీసింగ్, హ్యూమన్ టచ్‌కు ప్రాధాన్యం

ఏఐ, సైబర్, డిజిటల్ టెక్నాలజీపై జేఎన్‌టీయూతో ఒప్పందం

పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి నిపుణులతో ఆన్‌లైన్ క్లాసులు

అమరావతి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): "అటెన్షన్.. క్విక్ మార్చ్.. పుష్ అప్.. వార్మ్ అప్.." రాష్ట్రంలోని పోలీసు శిక్షణా కేంద్రాల్లో సోమవారం గట్టిగా వినిపించిన మాటలివి..! పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,751 మందికి అధునాతన టెక్నాలజీతో కూడిన ట్రైనింగ్‌ను పోలీసు శాఖ ప్రారంభించింది. ఒంగోలు పీటీసీలో హోంమంత్రి అనిత, ఇతర ప్రాంతాల్లో ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మారుతున్న నేరాల తీరుతెన్నులకు అనుగుణంగా పోలీసుల్లో శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేలా శిక్షణ ఇచ్చేందుకు పోలీసుశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,751 మందిని సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టే సైబర్ కమాండోల్లా తీర్చి దిద్దబోతోంది. పోలీస్ ట్రైనింగ్ విభాగం డీఐజీ బి. సత్యయేసు బాబు రాష్ట్రవ్యాప్తంగా 21 కేంద్రాల్లో ఏకకాలంలో ట్రైనింగ్ ప్రారంభించేలా సమన్వయం చేశారు. విజయనగరం, ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాలలో మహిళా అభ్యర్థులకు.. అనంతపురం, తిరుపతి పీటీసీలతో పాటు ఇతర జిల్లాల్లోని డీటీసీల్లో సివిల్ పోలీసు కానిస్టేబుళ్లకు.. ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు బీటీసీల్లో సోమవారం ఉదయం శిక్షణ ప్రారంభమైంది. ఇందులో ప్రధానంగా సైబర్ నేరాలు, ఫోరెన్సిక్, క్రిమినాలజీ వంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలు నేర్పిస్తూనే శారీరకంగా, మానసికంగా సిద్ధం చేసి చట్టాల అమలుపై అవగాహన కల్పిస్తారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలోని టెక్ టవర్‌లో ఒక ప్రత్యేక స్టుడియో ఏర్పాటు చేసి, ట్రైనింగ్ సెంటర్లలో ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేసి క్లాసులు చెబుతామని ట్రైనింగ్ విభాగం డీఐజీ సత్య యేసుబాబు తెలిపారు.



పోలీసు శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో ఎంపీ మాగుంట, మంత్రి డోలా

ఏఐ పోలీసింగ్ వైపు .: డీజీపీ హరీశ్ గుప్తా

'కాలంతో పాటు నేరాల్లోనూ సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయ్. వాటిని ఎదుర్కొనేందుకు ప్రతి పోలీసును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏఐ వైపు ఏపీ పోలీసింగ్‌ను తీసుకెళ్లబోతున్నాం..' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. పోలీసులంటే లాఠీ చేతిలో పట్టుకుని డ్యూటీ చేయడమే కాదు.. డేటా ఆధారంగా నేరాలను అరికట్టడం, వెలికితీయడం అని కొత్తగా పోలీసు శాఖలోకి చేరిన ట్రైనీలకు చెప్పబోతున్నామని అన్నారు. అందుకోసం కాకినాడ, అనంతపురం జేఎన్‌టీయూలతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ట్రైనీ కానిస్టేబుల్లో 810మంది బీటెక్, ఎంటెక్ చదివిన వారున్నారని, వారిని సైబర్ కమాండోలుగా సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

రౌడీ మూకలను కట్టడి చేస్తాం: హోంమంత్రి అనిత

ఒంగోలు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని, తాము కక్షసాధింపులకు పాల్పడితే వైసీపీ నేతలు రోడ్ల మీద తిరిగే వారు కాదని హోంమంత్రి అనిత అన్నారు. సోమవారం ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాలలో కొత్తగా ఎంపికైన మహిళా కానిస్టేబుళ్లకు శిక్షణను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. వైసీపీ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని, చిన్నపిల్లలతో రప్పా, రప్పా.. అంటూ ఫ్లెక్సీలు పెట్టించి.. మేక తలలు నరికి రక్తాభిషేకాలు చేయిస్తూ నేరప్రవృత్తిని పెంచుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రౌడీల ఆటకట్టించేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మంత్రి డొలా, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



రెండో ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం6 రాకెట్

రేపు నింగిలోకి బ్లూబర్డ్ బ్లాక్ 2

- **భారీ ఉపగ్రహాన్ని మోసుకెళ్లేందుకు ఎల్వీఎం3-ఎం6 రాకెట్ సిద్ధం**
- **నేటి ఉదయం కౌంట్‌డౌన్ ప్రారంభం**

సూళ్లూరుపేట/తిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అత్యంత బరువైన ఉపగ్రహాలను మోసుకెళ్లే ఇస్రో ఎల్వీఎం3 రాకెట్ మరోసారి ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి బుధవారం ఉదయం 8.54 గంటలకు ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్ 2 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) సోమవారం తెల్లవారుజామున నిర్వహించారు. అనంతరం రాత్రి షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (లాబ్) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రయోగానికి సంసిద్ధత తెలిపారు. మంగళవారం ఉదయం 8.54 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభిస్తారు. ప్రయోగం ప్రారంభమైన 15.07 నిమిషాల్లో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెడతారు. ప్రయోగ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ నారాయణన్ సోమవారం ఉదయం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. అలాగే శాస్త్రవేత్తల బృందంతో కలిసి రాకెట్ నమూనాను తిరుమల శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇదో వాణిజ్య ప్రయోగమని చెప్పారు. 2027లో గగన్‌యాన్ ప్రారంభవుతుందన్నారు.



సింగపూర్, షార్జా.. సీట్లన్నీ ఫుల్!

(మొదటి పేజీ తరువాయి)

ఇండిగో ఎయిర్‌లైన్స్ సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి రెండే సర్వీసులు అయినప్పటికీ.. వారంలో ఐదు షెడ్యూల్స్‌గా, పది ట్రిప్పులుగా నేరుగా రాకపోకలు సాగిస్తున్నాయి. సాధారణ రోజుల్లో కూడా 100 శాతం ఆక్యుపెన్సీతో ఇవి నడుస్తుండటం విశేషం. ఇంత ఆదరణ వస్తుండటంతో విమానాశ్రయ అధికారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుబాయ్‌కు వెళ్లే వారు విజయవాడ నుంచి నేరుగా షార్జాకు వెళ్తున్నారు. అక్కడి నుంచి సులువుగా దుబాయ్‌కు వెళ్లే అవకాశం ఉంటోంది. దీంతో షార్జా విమాన సర్వీసుకు ఆదరణ ఎక్కువగా ఉంది. వారంలో రెండు సర్వీసులే ఉండటంతో టికెట్లు దొరకటం కూడా కష్టంగా మారింది. దుబాయ్‌కు కూడా నేరుగా విమాన సర్వీసును నడపాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది.

సింగపూర్‌కు భలే గిరాకీ

గతంలో విజయవాడ, సింగపూర్ మధ్య విమాన సర్వీసు విజయవంతంగా నడిచింది. వైసీపీ ప్రభుత్వంలో ఆ విమాన సర్వీసు రద్దయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సర్వీసును తిరిగి ప్రారంభించారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి నాన్ వీజీఎఫ్ విధానంలోనే డైరెక్టుగా సింగపూర్‌కు విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ సర్వీసు రాకతో ఏపీ నుంచి హైదరాబాద్, చెన్నై వెళ్లి అక్కడి నుంచి సింగపూర్ వెళ్లేవారి సంఖ్య తగ్గింది. సింగపూర్ నుంచి విజయవాడకు నూరుశాతం ఆక్యుపెన్సీతో విమానాలు నడుస్తుండగా, విజయవాడ నుంచి సింగపూర్‌కు 90 శాతం ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా, గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలు సైతం విజయవాడ వచ్చి సింగపూర్‌కు వెళ్తున్నారు. సింగపూర్ నుంచి విజయవాడకు టికెట్ ఖర్చు తక్కువగా ఉండటంతో ఇక్కడికి వస్తున్నారు. విజయవాడలో దిగి హైదరాబాద్, చెన్నైకు ప్రయాణిస్తున్నారు. దీనివల్ల దేశీయ విమానాలకు కూడా డిమాండ్ పెరిగింది.

శ్రీలంకకు విమాన సర్వీసులు ప్రారంభించాలి

విజయవాడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని దుబాయ్, శ్రీలంకకు కూడా విమాన సర్వీసులను నడపాలన్న డిమాండ్ వినిపిస్తోంది. 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం సింగపూర్‌కు విమాన సర్వీసును నడిపించాలని భావించినపుడు దుబాయ్ రూట్ కూడా సర్వే చేసింది. సింగపూర్‌తో సమానంగా దుబాయ్‌కు కూడా మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. తాజాగా షార్జా సర్వీసుకు ఉన్న ఆదరణ నేపథ్యంలో దుబాయ్‌కు కూడా విమాన సర్వీసు నడపాల్సిన అవసరం ఉంది. ఇక శ్రీలంకకు మన రాష్ట్రం నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వెళ్తున్నారు. దీంతో శ్రీలంకకు కూడా నేరుగా విమాన సర్వీసు నడపాలని వారు కోరుతున్నారు.



పదవి-బాధ్యతపై నిర్వహించిన కార్యక్రమంలో జనసేన నేతలతో ప్రమాణం చేయిస్తున్న ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

బెదిరింపులు మానండి!

మన కోసం చొక్కాలు చించుకుని, ఆడపిల్లలు కూడా రోడ్డు మీదకు వచ్చి ఓట్లు వేసినందుకు కృతజ్ఞతగా మనం ప్రజల వైపు నిలబడకపోతే.. మనందరం తలదించుకోవలసి వస్తుంది. నేనైతే తలదించుకోను. నాకు పార్టీ కంటే ప్రజల భద్రత చాలా ముఖ్యం.

గొడవలు పెట్టుకుని, కండలు పెంచుకునేవాడు లీడర్ కాలేడు. అందరినీ ఒప్పించేవాడే నాయకుడవుతారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేవాడే నాయకుడు. గొడవలు సృష్టించేవాడు కాదు. - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. వైసీపీ తీరు, ఆ పార్టీ నాయకులు వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ప్రజాస్వామ్య పద్ధతిలో, ప్రజాస్వామ్య విధంగా మాట్లాడండి. ఇలాంటి బెదిరింపులు మాత్రం ఆపాల్సిందేనని స్పష్టంచేశారు. ఆకు రౌడీలకు అండగా ఉంటామని.. రౌడీలకు సపోర్టు చేస్తామన్న పార్టీని తాను పార్టీగానే గుర్తించనన్నారు. 'అదో రౌడీల సమూహంగా ఒక్కోసారి అనిపిస్తుంది. వారిది రాజకీయ పార్టీ అయితే పాలసీపై మాట్లాడాలి. దానిపై చర్చించాలి' అని సూచించారు. జగన్‌కు ఆదివారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశానని గుర్తుచేశారు. తనకు ఎవరూ శత్రువు కాదని, వారి విధివిధానాలనే తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. 'లోపల ఎలాంటి శత్రుత్వం ఉండదు. మీ తీరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగితే గొడవ పెట్టుకోవడానికి నా జీవిత కాలం సంసిద్ధంగా ఉంటాను. బహుశా ఇలా జరిగితే అన్న భయం కూడా లేదు. అలాంటి భయం ఉంటే ఇక్కడి వరకూ ఎందుకొస్తాం..? అవసరం అనుకుంటేనే చివరి దశలో రోడ్లపైకి వచ్చి, గొడవలు పెట్టుకుంటాం. అది కూడా తప్పదనుకుంటేనే చేస్తాం. జనసేన నాయకులకు నేను చెప్పేది ఇదే. మీరు రోడ్ల మీద గొడవ పెట్టుకోవాలని చెప్పడం లేదు.. బలమైన వాదన వినిపించాలని చెబుతున్నాను. అందరికీ ఆమోదయోగ్యమైన భాషలో గట్టిగా చర్చించండి. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ ఆంధ్రప్రదేశ్‌కు.. తద్వారా భారత దేశ సమగ్రతకు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత తీసుకున్నాను. వైసీపీ నేతలూ.. మీరు ఆ భాషను వదిలేయండి. రౌడీలను వెనకేసుకొస్తాం.. గంజాయి బ్యాచ్‌లను వెనుకేసుకొస్తామంటే కుదరదు. తెనాలిలో గంజాయి రౌడీలకు వ్యతిరేకంగా పోలీసులు పని చేస్తుంటే.. వీళ్లు గంజాయి బ్యాచ్‌కు అండగా కోర్టుకు వెళ్లారు. క్రిమినాలిటీ పెరిగిపోతే రాష్ట్రాన్ని ఎవరూ బాగుచేయలేరు. రాజకీయ నాయకత్వం అనుకుంటే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి వచ్చింది' అని చెప్పారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదని.. అధికారులు గమనించాలని స్పష్టంచేశారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రైవేటు సెటిల్‌మెంట్స్ చేయొద్దు..

జనసేన నాయకులు ప్రైవేటు సెటిల్‌మెంట్స్ చేయవద్దు. చేస్తే మనకు, గత ప్రభుత్వానికి తేడా ఏముందో ఆలోచించండి. ప్రజలు ఒక్కసారి తిరగబడ్డారంటే ఇక కష్టం. నేను ఓడిపోయినా, గెలిచినా ప్రజల కోసమే పని చేశాను.. చేస్తాను. అందుకనే మీకు రెండు చేతులూ జోడించి చెబుతున్నాను. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా మీ అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దు. అంబానీ దగ్గర నుంచి అందరూ తిరుమల హుండీలో డబ్బులు వేస్తారు. ఆ డబ్బులను ఏం చేయాలి.. ఎవరి ద్వారా చేయించాలన్నది స్వామి ఇష్టం. మనకు సంబంధం లేదు. ఈ మధ్య కులాల సమస్యలు ఎక్కువయ్యాయి. పిఠాపురంలో చిన్న పిల్లలతో కులాల గురించి మాట్లాడించారంటే మనుషులు ఇంత చండాలమై పోయారేమిటని అనిపించింది.

మూడున్నరేళ్ల సమయం ఉంది..

చాలా మంది జనసేనకు బూత్ కమిటీలు లేవు. నాయకులు లేరని అంటున్నారు. మాదేమీ కాంగ్రెస్, వైసీపీలా మారిపోలేదు. మా పంట మేమే పండించుకోవాలి. వాళ్ల నాన్న ముఖ్యమంత్రిగా ఉండొచ్చు.. బాబాయి మరొకలా ఉండొచ్చు.. ఆ తర్వాత చంపేయొచ్చు.. అది వేరే విషయం. మనకు మిగతా పార్టీల్లాంటి పరిస్థితులు లేవు. అన్నీ మనమే చేసుకోవాలి కాబట్టి సమయం పడుతోంది. ఇంకా మనకు మూడున్నరేళ్ల సమయం ఉంది. పిఠాపురంలో ఓ విధానం ప్రారంభించాం. 53 గ్రామాలకు గాను 51 గ్రామాల్లో అన్ని వార్డు కమిటీలతో పాటు బూత్ కమిటీలను కూడా నియమించాం. నాకు నచ్చిన వారిని, నాయకులకు నచ్చినవారిని పెట్టలేదు. పది మంది జనసైనికులు, వీర మహిళల నుంచి అభిప్రాయాలు తీసుకుని.. మీకు నాయకుడిగా ఎవరు కావాలో ఎన్నుకోండని చెప్పి ప్రజాస్వామ్య పద్ధతిలో చేశాం. ఇది ప్రతి నియోజకవర్గానికీ మోడల్ అవ్వాలి.

కూటమిలో గొడవలు తప్పవు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల్లో సీట్ల వాటాల్లోనో, మరో దానిలోనో గొడవలు, ఇబ్బందులు తప్పవు. అందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలి. పదవి అనేది అలంకారం కాదు.. బాధ్యత. నేను అంత బాధ్యతగా ఉన్నాను. మూడున్నరేళ్లలో మీరు అద్భుతంగా చేస్తే భవిష్యత్ ఉంటుంది. రాష్ట్రంలోని సమస్యలన్నీ తీసుకొచ్చి నా భుజాల మీద వేస్తే కుంగిపోతాను. కాబట్టి మీరు కూడా కొంత బాధ్యత, బరువు పంచుకోవాలని నా విన్నపం. మా పదవులు తీసుకున్నవారు బాధ్యతా తీసుకోవాలి. ఒక ఊర్లో రోడ్లు లేకపోతే పవన్ కల్యాణ్ దగ్గరకు వెళ్లే వచ్చేస్తుందని అన్నారంటే.. దీనిని ప్రజాస్వామ్య వ్యవస్థ వైఫల్యంగా భావించాలి. ఒక జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక సర్పంచ్ చేయాల్సిన పని.. ఉపముఖ్యమంత్రి వద్దకు వస్తేనే పరిష్కారం అవుతుందంటే మన ప్రజాస్వామ్యం బలహీనపడిందని అర్థం. చూపు సరిగా లేని ఆడపిల్ల వచ్చి మా ఊరికి రోడ్డు వేయాలని నన్ను కాదు అడగాల్సింది.. నిజంగా బాధ్యత గల ప్రభుత్వాలుంటే ఎప్పుడో అయిఉండేది. కానీ దశాబ్దాలుగా ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలహీనం చేస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం, బాధ్యత పెరిగితేనే వారిలో కోపం తగ్గుతుంది.

మాజీ సీఎం భార్యను తిడితే..

మన కళ్ల ముందు ఒకడు కూర్చుని.. ఒక మాజీ ముఖ్యమంత్రి సతీమణిని ఇష్టారాజ్యంగా తిడితే ఏమీ చేయలేమన్న స్థితిలో ఉన్నామా అన్న భయం వేసింది. కూటమి పదేళ్లు, 15 ఏళ్లు ఉంటుందని చెబుతున్నానంటే మనం తగ్గాలనో.. మరొకరిని పెంచాలనో కాదు. ప్రస్తుతం ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే నా లక్ష్యం. ప్రజాస్వామ్యంలో అందరం కొట్టుకుంటే అరాచకమే రాజ్యమేలుతుంది. సామినేని ఉదయభాను, పెండెం దొరబాబు, కిలారి రోశయ్య, జయమంగళ అందరూ గౌరవప్రదంగా ఉండేవారు. అలాంటి వ్యక్తులే వైసీపీలో ఇమడలేకపోయారు. వాళ్లంతా మన పార్టీలోకి వచ్చిన తర్వాత రెచ్చిపోండని నేనెప్పుడూ వాళ్లకు చెప్పలేదు. గెలవండి.. మనమేంటో చూపిద్దామన్న పిచ్చిమాటలు నేనెప్పుడూ మాట్లాడలేదు. అధికారంలోకి వచ్చాం. మన తడాఖా చూపిద్దామని బాధ్యతగల వ్యక్తులు అంటారా..? మనం బ్యాలెన్స్‌గా వెళ్తామనే జనం నమ్మారు.

పోలవరానికి అమరజీవి పేరు పెట్టాలి

త్యాగాలు చేసినవారిని గుర్తించకపోతే మనం చరిత్రకు ఏం గౌరవమిచ్చినట్లు? దేశంలో తొలిసారి భాషాప్రయుక్త రాష్ట్రాలు తెచ్చిన వారు, తెలుగు వారి ఉనికి, జాతి, ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నామంటే దానికి మూల పురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు. అలాంటి వ్యక్తుల్ని స్మరించుకోకపోవడం చాలా తప్పు. ఐదేళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తుల పేర్లు కూడా పెట్టేస్తున్నారు. పొట్టి శ్రీరాములుకు సరైన గుర్తింపు, నివాళి ఇవ్వాలంటే.. పోలవరం ప్రాజెక్టుకు ఆ మహానుభావుడి పేరు పెడితే బాగుంటుందని నా ఆలోచన. అంబేడ్కర్‌ను ఒక కులానికి పరిమితం చేస్తే ఏమీ చేయలేం. ఆయన అందరివాడు.

జనసేనకు 3,459 నామినేటెడ్ పోస్టులు

పోరాటాలు చేసి.. కష్టపడినవారికే పదవులు: పవన్

పార్టీ కోసం మొదటి నుంచి క్షేత్రస్థాయిలో కష్టపడిన వారికి, పోరాటాలు చేసిన వారికి తగిన గుర్తింపు ఇచ్చామని జనసేనాని స్పష్టంచేశారు. 3 పార్టీల కూటమిలో భాగంగా ఇప్పటి వరకూ జనసేనకు 3,459 నామినేటెడ్ పదవులు లభించాయన్నారు. మరికొన్ని త్వరలోనే భర్తీ అవుతాయని తెలిపారు. ఆస్పత్రుల అభివృద్ధి కమిటీల్లో కొన్ని కీలకమైన పోస్టులు రానున్నాయని చెప్పారు. ఇందులో డిప్యూటీ సీఎం, రెండు మంత్రి పదవులు, రెండు ఎంపీలు, రెండు ఎమ్మెల్సీలు, 21 ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన కార్పొరేషన్ చైర్మన్ పోస్టులున్నాయన్నారు. 'పార్టీ సభ్యత్వం లేకుండా జనసేన పదవి పొందడం చాలా తప్పు. ఎవరైనా అలా పదవి తీసుకుంటే వెంటనే సభ్యత్వ కార్డు తీసుకోండి. కండువా వేసుకుంటే జనసేన మెంబర్ కాదు. క్రియాశీలంగా పని చేయాలి. కొన్ని సంవత్సరాలు పని చేస్తేనే పోటీకి అర్హులన్న నిబంధన పెట్టాం. జనసేన బలం జనసైనికులు, వీరమహిళలే. ఇంత మంది ఆడబిడ్డలు కూర్చొని పోరాటం చేశారంటే.. ఏ పదవి ఉందని బలంగా నిలబడ్డారు? సభ్యత్వ డ్రైవ్ పిఠాపురంలో ప్రారంభిస్తున్నాం. ఫిబ్రవరి నాటికి పూర్తయిపోవాలి. తొలుత మార్చి 14న ఆవిర్భావ దినోత్సవం వద్దనుకున్నాను. కానీ యువత, ఆడబిడ్డలను ఉద్దేశించే ఆవిర్భావ దినోత్సవం ఉంటుంది. దానికి అందరూ సహాయ సహకారాలు అందించాలి' అని కోరారు.

బైకర్ వ్లాగర్ స్వాతికి అభినందనలు..

దేశవ్యాప్తంగా బైక్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఆధ్యాత్మిక అంశాలను అందరికీ పంచుకుంటున్న జెన్ జెడ్ వ్లాగర్ స్వాతి రోజాను పవన్ కల్యాణ్ అభినందించారు. సోమవారం మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో ఆమె డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సాహస యాత్ర గురించి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ యాత్రలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్త పర్యటనలో భాగంగా కొద్ది రోజుల క్రితం ఆమె శ్రీశైలంలో పర్యటించిన సమయంలో వసతి, భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. ఆ విషయం తెలుసుకున్న ఆయన ఆమెకు శ్రీశైలంతో పాటు తిరుమల, శ్రీకాళహస్తి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయించారు. దుర్గమ్మ దర్శనం అనంతరం మంగళగిరి వచ్చిన ఆమె ఆయన చూపిన శ్రద్ధకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలంలో గతంలో ఎదురైన అనుభవాలను ఆమె పంచుకున్నారు. ఇదే విషయాన్ని పదవి-బాధ్యత కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. ఒక ఆడపిల్లకు వసతి కల్పించని పరిస్థితిలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



ఎక్సైజ్ శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు

3 ప్రాంతాల్లోనూ డీ-ఎడిక్షన్ కేంద్రాలు

- అమరావతి, తిరుపతి, విశాఖల్లో పెట్టాలి: సీఎం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని నివారించేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు.. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమల్లో మూడు డీ-ఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వీటిని అమరావతి, తిరుపతి, విశాఖలో నెలకొల్పాలన్నారు. ప్రజల కోణంలో ఆలోచిస్తూ సేవలందించాలని అధికారులకు సూచించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆర్టీజీఎస్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష జరిపారు. 'ప్రజలకు సంతృప్తికంగా సేవలందించాలి. ప్రభుత్వపథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించాలి. గంజాయి కట్టడికి పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. ఇందుకోసం నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటా' అని సీఎం వెల్లడించారు. తరచూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాలో ఫిర్యాదులు రాకూడదని అధికారులను హెచ్చరించారు. కలుషితమైందన్న సమాచారం వచ్చిన వెంటనే అప్రమత్తమవ్వాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయాలకు రావలసిందేనని తేల్చిచెప్పారు. ఫైళ్ల పర్యవేక్షణ, సిబ్బంది హాజరు తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్‌కు తెలియజేయాలన్నారు.

మన 'తాగుడు' తక్కువే!

- ఏపీలో తలసరి మద్యం వినియోగం 2.71 లీటర్లు
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో మనకంటే అధికం
- పొరుగు రాష్ట్రాల్లో ఏడాదికి 4 లీటర్ల కంటే ఎక్కువగా..
- ఎక్సైజ్ శాఖ అంచనాల్లో ఆసక్తికర అంశాలు వెల్లడి

కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ ఓవైపు రెండంకెల వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. మరోవైపు లక్షల కోట్ల పెట్టుబడుల సాధనతో పాటు టెక్నాలజీ వినియోగంలో పరుగులు పెడుతోంది. ఇదే సమయంలో ఒక్క విషయంలో మాత్రం చాలా వెనకబడిపోయింది తెలుసా!! అదేంటంటే తలసరి మద్యం వినియోగం. మందు తాగడంలో మన వాళ్లు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చివరన నిలిచారు. దక్షిణాదిన ఎక్కువగా మద్యం వినియోగం ఉన్న రాష్ట్రాల్లో ఏపీ కింద నుంచి రెండో స్థానంలో ఉండగా.. ఈ విషయంలో మన పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు దూసుకుపోతున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తలసరి మద్యం వినియోగం తక్కువగా ఉంది. 2025 జనాభా అంచనాల ప్రకారం.. 2024-25లో ఏపీలో తలసరి మద్యం వినియోగం 2.71 లీటర్లుగా ఉండగా.. అదే తెలంగాణలో 4.44 లీటర్లు, తమిళనాడులో 3.38 లీటర్లు, కర్ణాటకలో 4.25 లీటర్లు ఉంది. అంటే మన రాష్ట్రంలోని వారి కంటే ఆయా రాష్ట్రాల్లో ప్రజలు ఎక్కువగా మద్యం తాగేస్తున్నారు. దక్షిణాదిన ఒక్క కేరళలో మాత్రమే తలసరి మద్యం వినియోగం మన కంటే తక్కువగా 2.53 లీటర్లుగా ఉంది. ఏపీలో మద్యం తాగడం కోసం తలసరి ఖర్చు రూ.6,399. తెలంగాణలో రూ.11,351, తమిళనాడులో 7,282, కర్ణాటకలో 6,918, కేరళలో రూ.5,958 చొప్పున ఏడాదికి ఖర్చు చేస్తున్నారు.

2024-25లో తలసరి మద్యం వినియోగం, వ్యయం..

రాష్ట్రం	లీటర్లు	చేస్తున్న ఖర్చు
ఆంధ్రప్రదేశ్	2.71	6,399
తెలంగాణ	4.44	11,351
తమిళనాడు	3.38	7,282
కర్ణాటక	4.25	6,918
కేరళ	2.53	5,958

'తలసరి' లెక్క ఇలా..

మద్యం తలసరి వినియోగం అంటే తలసరి ఆదాయం తరహాలోనే లెక్కిస్తారు. అంటే ఒక రాష్ట్రంలో ఒక సంవత్సరంలో అమ్ముడైన మొత్తం మద్యాన్ని ఆ రాష్ట్ర జనాభాతో భాగించి.. తలసరి వినియోగం అంచనాలు రూపొందిస్తారు. ఇందులో రోజూ తాగేవారు, అప్పుడప్పుడు తాగేవారు, చాలా అరుదుగా తాగేవారు, అసలు తాగని వారు కూడా ఉంటారు.

ఆల్కహాల్ మాత్రమే పరిగణనలోకి..

తలసరి మద్యం వినియోగంలో ఆల్కహాల్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అంటే ఒక లిక్కర్ బాటిల్‌లో 42 శాతం, బీరు బాటిల్‌లో 8 శాతం లేదా 5 శాతమే ఆల్కహాల్ ఉంటుంది. నీటితో కలిపి ఆ ఆల్కహాల్‌ను బ్లెండ్ చేస్తారు. అందువల్ల తలసరి మద్యం వినియోగంలో మొత్తం సీసాలో ఉన్న లిక్కర్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. అందులోని ఆల్కహాల్ శాతాన్ని మాత్రమే తీసుకుని, తలసరి వినియోగం లెక్కగట్టారు. ఒక కేసు లిక్కర్ అంటే 8.64 లీటర్లు ఉంటుంది. అందులో ఆల్కహాల్ 3.74 లీటర్లు మాత్రమే. అలాగే కేసు బీరులో కేవలం 0.59 లీటర్ల ఆల్కహాల్ ఉంటుంది. మన రాష్ట్ర జనాభా 5 కోట్లు ఉంటే.. అందులో మద్యం తాగేవారు సుమారు 50 లక్షలు ఉండొచ్చని అంచనా. అందులోనూ రోజూ తాగేవారు చాలా తక్కువ. పండగకు, ఫంక్షన్‌కు, పార్టీల పేరుతో తాగేవారే ఎక్కువ మంది ఉన్నారు. మద్యం బాగా అలవాటైన వారు రోజూ తాగుతుంటారు. అలాంటివారు సగటున రోజుకు 3 క్వార్టర్ల వరకు తాగుతారని అంచనా. వారు ఎక్కువగా చీప్ లిక్కర్ లేదా మీడియం రకం బ్రాండ్లు తాగుతుంటారు. అందువల్ల వారు మద్యంపై చేసే ఖర్చు కూడా చాలా తక్కువ. పెద్ద ఐటీ కంపెనీలు, ఇతరత్రా పెద్ద కంపెనీలు ఉన్న నగరాల్లో మద్యం వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌కు అలాంటి నగరం ఒక్కటీ లేకపోవడం కూడా మద్యం వినియోగం పెరగకపోవడానికి ఒక కారణం.

రాష్ట్రంలో ఎక్కువగా లిక్కర్ వినియోగమే..

తెలంగాణ, కర్ణాటకల్లో బీర్ వినియోగం ఎక్కువ. ఏపీలో లిక్కర్ ఎక్కువ తాగుతారు. సాధారణంగా ఎక్కడైనా వేసవిలో బీర్ అమ్మకాలు, శీతాకాలంలో లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా నమోదవుతాయి. కానీ ఏపీలో వేసవిలోనూ లిక్కరే ఎక్కువగా తాగుతుంటారు. బీర్‌లో తక్కువ ఆల్కాహాల్ శాతాన్ని ఇక్కడి ప్రజలు పెద్దగా ఇష్టపడరు. అలాగే సంక్రాంతి సమయంలో లిక్కర్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. కోడి పందేల కారణంగా సంక్రాంతి సమయంలో ఏపీలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి.

క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి

- నమ్మిన సిద్ధాంతం కోసం బలిదానానికీ వెనుకాడలేదు
- సమాజసేవలో కీలకంగా క్రైస్తవ సంఘాలు: చంద్రబాబు
- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

విజయవాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతం కోసం బలిదానానికి సైతం వెనుకాడని క్రీస్తు మార్గాన్ని అందరూ అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రపంచానికి శాంతి, ప్రేమ, దయ, కరుణ అందించిన క్రీస్తు మార్గంలో క్రైస్తవ సోదరులు, రాష్ట్ర ప్రజలు నడవాలని కోరారు. సోమవారం విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం అధికారికంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. క్రైస్తవ సంఘాలు సమాజసేవలో కీలకంగా వ్యవహరిస్తాయని కొనియాడారు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చే పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రుల వంటివి ప్రభుత్వాలు కట్టలేని సమయంలో క్రైస్తవ సంఘాలు కట్టి చూపించాయని ప్రశంసించారు. మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల అభిమాన నాయకుడు ఎన్టీ రామారావు కూడా క్రైస్తవ మిషనరీ పాఠశాలలోనే చదువుకున్నారని చెప్పారు. పాస్టర్లకు గౌరవవేతనంగా రూ.5వేలు ఇస్తున్నామని, గత ప్రభుత్వం క్రైస్తవులను మోసం చేసి ఆ గౌరవవేతనాలను మధ్యలోనే ఆపేసిందని ఆరోపించారు. ఆ బకాయిలతో కలిపి రూ.60 కోట్ల వరకు క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 24 సాయంత్రానికి అకౌంట్లలో వేస్తామని తెలిపారు. జెరూసలెం వెళ్లే క్రైస్తవులకు ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. 2025-26లో రూ.20 కోట్లతో 2 వేల మంది క్రైస్తవులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో మరుగున పడిన అభివృద్ధిని ఏడాదిన్నర కాలంలో పట్టాలెక్కించామని చంద్రబాబు చెప్పారు. ఐదేళ్లలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిందని, ఎంతలోతుకు వెళితే అంత భయమేస్తోందని వ్యాఖ్యానించారు. అనంతరం క్రైస్తవ మతపెద్దలు, పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను చంద్రబాబు కట్ చేశారు. తొలుత చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీస్తు జీవిత చరిత్రకు సంబంధించిన ఇతివృత్తాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఎవరి ఒత్తిడితో చేశారు?

- దైవ భక్తి ఉందంటూనే కల్తీ నెయ్యికి ఆమోదమా?
- చెవిరెడ్డిని ప్రశ్నించిన సీబీఐ సిట్



అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'దైవ భక్తి ఎక్కువని మీరు చెప్పుకొంటారు.. అలాంటిది ఎంతో ప్రాచుర్యం పొందిన, పవిత్రమైన తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు ఎలా ఆమోదం తెలిపారు' అని సీబీఐ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రశ్నించింది. మద్యం స్కాం కేసులో నిందితుడిగా ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడైన చెవిరెడ్డిని సోమవారం జైల్లోనే నాలుగు గంటల సేపు ప్రశ్నించారు. టీటీడీ ప్రతి రోజూ సేకరించే వేల కిలోల నెయ్యి సరఫరాలో నాణ్యతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు ఉంటాయి.. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏర్పడిన టీటీడీ పాలక మండలి.. నిబంధనలన్నీ పక్కనపెట్టి.. తమకు అనుకూలమైన వారికి టెండర్ దక్కేలా నిర్ణయం తీసుకుంది. ఒక టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేసి.. నాణ్యతకు తిలోదకాలిచ్చేలా ఆ కమిటీ చేసిన సిఫారసులను ఆమోదించింది. టీటీడీ బోర్డు ఆమోదించిన ఆ సిఫారసుల కమిటీలో చెవిరెడ్డి సభ్యుడిగా ఉన్నారు. దీంతో సిట్ ఆయన్ను విచారించింది. కల్తీ నెయ్యిని అనుమతించాలని అప్పట్లో ఎవరు ఒత్తిడి చేశారు.. ఎవరైనా సిఫారసు చేశారా.. మీ నిర్ణయమే నకిలీ నెయ్యి సరఫరాకు మార్గం చూపింది.. ఆలోచించకుండా ఇలాంటివి ఎలా ఆమోదించారు.. అని పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. అయితే టెక్నికల్ కమిటీలో తాను ఉన్నప్పటికీ అధికారులే అవన్నీ చూసుకున్నారని, తనకా విషయం ఏ మాత్రం తెలీదని చెవిరెడ్డి జవాబిచ్చినట్లు సమాచారం. ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న సిట్ అధికారులు.. అవసరమైతే మరోసారి వచ్చి విచారిస్తామని ఆయనకు చెప్పినట్లు తెలిసింది. కాగా.. అప్పట్లో నెయ్యి కొనుగోలు కమిటీలో సభ్యులైన ప్రస్తుత గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి, నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సిట్ అధికారులు త్వరలో ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు భారీ ప్రోత్సాహకాలు

- 2025-30 పాలసీని ప్రకటిస్తూ ఐటీ శాఖ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువులను తయారు చేసే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 2025-30ను ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఈ పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఈ ఏడాది ఏప్రిల్ 26న ఐటీశాఖ విడుదల చేసింది. ఎర్లీబర్డ్ పథకం కింద రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడి పెట్టిన తొలి పది కంపెనీలకు 50 శాతం పెట్టుబడి రాయితీని రెండు వాయిదాల్లో ఇస్తారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ ఎర్లీబర్డ్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే క్యాపిటల్ సబ్సిడీని లేదా కేంద్రం అందించే 100శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను తీసుకోవచ్చని రాష్ట్ర ఐటీ శాఖ వెల్లడించింది. ఫ్యాక్టరీ భవనాలకు మూడేళ్లపాటు అద్దెలో 50 శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుంది. ఎలక్ట్రిసిటీ డ్యూటీని ఆరేళ్లపాటు పూర్తిగా రద్దు చేస్తారు. రూ. 1,000 కోట్లు దాటి పెట్టుబడులు పెట్టిన సంస్థలకు పాలసీ మేరకు ఐదేళ్లపాటు టైలర్‌మేడ్ విధానంలో సబ్సిడీలను అందిస్తారు.

రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి: అయ్యన్న

కానూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'నేడు రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి. యువత రాజకీయాల్లోకి రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. యువత తీసుకునే నిర్ణయాల్లో వేగం ఉంటుంది. వారి అవసరం రాజకీయాలకు ఎంతో ఉంది' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. విజయవాడ కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కేవీ రావు సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ రాఘురామ కృష్ణరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ వర్సిటీ వైస్‌చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అయ్యన్న ప్రసంగించారు. 'సైబర్ నేరాలు పెరుగుతున్న ఈ కాలంలో సైబర్ భద్రతపై నైపుణ్యంగల యువత అవసరం. పోలీసులకు కూడా సైబర్ సెక్యూరిటీపై శిక్షణ అవసరం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్ కేంద్రం ఏర్పాటు కావడం ఇదే ప్రథమం' అని స్పీకర్ పేర్కొన్నారు. ఈ కేంద్రానికి తన పేరు పెట్టడంపై కాకినాడ సీపోర్ట్స్ సీఎండీ కేవీ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ఏర్పాటుకు కేవీ రావు రూ.1.36 కోట్లు అందజేశారు.

కోటి సంతకాలు ప్రజలు చేశారా?: సత్యకుమార్

భీమవరం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మంజూరు చేసిన వైద్య కళాశాలలను అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్మించకుండా వదిలేసింది. ఇప్పుడు అవే వైద్య కళాశాలలను పీపీపీ మోడల్‌లో నిర్మిస్తుంటే రాద్ధాంతం చేయడాన్ని మంత్రి సత్యకుమార్ తప్పుబట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సోమవారం వాజపేయి కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. 'కోటి సంతకాలు అని హడావుడి చేస్తున్నారు.. ఐదు కోట్ల మంది జనాభాలో సగటున ఐదుగురిలో ఒకరు సంతకం చేస్తే కోటి మంది అవుతారు. అసలు ఈ సంతకాలు ఎవరు పెట్టారో.. వాళ్లకైనా తెలుసా? ప్రేతాత్మలు, ఆత్మలు పెట్టాయా?' అన్నారు.

ఏఐజీ అమ్మిరెడ్డికి ప్రివిలేజెస్ కమిటీ నోటీసు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు అర్బన్ ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో 2020 నవంబరులో లోకేశ్ చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ... దళితులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా తప్పుడు ప్రచారాలు చేస్తే లీగల్‌గా యాక్షన్ తీసుకుంటామంటూ హెచ్చరించిన ఐపీఎస్ అధికారి ఆర్.ఎన్.అమ్మిరెడ్డి... శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీ ఆఫీసులో ఏఐజీగా పనిచేస్తున్న ఆయనను అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం జరగనున్న మండలి ప్రివిలేజెస్ కమిటీ భేటీకి హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసులో పేర్కొంది.

క్యాబినెట్ సమావేశం 29కి వాయిదా

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం వాయిదా పడింది. డిసెంబరు 24న జరగాల్సిన సమావేశం డిసెంబరు 29 ఉదయం 10.30 గంటలకు వాయిదా పడింది. 27వ తేదీ నాటికి ఆయా శాఖలు తమ ప్రతిపాదనలను పంపాలని జీఏడీ ఉత్తర్వులు జారీ చేసింది.

జగన్ క్షమాపణ చెప్పాలి: బుచ్చి రాంప్రసాద్

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీని సమర్థించిన జగన్ హిందువులకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరకామణిలో జరిగిన చోరీని సమర్థించిన జగన్‌కు హిందువులంటే ఎలాంటి అభిమానం ఉందో అర్థమవుతుంది. వైసీపీ వారికి అధికారం ఉన్నా లేకున్నా హిందూ మతంపై దాడి చేయడమే ఏకైక అజెండా అని రాంప్రసాద్ ఆరోపించారు.

ఆ మండలాలను నెల్లూరులో ఉంచండి: రామకృష్ణ



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం చంద్రబాబును కలిసిన ఆయన ఈమేరకు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు.

బాబు కేసుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా


విజయవాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుపై నమోదైన కేసులకు సంబంధించి ఇచ్చిన తీర్పుల ప్రతులివ్వాలంటూ దాఖలైన వ్యాజ్యంపై సోమవారం విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్, రైల్వే విశ్రాంత ఉద్యోగి వేము కొండలరావు తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మూడో పార్టీగా ఉన్న వ్యక్తి ఏదైనా కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను కోరుతూ కోర్టును ఆశ్రయించినప్పుడు వాటిని అందజేయాలని తీర్పులు ఉన్నాయన్నారు. అయితే కేసుతో సంబంధం లేని వ్యక్తులకు ఇటువంటి డాక్యుమెంట్లను ఇవ్వాల్సిన అవసరం లేదని సీఐడీ తరఫు సీనియర్ కౌన్సిల్ అఖిల్ పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలను విన్న అనంతరం న్యాయాధికారి భాస్కరరావు తదుపరి విచారణను 24కి వాయిదా వేశారు.

వెంకటేశ్ నాయుడు బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ నిందితుడు వెంకటేష్ నాయుడు(ఏ34) దాఖలు చేసిన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రియాంక స్పందిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు తెప్పించుకొని వాదనలు వినిపించేందుకు సమయమివ్వాలని కోరారు. పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నడిపిన ధీశాలి వాజపేయి

- బీజేపీ తమిళనాడు మాజీ అధ్యక్షుడు అన్నామలై
- ఏలూరు, భీమవరంలలో వాజపేయి విగ్రహాల ఆవిష్కరణ



ఏలూరులో ఆవిష్కరించిన వాజపేయి విగ్రహం వద్ద కేంద్ర మంత్రి వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, అన్నామలై, తపన చౌదరి, ఎమ్మెల్యే చింతమనేని తదితరులు

ఏలూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'వాజపేయి జీవితం.. విలువల విశ్వసనీయతకు నిదర్శనం. దేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నడిపిన ధీశాలి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి' అని బీజేపీ తమిళనాడు మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై కొనియాడారు. ఏలూరు ఆశ్రం సర్కిల్ సెంటర్‌లో పార్టీ ఏర్పాటు చేసిన వాజపేయి కాంస్య విగ్రహాన్ని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్, ఉపాధ్యక్షుడు తపన చౌదరిలతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాజపేయి సేవలకు స్ఫూర్తిగా అటల్-మోదీ సుపరిపాలన యాత్రను నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చొరవ అభినందనీయమని కొనియాడారు. 1999లో ప్రధానిగా వాజపేయి ఉన్నప్పుడు ఎన్డీఏ కన్వీనర్‌గా చంద్రబాబు ఉన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు సీఎంగా ఉన్న తరుణంలోనే రాష్ట్రంలోనే 19 వాజపేయి విగ్రహాలు ఏర్పాటు కావడం గొప్ప పరిణామమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన వాజపేయి కాంస్య విగ్రహాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమాలలో రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, మంత్రి కొలుసు పార్థసారథి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో సాంస్కృతిక కేంద్రం

- గడువులోగా క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం
- రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి
- సీఆర్డీఏ సమావేశంలో సీఎం ఆదేశాలు
- 103 కోట్లతో క్వాంటమ్ వ్యాలీ ప్రత్యేక భవనం



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

అమరావతి/గుంటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన 56వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను ఆమోదించారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన విషయాలపై సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాజధాని ప్రాంతంలో సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం అమరావతిలో ఇప్పటికే ఒక వేదిక నిర్మించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక కేంద్రం నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. ఆ కేంద్రానికి ఏ పేరు పెడితే బాగుంటుందో కూడా ఆలోచించాలని చెప్పారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా సాంస్కృతిక కేంద్రం నిర్మాణ చేపట్టాలన్నారు. భూములిచ్చిన రైతులకు కేటాయించే ప్లాట్ల లేఅవుట్ల వద్ద పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రాజధాని రైతుల సమస్యలను ఏవిధమైన జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో హోటళ్లు ఉండేలా చూడాలని, వాటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్‌తో పాటు సీఆర్‌డీఏ, ఏడీసీ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీలో ప్రత్యేక భవనాలు

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఎక్విప్‌మెంట్ కోసం ఒక ప్రత్యేక భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ నిర్ణయించిందని మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. సుమారు 43,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 103.96 కోట్ల అంచనాతో దీనికి టెండర్లు పిలిచి ఎల్-1ను ఖరారు చేశామన్నారు. క్వాంటమ్ వ్యాలీలో మరో రెండు భవనాల నిర్మాణాన్ని కూడా వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. సీఆర్‌డీఏ అథారిటీలో తీసుకున్న నిర్ణయాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. "అఖిలభారత సర్వీసు అధికారుల నివాసాల అంతర్గత సదుపాయాల పనుల కోసం రూ.109 కోట్ల విడుదలకు అథారిటీ ఆమోదం తెలిపింది. అమరావతి నిర్మాణానికి నాబార్డ్ మంజూరు చేసిన రూ. 7,500 కోట్లలో రూ. 1,502 కోట్లు విడుదల చేశాం. వాటిలో రూ. 100 కోట్లు సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పాలనా వ్యయానికి అనుమతి ఇచ్చాం. ఆసుపత్రి, యూనివర్సిటీ నిర్మాణానికి కేంద్ర ఆయుష్ శాఖకు 60 ఏళ్లపాటు ఎకరం రూపాయి చొప్పున 23 ఎకరాలు శాఖమూరులో లీజుకు ఇవ్వాలని ఉపసంఘం తీసుకున్న నిర్ణయానికి అథారిటీ ఆమోదం తెలిపింది. దీని ద్వారా ఆయుష్ శాఖ రూ. 750 కోట్లు ఖర్చు చేస్తుంది. అమరావతిని వరద నివారణకు నెదర్లాండ్స్ సంస్థతో డిజైన్స్ రూపొందించాం. కొండవీటి వాగు, పాల వాగు, గ్రావిటీ కెనాల్స్‌తో పాటు 6 రిజర్వాయర్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదించాం. ఇవి కాకుండా అధికంగా వచ్చే వరద ముప్పు నుంచి రక్షణగా మరో 22,500 క్యూసెక్కుల నీటిని బయటకు పంపడానికి చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా గుంటూరు చానల్ ద్వారా 4 వేల క్యూసెక్కులు బయటకు పంపేలా పంపింగ్ స్టేషన్ నిర్మిస్తాం. ఇప్పుడున్న పంపింగ్‌కు అదనంగా ఉండవల్లిలో మరో 8,500 క్యూసెక్కులు పంపింగ్ చేసే స్టేషన్‌ను రూ. 443.76 కోట్లతో ఏర్పాటు చేయడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. రాజధాని ఎల్‌పీఎస్ జోన్-8లో రూ. 1,358 కోట్లతో పనులను ఆమోదించాం. జరీబు, జరీబు కాని భూములపై రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించడానికి అధికారుల రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయించాం. 2014 డిసెంబరు 8న తీసిన శాటిలైట్ చిత్రాల ఆధారంగా జరీబు భూములపై నిర్ణయం ఉంటుంది" అని తెలిపారు.

నేడు సీఎం క్వాంటమ్ టాక్

క్వాంటమ్ వ్యాలీతో సాంకేతికంగా భారీ ముందడుగు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై టెక్ విద్యార్థులో అవగాహన పెంచేందుకు సిద్ధమైంది. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకున్నారు. సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన క్వాంటమ్ టాక్ పేరిట మంగళవారం ఉదయం 9.30 గంటలకు వర్చువల్‌గా ప్రసంగిస్తారు. క్వాంటమ్ ఐటీ కంపెనీలు, క్యూబిట్, వైసర్ సంస్థలతో సంయుక్తంగా ఏపీ ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ లెక్చర్ కోసం పదిరోజుల వ్యవధిలోనే 50 వేల మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ విద్యా సదస్సులో డిజిటల్ మాధ్యమం ద్వారా భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలు, క్వాంటమ్ కంప్యూటింగ్ దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్, భవిష్యత్తు లక్ష్యాలను సీఎం వివరించనున్నారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు ఐబీఎం, సీడాక్, టీసీఎస్ వంటి సంస్థలు క్వాంటమ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్‌లో శిక్షణను ఇవ్వనున్నాయి.

పర్యాటకుల భద్రతకో పాలసీ

- రాష్ట్రంలో పర్యాటకం సురక్షితమనే నమ్మకం కలిగించాలి: డిప్యూటీ సీఎం



దేవదాయ, ఆర్అండ్‌బీ, పర్యాటక శాఖల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రి దుర్గేశ్, అధికారులు

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటకుల భద్రతకు ఒక పాలసీ తేవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం అటవీ, పర్యాటక, దేవదాయ, రోడ్లు-భవనాల శాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. 'పర్యాటక ప్రదేశాల్లో ప్రత్యేక ప్రవర్తనా నియమావళి అమలు చేయాలి. రాష్ట్రంలో పర్యాటకం సురక్షితమనే భావం పర్యాటకుల్లో కలగాలి. టూరిజం హాట్ స్పాట్లలో హెలీ పోర్టులు అభివృద్ధి చేయాలి. రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల భద్రతకు 100శాతం భరోసా ఇవ్వాలి. పర్యాటకులకు కూడా ప్రవర్తనా నియమావళిని తీసుకొచ్చి, నిక్కచ్చిగా అమలు చేయాలి. మన్యంలో ప్రకృతి దృశ్యాలను వారసత్వ సంపదగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెలీ టూరిజం అభివృద్ధి చేయాలి. అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఆర్కిటెక్చర్ ఏర్పాటు చేయాలి. అంతరించిపోతున్న కళలకు పునరుజ్జీవం పోసేలా ఆర్కిటెక్చర్ ఉండాలి. మంగళగిరి, కొండపల్లి, సిద్ధవటం వంటి కొండ ప్రాంతాల్లో పర్వతారోహణకు అనుకూల పరిస్థితులు కల్పించాలి. కవుల గొప్పతనం భావితరాలకు తెలిసేలా గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ అప్పారావు, మొల్లమాంబ తదితరుల ఇళ్లను పరిరక్షించి, సాహితీ సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలి' అని పవన్ సూచించారు.

గల్ఫ్ దేశాల్లో కాలనాగులు

- సాయం పేరిట మృతుల భార్యలకు వేధింపులు
- దుబాయ్‌లో ఓ ప్రబుద్ధుడి బాగోతం వెలుగులోకి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎడారి దేశాలలో ఎవరైనా ప్రవాసీయులు మరణిస్తే వారి కుటుంబీకుల బాధ వర్ణనాతీతం. కేసుల ప్రక్రియ పూర్తి చేయడానికి మృతుల కుటుంబ సభ్యులు అల్లాడిపోతుంటారు. పరాయి దేశంలో సహాయం కోసం తెలిసిన ప్రతి గడప తొక్కుతారు. ఈక్రమంలో భర్తను కోల్పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళలపై కొందరు కాలనాగులు కన్నేస్తున్నారు. మానవత్వం మరచి మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. సేవల పేరిట మృతుల కుటుంబాల మహిళలను వేధిస్తున్నారు. వివిధ కారణాలతో దుబాయిలో మరణించే తెలుగు ప్రవాసీయుల మృతదేహాల తరలింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని, అందుకోసం తమ కోరిక తీర్చాలని ఒత్తిడి చేస్తున్నారు. వీరిలో కొందరు సామాజికసేవకులుగా, మరికొందరు రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్నారు. కష్టాల్లో ఉన్న బాధిత మహిళల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్న కొందరి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 'దుబాయ్ నుంచి విజయవాడ వరకు నా మాట చెల్లుబాటు అవుతుంది. మీరు ముఖ్యమంత్రికి చెప్పినా కేసు నాకే వస్తుంది. విజయవాడలో సంప్రదించే బదులు నన్ను సాయంత్రం ఒకసారి ఇంట్లో కలిస్తే మీ పని అయిపోతుంది' అంటూ దుబాయ్‌లో ఓ ప్రవాసాంధ్రుడు మహిళలపై ఒత్తిడి చేస్తున్నాడని తెలుస్తోంది. సదరు వ్యక్తి టీడీపీ నాయకుడినని చెప్పుకొంటున్నాడు. దుబాయ్‌లో ఇళ్లలో పాచి పనులు చేసుకునే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కొందరు పేద మహిళలు సదరు వ్యక్తి బారినపడ్డ వారిలో ఉన్నారు. ఇటీవల మరణించిన ఒక ప్రవాసాంధ్రుడి కేసులో దుబాయ్‌లోనే పనిచేసుకుంటున్న అతడి భార్యను తన వద్దకు రావాల్సిందేనని పట్టుబట్టినట్లు తెలిసింది. గతంలో కూడా ప్రమాదంలో మరణించిన ఓ మృతుడి భార్యను ఇదే విధంగా ఒత్తిడి చేయగా, ఆమె నిరాకరించి తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయినట్టు తెలిసింది. వివిధ సమస్యలు, ప్రత్యేకించి స్వదేశానికి తిరిగి వెళ్లడానికి సహాయం కోసం ఎదురు చూసే మహిళలను కూడా తన పడకగదికి వస్తే మీ సమస్యలను తీరుస్తానని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఏపీ నుంచి దుబాయ్ పర్యటనకు వచ్చే ప్రతి నాయకుడి పక్కన దర్శనం ఇచ్చే ఆ వ్యక్తి ప్రవర్తనపై గతంలో విజయవాడలో టీడీపీ నాయకుల దృష్టికి కొందరు మహిళలు తీసుకెళ్లినట్టు తెలిసింది. పొరుగున ఉన్న మరో గల్ఫ్ దేశంలో కూడా సహాయం పేరిట ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కొందరు పనిమనుషులను (హౌజ్ మెయిడ్స్) శారీరకంగా వాడుకున్న కేసులో ఒక ప్రవాసాంధ్ర ప్రముఖుడ్ని అధికారులు 24 గంటలలో దేశం నుంచి బహిష్కరించారు. అతడు కూడా టీడీపీ నాయకుడిగా ఒకప్పుడు చలామణి అయ్యాడు. హుండి వ్యాపారస్థులు, అధిక వడ్డీలకు అప్పులకు ఇచ్చే వాళ్లు కూడా దుబాయ్, ఇతర గల్ఫ్ దేశాలలో రాజకీయ పార్టీల నాయకులుగా అవతారమెత్తుతున్నారు. కేవలం ప్రచార్భాటం కోసం ఇలాంటి వ్యక్తుల హడావుడి ఎక్కువవుతోంది.

ఖర్చు 25 దోపిడీ 75

- నకిలీ మద్యం ముఠాకు కాసుల వర్షం
- ఒక్కో సీసాపై అద్దేపల్లి గ్యాంగ్‌కు 50%
- బ్లెండ్ సరఫరా చేసిన బాలాజీకి 20%

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మేం ట్యాక్స్ పేయర్లం. మేం తాగకపోతే ప్రభుత్వాలు నడవవు'.. ఓ సినిమాలో హాస్య నటుడు సరదాగా చెప్పే డైలాగ్ ఇది. ఇందులో వాస్తవం లేకపోలేదు. ప్రజలు కొనుగోలు చేసే వస్తువుల్లో అత్యధిక పన్నులు చెల్లించేది ఒక్క మద్యానికే. ప్రతి మద్యం సీసా మొత్తం ధరలో దాదాపు 75 శాతం ప్రభుత్వానికి పన్ను రూపంలో వస్తుంది. మద్యం వ్యాపారంలో ఉత్పత్తిదారులు, షాపుల లైసెన్సీలకు మిగిలే లాభంతో పోలిస్తే ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చేది భారీగా ఉంటుంది. అద్దేపల్లి సోదరులు, లిక్కర్ గ్యాంగ్ చిన్నపాటి లాభాలతో సరిపెట్టకుండా అసలు పన్నులకే ఎసరు పెట్టాలనే ఉద్దేశంతో నకిలీ మద్యం దందా మొదలుపెట్టారు. నకిలీ మద్యం ఉత్పత్తి, అమ్మకాలలో వారు చేసిన ఖర్చుకు, పొందిన లాభాలకు 'కొండంత' తేడా ఉంది. ప్రభుత్వం కళ్లుగప్పి అతి తక్కువ ఖర్చుతో అత్యధిక లాభాలు పొందారు. కొందరు రాజకీయ నేతలూ ఇందులో ఉన్నారనే అభియోగాలున్నాయి. నకిలీ మద్యం తయారీకి బ్లెండ్ సరఫరా చేసిన బెంగళూరుకు చెందిన బాలాజీకి కూడా భారీ లాభాలు వచ్చాయి. ఎక్సైజ్ శాఖ పరిశీలనలో ఈ అంశాలు వెలుగుచూశాయి. సిట్, ఎక్సైజ్ శాఖలు దీనిని నకిలీ మద్యం నేరంగా పరిగణించి మాత్రమే విచారణ చేస్తున్నాయి. ఇందులో ఆర్థిక లబ్ధి కోణంలో విచారణ జరగడం లేదని సమాచారం.

ఎలా తయారు చేశారంటే..

గోవా నుంచి బాలాజీ నకిలీ మద్యం తయారీకి అవసరమైన బ్లెండ్ సరఫరా చేశాడు. బ్లెండ్ అంటే బాటిలింగ్‌కు సిద్ధం చేసిన మద్యం ద్రావణం. ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ) లేదా రెక్టిఫైడ్ స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తారు. రెక్టిఫైడ్ స్పిరిట్‌ను మరింత ప్యూరిఫై చేస్తే ఈఎన్ఏగా మారుతుంది. ఏపీలో ఈఎన్ఏతోనే మద్యం ఉత్పత్తి చేయాలనే నిబంధన ఉంది. నకిలీ మద్యంలో ఈఎన్ఏ వాడారా? లేదా రెక్టిఫైడ్ స్పిరిట్ వాడారా? అనేది తెలియలేదు. దానికి కారెమెల్(ఫ్లేవర్), రంగు కలిపితే అది బ్లెండ్‌గా మారుతుంది. అయితే కారెమెల్, రంగు కలిపిన తర్వాత దాన్ని బ్లెండింగ్ ప్రాసెస్ చేయాలి. ఈ ప్రక్రియ గోవా లేదా కర్ణాటక రాష్ట్రాల్లో జరిగింది. అక్కడి నుంచి 30 లీటర్ల క్యాన్లలో బ్లెండ్‌ను ములకలచెరువు, ఇబ్రహీంపట్నం పంపించారు. ఇక్కడ దాన్ని బాటిలింగ్ చేసి విక్రయించారు.

ఎంత ఖర్చు పెట్టారంటే..

ఒక లీటరు బ్లెండ్‌తో 5.5 క్వార్టర్ సీసాల మద్యం తయారు చేశారు. ఒక్కో క్వార్టర్ ఉత్పత్తికి రూ.45 విలువైన బ్లెండ్ వినియోగించారు. ప్లాస్టిక్ ఖాళీ సీసాకు ఒక రూపాయి వెచ్చించారు. మూతకు మరొక రూపాయి, సీసాపై అంటించే లేబుల్‌కు 20 పైసలు ఖర్చు చేశారు. బ్లెండ్ కాకుండా ఇతర ఖర్చు రూ.3 కూడా అవ్వలేదు. మొత్తం కలిపినా సీసాకు రూ.48 ఖర్చు అయ్యింది. దానిని వారి మద్యం షాపుల్లో రూ.100కు విక్రయించారు. అందులో రూ.50కు పైగా లాభం అద్దేపల్లి సోదరులతో పాటు లిక్కర్ గ్యాంగ్‌కు వచ్చింది. ఒక్కో సీసా తయారీకి అవసరమయ్యే బ్లెండ్‌ను బాలాజీ రూ.45కు విక్రయించాడు. వాస్తవంగా ఒక క్వార్టర్ సీసా తయారీకి అయ్యే బ్లెండ్ ఖర్చు రూ.15 దాటదు. అక్రమంగా తీసుకురావడం వల్ల ఖర్చు పెరిగినా ఒక్కో సీసాకు అదనంగా రూ.10 నుంచి రూ.15 అవుతుంది. కానీ ఏకంగా రూ.45 వసూలు చేశాడు. బాలాజీకి పెట్టుబడి లేకుండా భారీ లాభం చేకూరింది.

ప్రభుత్వానికి సీసాకు 70 నష్టం

నకిలీ మద్యాన్ని అధికారిక షాపుల్లోనే అసలు మద్యం అని నమ్మించి అమ్మారు. అది నకిలీ మద్యం కాకపోయి ఉంటే వాటిపై పన్నులు ప్రభుత్వానికి వెళ్లేవి. ఒక్కో సీసాను రూ.100కు విక్రయించిన నకిలీ మద్యంలో అద్దేపల్లి సోదరులు, లిక్కర్ గ్యాంగ్‌కు రూ.50 వరకు, బాలాజీకి రూ.20 లాభం వచ్చింది. ఎక్సైజ్ దాడుల్లో సుమారు 5 వేల కేసుల మద్యం తయారు చేసినట్లు తేలింది. ఆ మేరకు ఖాళీ క్యాన్లు దొరికాయి. 5 వేల కేసుల మద్యం అంటే.. దాని విలువ సుమారు రూ.2.4 కోట్లు ఉంటుంది. అందులో ఖర్చు పోగా బాలాజీ, అద్దేపల్లి సోదరులు, ఇతర భాగస్వామ్యులకు రూ.1.68 కోట్లు వెళ్లింది. అయితే ఇది ఎక్సైజ్ దాడుల సమయంలో దొరికింది మాత్రమే. 2023లో ప్రారంభించిన నకిలీ మద్యం దందాలో ఎంతమేర మద్యం విక్రయించారనేది తేలాలి.



వైసీపీ హయాంలోనే మొదలు

వైసీపీ ప్రభుత్వంలో నకిలీ మద్యం దందా మొదలైంది. నకిలీ మద్యం విక్రయిస్తున్న ప్రాంతాల్లోని షాపులు, బార్లలో అమ్మకాలు తగ్గాయి. అమ్మకాలు ఎందుకు తగ్గాయనేది అప్పట్లోనే గుర్తించి ఉంటే ఈ దందా అప్పట్లోనే వెలుగులోకి వచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మకాలు తగ్గినా ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు నకిలీ మద్యం దందా చేసిన వారు చాలా తెలివిగా వ్యవహరించారు. చీప్ లిక్కర్‌లో తక్కువ ధర ఉండే మద్యం బ్రాండ్ల పేర్లతో తక్కువ ధర మద్యాన్నే అమ్మారు. ఎక్కువ ధర మద్యాన్ని నకిలీ చేస్తే అనుమానం వస్తుందని, అతి తక్కువ ధరకు అమ్మే బ్రాండ్లను ఎంచుకుని నకిలీ చేశారు.

ప్రతి సీసాకు ఓ నంబర్!

- బ్రాండ్, బ్యాచ్, తయారీ తేదీ, సమయంతో కూడిన 18 అంకెల గుర్తింపు సంఖ్య
- నకిలీ మద్యం కట్టడికి త్వరలో వినూత్న విధానం

అమరావతి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కట్టడికి ప్రభుత్వం వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొట్టమొదటి సారిగా మద్యం సీసాలకు ప్రత్యేక గుర్తింపు నెంబరు (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్-లిన్) తీసుకురానుంది. ప్రస్తుతం ఒక్కో బ్యాచ్‌కు ఒక క్యూఆర్ కోడ్ విధానం అమల్లో ఉంది. ఒక బ్యాచ్ అంటే రెండు లక్షల సీసాల వరకు ఉత్పత్తి అవుతాయి. కొత్త విధానంలో ప్రతి సీసాకు ఒక ప్రత్యేక నంబరు ఇస్తారు. పైగా దీన్ని మొబైల్‌లో స్కాన్ చేసి చూడాల్సిన అవసరం లేదు. అందరికీ అర్థమయ్యేలా సీసాలపైనే ఆ నెంబరు కనిపిస్తుంది. ఆ నంబరుతో మరో సీసా కనిపిస్తే.. దాన్ని నకిలీ మద్యంగా గుర్తిస్తారు. బ్రాండ్, బ్యాచ్, తయారీ తేదీ, మిల్లీసెకన్ల సహా ఉత్పత్తి సమయంతో కలిపి మొత్తం 18 అంకెల సంఖ్య ఉంటుంది. 'లిన్'పై ఎక్సైజ్ శాఖ చేసిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై జరిగిన సమీక్షలో సీఎం దీనిపై మాట్లాడారు. నకిలీ మద్యం నియంత్రణకు 'లిన్'ను వీలైనంత త్వరగా తీసుకురావాలని ఆదేశించారు. ఇది సాధారణ ప్రజలు కూడా సులభంగా గుర్తించేలా ఉండాలన్నారు. అలాగే మద్యం షాపుల రేషనలైజేషన్‌పై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. 'మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలి. ఆదాయమే లక్ష్యంగా పాలసీలు ఉండకూడదు' అని అన్నారు.

పెరిగిన మద్యం విక్రయాలు

2024 అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు రూ.8 వేల కోట్ల ఎక్సైజ్ ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా రూ.7,041 కోట్లు వచ్చిందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాలు 4.52 శాతం పెరిగాయని తెలిపారు. డిసెంబరు నుంచి మార్చి నాటికి మద్యం ద్వారా వచ్చే మొత్తం రూ.8,422 కోట్లు ఉండొచ్చని అంచనా వేశామన్నారు. మొత్తంగా ఆర్థిక సంవత్సరంలో 3 శాతం వృద్ధి నమోదవుతుందన్నారు. తెలంగాణ కన్నా ఏపీలో తలసరి మద్యం వినియోగం తక్కువగా ఉందని.. తెలంగాణలో 4.74 లీటర్లు కాగా, ఏపీలో అది 2.77 లీటర్లు ఉందని వివరించారు. మద్యం అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతం పెరిగాయన్నారు. కొన్ని జిల్లాల్లో 40 నుంచి 47 శాతం డిజిటల్ చెల్లింపులు నమోదయ్యాయన్నారు. డిజిటల్ చెల్లింపులు పెరిగేలా వినియోగదారుల్లో అవగాహన పెంచాలని సీఎం సూచించారు.

సబ్ లీజు విధానంపై అధ్యయనం చేయండి

బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. బెల్టుల కట్టడికి హరియాణా రాష్ట్రం తరహా సబ్ లీజు విధానంపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు లేకపోవడం వల్ల బెల్టు సమస్య పెరిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఖాళీ మద్యం సీసాలను తిరిగి ఇస్తే.. నగదు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. సమీక్షలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, సీహెచ్ శ్రీధర్, రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

ఉన్మాదిపై పోలీసు తూటా

- మద్యం మత్తులో యువకుడిని పొడిచి పరార్
- పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపైనా కత్తితో దాడి
- కాలిపై కాల్పులు జరిపి నిందితుడిని పట్టుకున్న సీఐ
- అనంతలో మాఫియా సినిమాను తలపించే ఘటన

అనంతపురం క్రైం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒకరిని పొడిచి పరారైన ఓ ఉన్మాదిని పోలీసులు పట్టుకోవడానికి వెళ్లగా వారిపైనా కత్తి దూశాడు. ఈ దాడిలో పోలీసు ఇన్‌స్పెక్టర్ సైతం గాయపడగా, ఆయన నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. మాఫియా సినిమాను తలపించే ఈ ఘటన అనంతపురం జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం అరవింద నగర్‌లోని ఓ కేఫ్ వద్ద దేవరకొండ అజయ్, చాకలి రాజా, సొహైల్, అక్రమ్ అనే నలుగురు ఆదివారం రాత్రి మద్యం తాగారు. మద్యం విషయంలో రాజా, అజయ్ మధ్య గొడవ జరిగింది. రాజాను అజయ్ కత్తితో పొడిచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు, సోమవారం ఉదయం నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లారు. ఆటో డ్రైవర్ బాబాతో(పోలీసు ఇన్‌ఫార్మర్) కలిసి సీఐ శ్రీకాంత్ యాదవ్, సిబ్బంది నగర శివారులోని షికారి కాలనీలో అజయ్ ఉన్నట్లు గుర్తించి రౌండప్ చేశారు. దీంతో అజయ్ తిరగబడ్డాడు. కత్తితో బాబా కడుపులో పొడిచాడు. దీంతో బాబాకు పేగులు బయటకు వచ్చాయి. పట్టుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుళ్లు, స్థానికులను కూడా కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. పోలీసుల నుంచి తప్పించుకుని, కాలనీ వెనుకవైపు ఉన్న చెరువులోకి దూకి ఆకుతోటపల్లి వైపు పారిపోయాడు. బాబాను ఆసుపత్రికి తరలించి.. నిందితుడిని వెంబడించిన పోలీసులు చెరుకుతోట వద్ద ఏపుగా పెరిగిన గడ్డిలో దాక్కున్నట్లు గుర్తించారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ గడ్డి తోపులోకి వెళ్లి లొంగిపోవాలని కేకలు వేస్తుండగా అతనిపైనా నిందితుడు కత్తితో దాడి చేశారు. దీంతో సీఐ ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. సీఐ హెచ్చరిస్తున్నా గాల్లోకి కాల్పులు జరిపినా లొంగకపోవడంతో అజయ్ కుడికాలిపై కాల్చారు. బుల్లెట్ గాయమై నిందితుడు కిందపడిపోగానే అదుపులోకి తీసుకుని, అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. సీఐ శ్రీకాంత్‌కు సర్వజన వైద్యశాలలో చికిత్స చేశారు. అజయ్ చేతిలో గాయపడిన చాకలి రాజా, ఆటో డ్రైవర్ బాబా చికిత్స పొందుతున్నారు. బాబా పరిస్థితి విషమంగా ఉంది. సీఐ శ్రీకాంత్‌ను ఎస్పీ జగదీశ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అజయ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


నిందితుడు అజయ్‌ను అదుపులోకి తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ఏ నా కొడుక్కీ భయపడాల్సిన పనిలేదు..

- వివాదాస్పద ఫ్లెక్సీ పెట్టిన పది, ఇంటర్ విద్యార్థులు
- బుద్ధిగా ఉండాలని కౌన్సెలింగ్ ఇచ్చిన న్యాయాధికారి



కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం గరికపర్రులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తోట్లవల్లూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, కార్యకర్తల 'రప్పా.. రప్పా', 'నరుకుడు..' బాష పది, ఇంటర్ చదివే పిల్లల్లోనూ నేర ప్రవృత్తిని రెచ్చగొడుతోంది..! 'రప్పా.. రప్పా..' అంటూ రెచ్చగొడుతున్న వారిని గుడ్డిగా ఫాలో అవుతూ.. "ఉంటే ఉంటాం పోతే పోతాం... ఏ నా కొడుక్కీ భయపడాల్సిన అవసరం మాకు లేదు' అంటూ జగన్ పుట్టినరోజు సందర్భంగా వివాదాస్పద ఫ్లెక్సీని ఏర్పాటుచేసిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జగన్ జన్మదినం సందర్భంగా ఆదివారం కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం గరికపర్రు సెంటర్లో ఇంటర్, టెన్త్ చదువుతున్న వీరంకి ఈశ్వర్, పామర్తి నాగ వెంకట బాపూజీ ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దానిపై అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ కార్యకర్త వీరంకి చిరంజీవి.. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఎస్సై సీహెచ్ అవినాశ్ సోమవారం వారిని ఉయ్యూరు కోర్టులో హాజరు పర్చారు. టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు కావడంతో న్యాయాధికారి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి... మీకు రాజకీయాలతో పనేంటని, ఇకనైనా బుద్ధిగా ఉండాలని సూచించినట్టు తెలిసింది.

పశువధ రాకెట్ ఆటకట్టు

- గో మాంసం కేసులో ముగ్గురి అరెస్టు
- విశాఖలోని ఎగుమతిదారు సహా ఇద్దరికి రిమాండ్

ఆనందపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం శొంఠ్యాం సమీపంలోని శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో గో మాంసం పట్టుపడిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు డీసీపీ-1 వి.ఎన్. మణికంఠ చందోలు తెలిపారు. గోవులను వధించి మాంసాన్ని ఇతర దేశాలకు తరలిస్తున్నారనే సమాచారంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఇటీవల కోల్‌కతా, గుజరాత్, విశాఖపట్నం తదితర పోర్టుల్లో తనిఖీలు చేసి, మాంసాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో పశుసంవర్ధక శాఖకు అందిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో తనిఖీలు నిర్వహించారు. మి.మిస్ ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ద్వారా విదేశాలకు ఎగుమతికి సిద్ధంగా ఉన్న మాంసం నుంచి ఆరు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. అందులో మూడు నమూనాలు (87,945 కిలోలు) ఆవు మాంసం, రెండు నమూనాలు (37,656 కిలోలు) ఎద్దు మాంసం, ఒక నమూనా (18,720 కిలోలు) గేదె మాంసంగా తేలిందని డీసీపీ మణికంఠ వెల్లడించారు. గో మాంసాన్ని ఎగుమతిచేస్తున్న మి.మిస్ ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ యజమాని ఎం.డి.ఫర్వాన్‌ను అరెస్టు చేసి విచారించగా దీని వెనుక పెద్ద రాకెట్ ఉందని గుర్తించామన్నారు. గోమాంసం సరఫరాదారులు మన్సూర్ అలీని గుజరాత్‌లో, రషీద్ ఖురోషిని ఉత్తర ప్రదేశ్‌లో అరెస్టు చేసి తీసుకువచ్చి, రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ఆరుగురి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ హనుమంతరావు

పేట ముఠాలో నలుగురు అరెస్టు

- పరారీలో ఇద్దరు.. 20 కార్లు స్వాధీనం: ఎస్పీ
- కేసు విచారణను నీరుగారుస్తున్న పోలీసులు!

నరసరావుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సంచలనం కలిగించిన నరసరావుపేట కార్ల చోరీ గ్యాంగులో నలుగురిని అరెస్టు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు తెలిపారు. డీఎస్పీ హనుమంతరావు, సీఐ సుబ్బారావుతో కలసి ఆయన సోమవారం మీడియాకు ఈ ముఠా ఆగడాలను వివరించారు. మీడియా సమావేశం తరువాత పోలీసులు ఈ కేసు విచారణను నీరుగారుస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు పుల్లంశెట్టి భానుప్రకాశ్(నరసింగపాడు)తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు చూపించిన పోలీసులు ముఠాలో ఇంకా ఇద్దరు పరారీలో ఉన్నారని, మొత్తం 20 కార్లను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. తక్కువ ధరకు వస్తుండడంతో కొందరు పోలీసు అధికారులు కార్లు కొన్నమాట నిజమేనంటూ ఎస్పీ అంగీకరించారు. అయితే స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎవరి నుంచి రికవరీ చేశారు? ఏఎస్ఐ శ్రీనివాసరావును ఎందుకు సస్పెండ్ చేశారు? నకిలీ నంబరు ప్లేట్లతో ఉన్న కార్లను కొనుగోలు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? వంటి అనేక ప్రశ్నలకు సమాధానమే లేదు. దీంతో పోలీసులు ఈ కేసు విచారణను మమ అనిపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గర్భిణి గొంతు నొక్కి.. కడుపుపై తన్ని..

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నాయకులు బాణసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఆ భారీ శబ్ధాల ధాటికి తీవ్రంగా ఇబ్బంది పడిన గిరీశ్‌బాబు భార్య అయిన ఏడు నెలల గర్భిణి సంధ్యారాణి... తమ ఇంటివద్ద బాణసంచా కాల్చవద్దని వైసీపీ నేతలను కోరారు. దీంతో వైసీపీ వర్గీయులు గొడవకు దిగారు. 'రోడ్డు మీ నాయనదా..?' అని దూషిస్తూ అజయ్‌దేవ్ అనే వైసీపీ నాయకుడు సంధ్యారాణి గొంతు పట్టుకుని, కడుపు మీద కాలితో బలంగా తన్నాడు. దీంతో ఆమె కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను 108లో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. స్కానింగ్ చేయాలని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం బాధితురాలు కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తన కడుపులోని శిశువు రాత్రి నుంచి కదలడం లేదని సంధ్యారాణి కన్నీరు పెట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు సంధ్యారాణిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం పరామర్శించారు. ఆందోళన చెందవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోండి: మహిళా కమిషన్

సత్యసాయి జిల్లాలో గర్భిణిపై దాడి ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని సోమవారం ఆదేశించారు. జగన్ పుట్టినరోజు వేడుకల పేరిట.. టపాసులు పేల్చడమే కాకుండా.. గర్భిణి అని తెలిసినా ఆమెపై దాడికి పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి క్రూరత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఘటనపై జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు.

'రక్తాభిషేకం'.. 34 మందిపై కేసులు

జగన్ పుట్టినరోజు వేడుకల్లో మూగజీవాలను బలి ఇచ్చి, ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేసిన వైసీపీ నాయకులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. మొత్తం 34 మందిపై కేసులు నమోదు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీఐజీ షిమోషి ఆదేశాలతో మొత్తం 26 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 13 మందిని అరెస్టు చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. మరో ముగ్గురిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేశారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం వీర్నమలలో జగన్ ఫ్లెక్సీ ఎదుట మేకను బలిచ్చిన 8 మందిపై కేసులు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్త ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు రామకుప్పం పోలీసులు.. వైసీపీ నేతలు మునస్వామి (మంచి), మణి, శశి, మురళీతో పాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు.


ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ఆదివారం రాత్రి ఎస్ఐతో వాగ్వాదానికి దిగిన వైసీపీ కార్యకర్తలు

పోలీసులపై సర్పంచ్, వైసీపీ కార్యకర్తల దౌర్జన్యం

పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యానికి దిగిన ముగ్గురు వైసీపీ కార్యకర్తలతో పాటు గ్రామ సర్పంచ్‌పై కేసు నమోదైంది. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని దొరసానిపాడులో కొందరు పబ్లిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారంటూ ఆదివారం రాత్రి 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధీర్, హోంగార్డు జయప్రకాష్ బాబు, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లారు. జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని దొరసానిపాడు పంచాయతీ ముందు వైసీపీ కార్యకర్త పి.మంగరాజు మోటార్ బైక్‌తో రోడ్డుపై విన్యాసాలు చేస్తున్నాడు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఆయన సర్పంచ్ లక్కాబత్తుల సిద్దిరాజు, లక్కాబత్తుల రాజు, మహేశ్‌తో కలిసి పోలీసులను దుర్భాషలాడుతూ కాలర్ పట్టుకుని పక్కకు నెట్టాడు. దీంతో ఈ నలుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, ద్వారకాతిరుమల మండలం రామశింగవరంలో జగన్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో "మ్యాజిక్ ఫిగర్ 88 దాటగానే.. 2029లో గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్టు రప్పా.. రప్పా నరుకుతాం.. ఒక్కొక్కడిని.." అని రాశారు. టీడీపీ కార్యకర్త దొప్పసాని బాబూరావు ఫిర్యాదు మేరకు.. ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బిరుదుగడ్డ రాజు, కనికెళ్ల రవికిషోర్, మద్దాల దిలీ ప్‌కుమార్, మానుకొండ రాజ్‌కుమార్, కుండ శ్యాంబాబు, మానుకొండ హిమకుమార్‌లతో పాటు ఫ్లెక్సీని ముద్రించిన రాయల్ ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపు యజమాని హేమంత్‌పై కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.